అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 1-7-2023 www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 181 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

తమిళనాడు గవర్నర్‌ను తొలగించండి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : తమిళనాడు మంత్రివర్గం నుంచి మంత్రి సెంథిల్ బాలాజీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎస్ రవి తొలగించడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. గవర్నర్ పదవి నుంచి ఆర్ ఎస్ రవిని వెంటనే వెనక్కి పిలవాలని భారత రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి సలహా లేకుండా మంత్రులను నియమించే లేదా తొలగించే హక్కు గవర్నర్‌కు లేదని, ఈ చర్య పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని పొలిట్‌బ్యూరో తెలిపింది. రాష్ట్ర రాజకీయాల్లో, రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో జోక్యం చేసుకునే విధంగా ఆర్ఎస్ రవి వరుసగా చర్యలకు

...9లో

హృదయ విదారకం — మణిపూర్‌లో పరిస్థితులపై రాహుల్ వివరాలు 9లో..

బీజేపీలోనూ కేసీఆర్ కోవర్టులు — ఇతరుల గౌరవానికి భంగం కలిగించొద్దని చురకలు.. ఈటల కౌంటర్ ఎటాక్ వివరాలు 6లో..



కలిసే ముందుకెళ్తాం

సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడి సమావేశం నిర్ణయం

- పొత్తుల కోసం వెంపర్లాడం
- బలమున్న నియోజకవర్గాల్లో పనిచేస్తున్నాం
- మా రాజకీయ విధానంలో మార్పులేదు
- కాంగ్రెస్‌తో వెళ్తామన్నది నిరాధార ఆరోపణ
- బీజేపీకి వ్యతిరేక శక్తులను ఏకం చేయడమే మా లక్ష్యం
- అవసరమైతే ఆ ఉద్యమానికి కేసీఆర్ నాయకత్వం వహించాలి
- పోడు భూముల సమస్య పరిష్కారం కాలేదు
- 11 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలివ్వాలి : తమ్మినేని, కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కమ్యూనిస్టులం కలిసే ముందుకు సాగుతాం'. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో చావైనా, రేవైనా కలిసే ఉండాలని నిర్ణయించాం. అలాగే ముందుకెళ్తాం. కమ్యూనిస్టుల్లేని అసెంబ్లీ, పార్లమెంటు దేవుడు లేని దేవాలయం లాంటిది. ప్రజలు దాన్ని గుర్తిస్తున్నారు. మా స్ఫూర్తిని, ఐక్యతను ప్రజలు ఆదరించాలి.'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు.

'కష్టం వచ్చినా, నష్టం వచ్చినా కలిసుండాలని నిర్ణయించాం. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడిన ఘనత సీపీఐ, సీపీఐ(ఎం)కు దక్కింది. దానిపై అనేక విమర్శలు వచ్చినా ప్రజలకు, ఇరు పార్టీల కార్యకర్తలకు బీజేపీ ప్రమాదాన్ని వివరించి చెప్పాం. మంచి ఫలితం వచ్చింది. మునుగోడులో బీజేపీ గెలిస్తే ఎమ్మెల్యేల కొనుగోలుకు ఓ సాధనంగా ఉపయోగపడేది. బీఎల్ సంతోష్

...9లో

పోడు రైతులపై కేసులు రద్దు

గిరిజన లబ్దిదారులకు పోడు పట్టాలు పంపిణీ

- కుమురంభీం-ఆసిఫాబాద్‌లో ప్రారంభించిన సీఎం కేసీఆర్
- రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు పట్టాలతోపాటు రైతుబంధు
- 75ఏండ్లు సాగులో ఉన్నట్టు ఆధారాలు చూపితే గిరిజనేతరులకూ పట్టాలు
- గిరిజన గూడేలు.. తండాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం
- ధరణి పోతే పైరవీకారులు దోచుకుంటారని వ్యాఖ్య
- సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభం

రాష్ట్రంలో 4లక్షల ఎకరాలకు పోడు పట్టాలు అందిస్తున్నాం.. ఈ ప్రక్రియ కుమురంభీం జిల్లా నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉంది. కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలో 47వేల ఎకరాలకు పోడు పట్టాలు అందజేస్తున్నాం.. అవి కూడా మహిళల పేరున ఇస్తున్నాం.. పట్టాలతోపాటు రైతుబంధు నిధులు కూడా జమ చేస్తాం.. పోడు లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చాక కూడా వారిపై కేసులు ఉంటే బాగుండదు.. ఆ కేసులన్నీ ఎత్తేస్తాం.. ఇకపై వారిపై ఎలాంటి కేసులూ ఉండవు.. మరోపక్క పొలాలకు రూ.300కోట్లతో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం.."

- ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



వివరాలు 9లో..

ఒక్కో స్టేడియానికి రూ.50 కోట్లు!

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మెగా ఈవెంట్‌కు మరో 97 రోజుల సమయమే ఉంది. ఐసీసీ ప్రపంచకప్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆతిథ్యం అందించేందుకు సిద్ధమవుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తొలుత స్టేడియాల ఆధునీకరణపై దృష్టి నిలిపింది. ప్రపంచ కప్ వేదికలకు రూ.50 కోట్ల చొప్పున కేటాయించింది. స్టేడియాల ఆధునీకరణ పనులకు ఏకంగా రూ.500 కోట్లు వెచ్చించనుంది.

- వసతుల ఆధునీకరణ పనులు ముమ్మరం
- ప్రపంచ కప్ వేదికలకు బీసీసీఐ నిధులు



నవతెలంగాణ క్రీడావిభాగం

ఐసీసీ ప్రపంచకప్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి!. మెగా ఈవెంట్‌కు మంగళవారంతో 100 కౌంట్‌డౌన్ మొదలు కావటంతో.. నిర్వహణ ఏర్పాట్లలో బీసీసీఐ బిజీగా గడుపుతోంది. షెడ్యూల్ విడుదల ఆలస్యమైనా.. ప్రపంచకప్ కోసం భారత్‌కు రానున్న క్రికెట్ అభిమానులకు మరిచిపోలేని అనుభూతి మిగిల్చేందుకు స్టేడియాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతోంది. ఐపీఎల్ 16 సీజన్ ముగిసిన వెంటనే పలు స్టేడియాల్లో మరమ్మత్తుల నిమిత్తం సుమారు రూ.700 కోట్లు వెచ్చించిన భారత క్రికెట్ బోర్డు.. ఇప్పుడు తాజాగా మరో రూ.500 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోంది.



ప్రపంచకప్ వేదికలకు రూ.50 కోట్ల చొప్పున కేటాయించి నూతన ఫ్లడ్‌లైట్ల సదుపాయం, నూతన డ్రెస్సింగ్‌రూమ్, దిగుమతి చేసుకున్న పచ్చిక, ఉత్తమ టికెటింగ్ వ్యవస్థ సహా స్టేడియంలో అభిమానులకు మెరుగైన కనీస అవసరాల కల్పన దిశగా నడుం బిగించింది. అహ్మదాబాద్, హైదరాబాద్, ధర్మశాల, న్యూఢిల్లీ, ముంబయి, పుణె, చెన్నై, బెంగళూర్, కోల్‌కత, లక్నోలు రూ. 50 కోట్ల నిధులు అందుకోనున్నాయి. పది స్టేడియాల్లోనూ ఆధునిక టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్న బీసీసీఐ.. ఇతర మౌళిక సదుపాయాల అంశంలో ఒక్కో స్టేడియంలో ఒక్కో తరహా పని చేయనుంది.

ఉప్పల్‌లో కొత్త పిచ్‌లు

హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ప్రపంచకప్ ఆతిథ్యానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ స్టేడియంలో పైకప్పు సమస్య చాన్నాండ్ల నుంచి పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం సౌత్ పెవిలియన్ పైకప్పు మరమ్మత్తుతో పాటు నూతనంగా ఈస్ట్, వెస్ట్ స్టాండ్స్‌కు సైతం పైకప్పు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం బీసీసీఐ ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఇక ప్రపంచకప్ కోసం ఇక్కడ నూతన పిచ్‌లు తయారు చేయనున్నారు. మెరుగైన అవుట్‌ఫీల్డ్ కోసం పనులు చేయనున్నారు. హైదరాబాద్‌లో పాకిస్థాన్ జట్టు వార్మప్ సహా నాలుగు మ్యాచులు ఆడనుంది.

ఈడెన్, మొతెరాలో..

అహ్మదాబాద్ బాహుబలి స్టేడియం ఇటీవల ప్రారంభమైంది. ఇక్కడ కొత్తగా ఎటువంటి పనులు లేవు. అవుట్‌ఫీల్డ్ మెరుగుదల, నూతన పిచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఈడెన్‌గార్డెన్స్ 2011 ప్రపంచకప్ సమయంలో అవసరమైన ఆధునీకరణ పనులు దక్కించుకుంది. ఈసారి డ్రెస్సింగ్‌రూమ్స్ సుందరీకరణ పనులు మాత్రమే చేయనున్నారు.

కోట్ల, చిన్నస్వామిలో..

దేశ రాజధానిలోని ఫిరోజ్ షా కోట్ల మైదానం డిజైన్ లోపాలు ఎదుర్కొంటుంది. ఇక్కడ ప్రధానంగా టాయిలెట్లపై అభిమానులు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో ఇక్కడ మెరుగైన టాయిలెట్ల సౌకర్యం, నూతన సీటింగ్, స్టేడియంలోకి ఎంట్రీని సులభతరం చేయనున్నారు. ఇక బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో సైతం పెద్దగా సమస్యలు లేవు. ఇక్కడ కూడా టెయిలెట్లు, డ్రెస్సింగ్‌రూమ్‌ను మెరుగు పర్చనున్నారు.

ముంబయి, చెన్నైలో ఫ్లడ్‌లైట్లు

2011 ప్రపంచకప్ ఫైనల్ వేదిక వాంఖడే. ఇక్కడ ఆధునాతన ఫ్లడ్‌లైట్ల వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఎల్ఈడీ లైట్లను అమర్చనున్నారు. కార్పోరేట్ బాక్స్‌లను సైతం ఆధునీకరించనున్నారు. చెన్నై ఎం.ఏ చిదంబరం స్టేడియంలో రెండు ఎర్ర మట్టి పిచ్‌లు ఉన్నాయి. వాటిని ప్రపంచకప్ కోసం నూతనంగా వేయనున్నారు. చెన్నైలో సైతం ఆధునాతన ఎల్ఈడీ లైట్లను ఏర్పాట్లు చేయనున్నారు.

లక్నో పిచ్‌లు మార్పు

ఐపీఎల్ 16లో లక్నో పిచ్‌లు తీవ్ర విమర్శలపాలైంది. ఇక్కడ పిచ్‌లపై పరుగులు చేయటం గగనంగా మారింది. దీంతో వరల్డ్‌కప్ మ్యాచుల కోసం లక్నోలో పూర్తిగా కొత్త పిచ్‌లను తయారు చేయనున్నారు. ఇక మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియం పుణెలో సైతం కొత్త పిచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అక్కడ టాయిలెట్లు, పార్కింగ్ సౌకర్యం, స్టాండ్స్‌లో నూతన సీట్లు ఏర్పాటు చేయనున్నారు.

ధర్మశాలలో విదేశీ పచ్చిక

ధర్మశాల హెచ్‌పీసీఏ స్టేడియం కోసం విదేశాల నుంచి పచ్చిక తీసుకురానున్నారు. భారత్‌లో అత్యంత సుందర స్టేడియంలో ధర్మశాల ముందుంటుంది. కానీ ఇక్కడ అవుట్‌ఫీల్డ్, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నం. వర్షం ప్రభావిత మ్యాచుల్లో వీలైనంత వేగంగా ఆటను పున ప్రారంభించేందుకు అనువుగా మైదానంలో పచ్చికను విదేశాల నుంచి తెప్పిస్తున్నారు. 6000 మీటర్ల పైప్‌లైన్‌తో ఆధునాతన సబ్ ఎయిర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త సీట్లు, స్టాండ్స్‌కు పెయింట్ వేయనున్నారు.

7న అపెక్స్ కౌన్సిల్ భేటీ

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ ఈ నెల 7న సమావేశం కానుంది. స్టేడియాల ఆధునీకరణ, ప్రపంచకప్ టూర్ ప్యాకేజీలు, విదేశీ లీగ్‌ల్లో మాజీ క్రికెటర్ల ప్రాతినిధ్యం సహా సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్ వేతనంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. చీఫ్ సెలక్టర్‌కు ప్రస్తుతం ఏడాదికి రూ.1 కోటి వేతనంగా అందుతుంది. వేతన పెంపుపై హామీ ఇవ్వటంతో అజిత్ అగార్కర్ ఢిల్లీ క్యాపిటల్స్ బాధ్యతలు వదులుకుని చీఫ్ సెలక్టర్ రేసులో నిలిచినట్టు సమాచారం. మాజీ క్రికెటర్లు ఆసక్తి చూపించేందుకు చీఫ్ సెలక్టర్ వేతనాన్ని ఏడాదికి రూ. 2 కోట్లుగా నిర్ణయించే అవకాశం కనిపిస్తుంది

బృందాలుగా కరీబియన్ దీవులకు..

12 నుంచి టెస్టు సిరీస్ షురూ



న్యూఢిల్లీ : కరీబియన్ పర్యటనకు భారత జట్టు బయల్దేరింది. ఈ నెల 12 నుంచి తొలి టెస్టుతో ఐదు రోజుల ఆట షురూ కానుండగా.. వైట్‌బాల్ సిరీస్ సైతం ఆ తర్వాత కొనసాగనుంది. టెస్టు, వన్డేలకు ఇప్పటికే జట్లను ఎంపిక చేయగా.. టీ20 సిరీస్‌కు జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. వెస్టిండీస్‌కు ఒకే విమానంలో క్రికెటర్లకు టికెట్లు అందుబాటులో లేకపోవటంతో.. బీసీసీఐ బృందాలుగా అక్కడికి పంపిస్తోంది. వైస్ కెప్టెన్ అజింక్య రహానె సహా పలువురు క్రికెటర్లు శుక్రవారం కరీబియన్ దీవులకు చేరుకున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లిలు వరుసగా పారిస్, లండన్ నుంచి వెస్టిండీస్‌కు చేరుకోనున్నారు. టెస్టు సిరీస్ ఆరంభానికి పది రోజులు ముందుగా ఇతర క్రికెటర్లు చేరుకోనుండగా.. కుటుంబంతో హాలిడే ట్రిప్‌లో ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వారం రోజుల ముందు అక్కడికి వెళ్లనున్నట్టు సమాచారం.

వివక్ష ఆరోపణలతో పిఎస్‌జి మేనేజర్ అరెస్టు



పారిస్ : పారిస్ సెయింట్ జెర్మెన్ (పిఎస్‌జి) మేనేజర్ క్రిస్టోఫర్ గాల్టియర్‌ను శుక్రవారం పారిస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రిస్టోఫర్ గాల్టియర్‌తో పాటు ఆయన కుమారుడు జాన్ వాలోవిక్ గాల్టియర్‌ను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సీజన్‌తో పిఎస్‌జితో క్రిస్టోఫర్ కాంట్రాక్టు ముగియనుండగా.. గతంలో ఒలింపిక్ జిమ్నాస్టిక్ క్లబ్ (ఓజీసీ) నైస్‌కు క్రిస్టోఫర్ ఫుట్‌బాల్ బాస్‌గా వ్యవహరించారు. ఓజీసీ నైస్‌లో పని చేస్తున్న సమయంలో నల్ల జాతీయులు, ముస్లింల పట్ల క్రిస్టోఫర్ గాల్టియర్ వివక్ష చూపించారని ప్రాథమిక విచారణలో తేలింది. క్రిస్టోఫర్ గాల్టియర్‌కు సంబంధించిన ఓ ఈమెయిల్ పోలీసుల విచారణలో కీలకంగా మారింది. 56 ఏండ్ల క్రిస్టోఫర్ గాల్టియర్ తనపై వచ్చిన వివక్ష ఆరోపణలను తోసిపుచ్చారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని, విచారణలో బాధ్యతాయుతంగా నడుచుకుంటానని వెల్లడించాడు.

ఆసియా చాంప్ భారత్

ఫైనల్లో ఇరాన్‌పై 42-32తో గెలుపు

ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్

బుసాన్ (దక్షిణ కొరియా) : టీమ్ ఇండియా కూత 'ఎనిమిది'కి చేరుకుంది. ఏడేండ్ల విరామం అనంతరం జరిగిన ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్స్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు.. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో రికార్డు ఎనిమిదో టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం బుసాన్‌లో జరిగిన టైటిల్ పోరులో చిరకాల ప్రత్యర్థి ఇరాన్‌పై భారత్ 42-32తో గెలుపొందింది. భారత స్టార్ రైడర్ పవన్ షెరావత్ పది పాయింట్లతో మెరవటంతో డిఫెండింగ్ చాంపియన్ అలవోక విజయం సాధించింది. ఏకపక్ష విజయాలతో ఫైనల్స్‌కు చేరిన టీమ్ ఇండియా.. టైటిల్ పోరులో ఏ దశలోనూ వెనుకంజ వేయలేదు. ఇరాన్‌పై కనీసం 7 పాయింట్ల ఆధిక్యం కొనసాగిస్తూ టైటిల్ దిశగా దూసుకెళ్లింది. 35-26తో భారత్ ముందంజలో నిలువగా.. మరింత సమయం ఉండటంతో ఇరాన్ పుంజుకునే అవకాశం కనిపించింది. కానీ భారత్ ఇటు ఎదురుదాడి, అటు డిఫెన్స్‌లో అద్భుతంగా రాణించారు. ఇరాన్ ఆటగాళ్లను కట్టడి చేసి భారత్‌కు 10 పాయింట్ల తేడాతో ఘన విజయాన్ని కట్టబెట్టారు. 2017 ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్ ఫైనల్లో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన టీమ్ ఇండియా.. తాజాగా ఇరాన్‌పై అదిరే విజయంతో ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్‌లో భారత్ సహా ఇరాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, చైనీస్ తైపీ, హాంగ్‌కాంగ్ పోటీపడ్డాయి.



హెచ్‌ఏఐ జనరల్ సెక్రటరీగా జగన్ మోహన్‌రావు

జాతీయ హ్యాండ్‌బాల్ సంఘంలో కీలక బాధ్యతలు



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ అర్శినపల్లి జగన్‌మోహన్ రావు భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య హెూదాపై ఏడాదికిగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరదించిన జగన్‌మోహన్ రావు.. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), భారత క్రీడామంత్రిత్వ శాఖ సహా ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్య, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్యలను ఏకతాటిపైకి తీసుకురావటంతో విశేష కషి జరిపారు. దేశంలో హ్యాండ్‌బాల్ అభివద్దే ఏకైక ఎజెండాగా వివాదాలకు ముగింపు పలికారు. ఇటీవల జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో జరిగిన భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) ఎన్నికల్లో జగన్‌మోహన్ రావు జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దిగ్విజయ్ సింగ్ చౌతాలా (హర్యానా) అధ్యక్షుడిగా, ఖుస్బూ చౌదరి (ఢిల్లీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మాజీ కోశాధికారి ఆనందీశ్వర్ పాండే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

నవచిత్రం

అరుదైన చిత్రం రుద్రంగి



అజయ్ సామ్రాట్, రసమయి బాలకిషన్, జగపతిబాబు, బాలకృష్ణ

జగపతిబాబు హీరోగా నటించిన తాజా చిత్రం 'రుద్రంగి'. అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత మోహన్‌దాస్, విమల రామన్ ఈ హీరోయిన్లుగా నటించారు. ఈనెల 7న సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలకృష్ణ మాట్లాడుతూ, 'రుద్రంగి లాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. మా నాన్న(ఎన్టీఆర్) అలాంటి సినిమాలు చాలా చేశారు. ఇప్పుడు జగపతి బాబు అలాంటి సినిమా చేస్తూ ఉండడం చాలా సంతోషంగా ఉంది. ఏదైనా పాత్ర చేసేటప్పుడు అందులో నటించడం కంటే జీవించడం గొప్ప. అలాంటి నటుడే జగపతి బాబు' అని తెలిపారు.'బాలయ్య 'లెజెండ్' సినిమానే నాకు మళ్ళీ ప్రాణం పోసింది. ఇక హీరోగా మళ్లీ నా మూడవ ఇన్నింగ్స్‌కి కూడా బాలయ్య నన్ను సపోర్ట్ చేస్తారని అనుకుంటున్నాను. నేను 'లెజెండ్' తర్వాత ఎన్నో సినిమాలు చేశాను కానీ అందులో చెప్పుకోదగ్గవి 10 కూడా లేవు. ఈ సినిమాతో మళ్లీ నాకు మంచి గుర్తింపు వస్తుంది అనుకుంటున్నాను' అని జగపతిబాబు అన్నారు.

చిత్ర నిర్మాత రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, 'బాలయ్య సపోర్ట్‌కి కృతజ్ఞతలు. జగపతిబాబు లేకపోతే అసలు ఈ సినిమానే లేదు. ఆయన పాత్రకి ప్రాణం పోశారనే చెప్పుకోవాలి. తెలంగాణ యాసలో ఆయన డైలాగులు అందరికీ గుర్తుండిపోతాయి' అని చెప్పారు.

ఆశిష్ గాంధీ మాట్లాడుతూ, 'జగపతిబాబుతో ఇది నా రెండవ సినిమా. మల్లేష్ లాంటి పవర్‌ఫుల్ పాత్ర నాకు ఇచ్చినందుకు డైరెక్టర్‌కి కృతజ్ఞతలు' అని తెలిపారు. 'ప్రతి డైరెక్టర్ తన సినిమా కోసం ప్రాణం పెట్టి పని చేస్తారు. కానీ నేను నా ప్రాణం పోయినా పర్వాలేదు అనుకుని ఈ సినిమాని పూర్తి చేశాను. ఈ సినిమా ఇలాంటి మరొక వంద సినిమాలను నాంది పలకాలి అని కోరుకుంటున్నాను' అని డైరెక్టర్ అజయ్ సామ్రాట్ చెప్పారు. ఈ సినిమాలో నన్ను జ్వాల పాత్రలో ఎంచుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని మమత మోహన్ దాస్ తెలిపారు.

సాక్షి విడుదలకు సిద్ధం



దర్శకుడు వి.వి.వినాయక్‌తో 'సాక్షి' చిత్ర బృందం


సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ నుంచి మరో హీరో శరణ్ కుమార్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా పరిచయం కాబోతున్న సినిమా 'సాక్షి'. శివ కేశన కుర్తి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఆర్.యు.రెడ్డి, బేబీ లాలిత్య సమర్పణలో రూపొందిస్తున్నారు. శ్రీ వెన్నెల క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.3గా మునగాల సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర రిలీజ్ డేట్ పోస్టర్‌ను డైరెక్టర్ వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'విజయ నిర్మల ఫ్యామిలీ నుంచి శరణ్ హీరోగా వస్తున్నాడు. ఈ మూవీతో శరణ్‌కు మంచి పేరు రావాలని, కొత్త దర్శకుడిగా పరిచయం కాబోతున్న శివకు ఈ సినిమా హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని ఆర్.యు.రెడ్డి అన్నారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ,'ఈనెల 21న సినిమా విడుదల కాబోతోంది. అందరూ చూసి విజయవంతం చేయాలని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'సాక్షి' సినిమా రిలీజ్ డేట్‌ను వి.వి.వినాయక్ రిలీజ్ చేశారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని హీరో శరణ్ తెలిపారు. 'టీం అంతా సహకరించింది. భీమ్స్ మంచి సంగీతాన్ని అందించారు. హీరో శరణ్ ఎంతో చక్కగా నటించారు. మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన సినిమా ఇది' అని దర్శకుడు శివ చెప్పారు.

ఈ సినిమాలో హీరోయిన్‌గా జాన్వీర్ కౌర్ నటిస్తుండగా, నాగబాబు మెయిన్ విలన్‌గా కనిపించబోతున్నారు. అజయ్, ఇంద్రజ, ఆమని ఇలా భారీ క్యాస్టింగ్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

యూనిక్ కథతో నయా సినిమా

హీరో అల్లరి నరేష్ తన 62వ ప్రాజెక్ట్‌ను శుక్రవారం అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'సోలో బ్రతుకే సో బెటరు' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తుండగా, తాజాగా 'సామజవరగమన'తో బ్లాక్‌బస్టర్ అందించిన హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించనున్నారు. నరేష్ పుట్టినరోజు సందర్భంగా యూనిక్ స్టైల్ కాన్సెప్ట్ వీడియో ద్వారా చేసిన అనౌన్స్ మెంట్ ఆసక్తికరంగా ఉంటూ అందరినీ అలరించింది.

దర్శకుడు, అల్లరి నరేష్‌కి ఫోన్ చేసి కథ చెప్పడానికి మాస్ బార్‌ను సెలెక్ట్ చేసుకుంటాడు. లవ్, ఎమోషన్, యాక్షన్, డ్రామా అంశాలతో కూడిన కథ నరేష్‌ని మెప్పించిన తర్వాత.. సినిమాకు పని చేసే సాంకేతిక నిపుణులను పరిచయం చేశారు. ఈ కథ చాలా యూనిక్‌గా ఉంటుంది.



అల్లరి నరేష్

నరేష్ డిఫరెంట్ పాత్రలో కనిపించనున్న ఈ చిత్రానికి 'సీతారామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, 'మానాడు, రంగం, మట్టి కుస్తీ' చిత్రాలకు పనిచేసిన రిచర్డ్ ఎం నాథన్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటర్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. దర్శకుడు సుబ్బు స్వయంగా కథ, స్క్రీన్ ప్లే అందిస్తుండగా, విప్పర్తి మధు స్క్రీన్ ప్లే రైటర్ గా పని చేస్తున్నారు. హీరో భావోద్వేగ ప్రయాణంలో సాగే ఈ కథ 1990 నేపథ్యంలో ఉంటుంది. సెప్టెంబర్ చివరి నుంచి షూటింగ్‌ని ప్రారంభిస్తారు. మూర్ఖత్వం బోర్డర్ దాటిన ఓ యువకుడి కథగా మేకర్స్ దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్టు అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన గ్లింప్స్ చెప్పకనే చెప్పింది.

పబ్లిక్ టాక్ అదుర్స్

హీరో నిఖిల్ నటించిన లేటెస్ట్ థ్రిల్లర్ 'స్పై'. ఎడిటర్ గ్యారీ బిహెచ్ దర్శకుడిగా పరిచయమైన ఈ చిత్రాన్ని చరణ్ తేజ్ ఉప్పలపాటి సీఈఓగా, ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై కె రాజశేఖర్ రెడ్డి నిర్మించారు. గురువారం విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుని, మంచి విజయాన్ని అందుకుంది.



ఐశ్వర్య మీనన్, నిఖిల్

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో హీరో నిఖిల్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకి వరల్డ్ వైడ్ యునానిమస్‌గా అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. నా కెరీర్‌లోనే హయ్యస్ట్ ఓపెనింగ్స్ వచ్చాయి. సినిమాని ఇంతగా ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. దర్శకుడు గ్యారీ సినిమాని చాలా కొత్తగా, రిచ్‌గా ప్రజెంట్ చేశారు. శ్రీచరణ్ నేపథ్య సంగీతం గురించి ప్రత్యేకంగా చెబుతున్నారు' అని తెలిపారు. 'పబ్లిక్ టాక్ అద్భుతంగా ఉంది. ప్రేక్షకులు చాలా ఇష్టపడుతున్నారు. కామెడీ, యాక్షన్ అన్ని ఎలిమెంట్స్ చక్కగా వర్క్ అవుట్ అయ్యాయి' అని దర్శక, నిర్మాతలు చెప్పారు.

నిర్మాత టి.జి.విశ్వ ప్రసాద్‌కు మాతృ వియోగం



టి.జి.విశ్వ ప్రసాద్

ప్రముఖ నిర్మాత, పీపుల్ మీడియా అధినేత టి.జి. విశ్వ ప్రసాద్ మాతృ మూర్తి టి.జి. గీతాంజలి (70) శుక్రవారం సాయంత్రం 6.10 నిమిషాలకు కన్నుమూశారు.

గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కోలుకోలేని పరిస్థితుల కారణంగా ఆవిడ చివరి కోరిక మేరకు తనయుడు విశ్వప్రసాద్ వారాణాసి తీసుకువెళ్ళారు. అక్కడ దైవ దర్శనం అనంతరం, శుక్రవారం ఆమె తుది శ్వాస విడిచారు. గీతాంజలికి భర్త, ముగ్గురు పిల్లల్లో నిర్మాత విశ్వప్రసాద్ పెద్దకొడుకు. వారణాసిలోనే ఆవిడ అంత్యక్రియలు జరుగుతాయని విశ్వప్రసాద్ అన్నారు.

బ్రహ్మచారి కష్టాలు..

అద్వితీయ ఎంటర్‌టైనర్స్ పతాకంపై గుంట మల్లేశం, సిరి, స్వప్న నటీనటులుగా నర్సింగ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ బి.రాంభూపాల్ రెడ్డి నిర్మిస్తున్న పక్కా తెలంగాణ కామెడీ చిత్రం 'బ్రహ్మచారి'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, విడుదలకు సిద్ధమైన సందర్భంగా ఈచిత్ర ఆడియోను తెలంగాణ ఉద్యమనేత, కవి, గాయకుడు, యం.యల్.సి దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిలీజ్ చేశారు. నిర్మాత బి.రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ,'దర్శకుడు చెప్పిన కథ వాస్తవానికి ఎంతో దగ్గరగా ఉంది. అలాగే ప్రస్తుతం తెలంగాణలో బ్రహ్మచారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అందరికీ తెలిసిందే. ఆద్యంతం వినోదంతో ఉన్న ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. 'దుబాయ్ వెళ్ళొచ్చిన ఓ యువకుడు పెళ్ళి చేసుకుందామనుకుంటే, అమ్మాయి దొరక్క ఎటువంటి ఇబ్బందులు పడ్డాడు అనేదే ఈ చిత్రకథ' అని దర్శకుడు నర్సింగ్ అన్నారు. హీరో గుంట మల్లేశం మాట్లాడుతూ,'తొలి సినిమాకే ఇలాంటి మంచి కథ ఉన్న చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని తెలిపారు.



మల్లేశం, సిరి

వాస్తవ సంఘటన స్ఫూర్తితో..



వరుణ్ తేజ్, కామాక్షి, సత్యం రాజేష్

శ్రీకృష్ణ క్రియేషన్స్ పతాకంపై గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మిస్తున్న చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెలాఖరులో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను హీరో వరుణ్ తేజ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సత్యం రాజేష్ నటించిన 'మా ఊరి పొలిమేర' చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్ర టీజర్ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. మొదటి పార్ట్‌లా సెకండ్ పార్ట్ కూడా పెద్ద హిట్ అవ్వాలని ఆశిస్తున్నాను' అని చెప్పారు. 'ఫస్ట్ పార్ట్ కన్నా రెండో పార్ట్‌ను దర్శకుడు అనిల్ అంతకు మించి చేశాడు. స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ నాకు చాలా బాగా నచ్చింది. సత్యం రాజేష్, కామాక్షి పోటాపోటీగా నటించారు. ఒక మంచి సినిమా ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ నెలాఖరులో లేదా ఆగస్ట్ మొదటి వారంలో సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని నిర్మాత గౌరికృష్ణ అన్నారు.

దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ, 'ఒక రియల్ ఇన్సిడెంట్ స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నా. గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ కాబట్టి.. పాత్రలకు తగ్గట్టుగా బోల్డ్ డైలాగ్స్, సీన్స్ ఉంటాయి తప్ప..ఎక్కడా కావాలని ఏదీ పెట్టలేదు. నిజంగా బ్లాక్ మ్యాజిక్ ఉందా? లేదా? అనే డిబేట్ మీద వెళ్లలేదు. ఒక వేళ ఉంటే ఎలా ఉంటుంది అనేది చూపించే ప్రయత్నం చేశాం. సెకండ్ పార్ట్‌లో పద్మనాభ స్వామి టెంపుల్ అంశాన్ని కూడా లైట్‌గా టచ్ చేసే ప్రయత్నం చేశా. అది ఏంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అని తెలిపారు. సత్యం రాజేష్ మాట్లాడుతూ,'టీజర్ లాంచ్‌తో సినిమా పై మరింత హైప్ పెంచిన వరుణ్ తేజ్‌కి ధన్యవాదాలు. ఇందులో పవర్‌ఫుల్ రోల్ చేశాను. నటుడుగా నన్ను మరో మెట్టు ఎక్కించే సినిమా ఇది' అని అన్నారు.

ఆహారపు అలవాట్లు, ఒత్తిళ్ళతో నెలసరి సమస్యలు





డాక్టర్ సౌమ్య కటకం
ఎంబీబీఎస్,డీ ఎన్ బీ, (ఓబీజీ)
ఎఫ్ఎంఏఎస్,సీఐఎంపీ
మిరాకిల్ హాస్పిటల్, పీర్జాదిగూడ

నవతెలంగాణ-బోడుప్పల్:

మహిళలలో సాధారణంగా నెలసరి సమస్యలు, యోని ఇన్ఫెక్షన్, మూత్రం ఇన్ఫెక్షన్ లాంటి సమస్యలు వస్తుంటాయి. వాటిని ఈ క్రింది విధంగా కొంతమేరకు అధిగమించవచ్చు. నెలనరి సమస్యలు ఈ మధ్య కాలంలో యుక్త వయస్సులో ఉన్న వారికి ఎక్కువగా రావడానికి గల ముఖ్య కారణం ఆహారపు అలవాట్లు, ఒత్తిడి లాంటివి కారణంగా చెప్పవచ్చు, అయితే అలాంటి సమస్యలు అధిగమించడానికి గాను


ఆరోగ్యకరమైన ఆహారం,రోజు అరగంటకు పైగా వ్యాయామం, ఒత్తిడి తగ్గించుకోవడం వలన కొంతవరకు నెలసరి సమస్య నుండి బయట పడవచ్చు. మహిళలలో తెల్లబట్ట అవడం అనేది సర్వసాధారణంగా ఉంటుంది అయితే దీని వలన దురద,వాసన లాంటి సమస్యలు ఉన్నప్పుడు ఖచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.అదే విధంగా మూత్రాశయ ఇన్ఫెక్షన్ పురుషులలో కంటే మహిళలలో ఎక్కువగా ఉండడానికి కారణం మూత్ర విసర్జన చేయకుండా ఎక్కువ సేపు ఉ ండడం లాంటి సమస్యలు కూడా కారణం కావచ్చు. అదే విధంగా రోజుకు 3 నుండి4 లీటర్ల నీరు తాగేలా జాగ్రత్తలు తీసు కోవాలి. ఇలాంటి చిన్న చిన్న పనులు చేయడం ద్వారా పెద్ద ఇబ్బందులు రాకుండా చూసుకోవచ్చు.





వైద్య వృత్తి దైవంతో సమానం

డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-హాయత్ నగర్

వైద్య వృత్తి దైవం తో సమానం అని రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి వెంకటేశ్వర రావు పేర్కొన్నారు.డాక్టర్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వైద్య సిబ్బంది నిరంతరం ప్రజల ప్రాణాలు కాపాడడం కోసం శాయశక్తుల కృషి చేస్తున్నామని గుర్తు చేశారు.ప్రాణాలు కాపాడే విషయం లో పేద,ధనిక,కులం,మతం అనే తేడా లేకుండా సేవ చేసేది వైద్యులు మాత్రమే అని సూచించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కళ్లెం పెంట రెడ్డి జ్ఞాపకార్థం తరగతి గది నిర్మాణం


నవతెలంగాణ-హాయత్ నగర్

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని అరుణోదయ నగర్ లో నిర్మించిన కాలనీ మొదటి అంతస్తు ను ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులచే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయన సోదరులు కళ్లెం చెన్నారెడ్డి , కళ్లెం శంకర్ రెడ్డి,కుమారులు హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి, కళ్లెం జైవర్ధన్ రెడ్డి, స్నేహితులు, కాలనీ వాసులు , భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.










సంపాదకీయం

విద్వేషపు ఆంక్షలు..!

తినే తిండి మీద ఆంక్షలు...కట్టుకునే బట్టమీద ఆంక్షలు...భావ ప్రకటన పైనా ఆంక్షలు...పుట్టిన నేలపై స్వేచ్ఛగా జీవించాలన్నా ఆంక్షలు. చివరకు బతుకుదెరువు కోసం చేసే పని మీద కూడా ఆంక్షలే! అసలు దేశం ఎటుపోతోంది? ఏమైపోతోంది? సగటు భారతీయుని ఆవేదన ఇది. ఓవైపు

> తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్ఘానిస్తాన్‌లో ప్రజల మీద అమలు చేస్తున్న ఆంక్షల గురించి విన్నాం. వారు ఎదుర్కొంటున్న అవరోధాలను తెలుసుకున్నాం. విధిస్తున్న శిక్షలను చూసి ఆందోళనకు గురయ్యాం. ఇప్పుడు ఇక్కడ ముస్లింల మీద జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష దాడులు చూస్తుంటే అవే పరిస్థితులు మనదేశంలోనూ గోచరిస్తున్నాయి. విభజించు, పాలించు నినాదంతో మత, విద్వేష పాలన సాగిస్తున్న కేంద్రం విధానాల్ని ఎదుర్కోవడం ప్రస్తుతం దేశ లక్ష్యం.

ఆధునిక ప్రపంచం అంతరిక్షంలో కూడా పరిశోధనలు చేసే స్థాయికి దూసుకుపోతుంటే, దేశాన్ని మరోవైపు మతవిద్వేషాలు, మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలమయం చేస్తున్న తీరును ఏమనాలి? రాజ్యమేలడం దేశానికి ఏం చెబుతున్నట్టు? ఏం సూచిస్తున్నట్టు? ఈ దేశం 'మీది కాదు మాది' అంటే భిన్నత్వంలో ఏకత్వంలా కలిసుండే ప్రజలు ఎక్కడివెళ్లాలి? ఇది విచ్ఛిన్న విధానం. ఇదే వ్యవస్థ ఇప్పుడు దేశంలో అమలవడం చూస్తుంటే ఆందోళనగా ఉన్నది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆంక్షల భోనును ప్రజల నెత్తిన పెట్టారు పాలకులు. ఉత్తర ప్రదేశ్‌లో జులై4న జరిగే కన్వర్‌యాత్ర సాగే ప్రాంతంలో మాంసాన్ని బహిరంగంగా అమ్మకూడదని నిబంధన తీసుకొచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ సమీక్ష జరిపి ఏకంగా నిషేధ ఉత్తర్వులు జారీ చేశారు. దానికి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. కానీ బాధితులకు కూడా మనోభావాలు ఉంటాయి కదా? వాటి సంగతేమిటి?



ఉత్తారఖండ్‌లో ఏం జరిగింది? ఉత్తరకాశీలో ఎక్కువమంది ముస్లింలు ఉండే ప్రాంతంలో బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ చేయకూడదని విశ్వహిందూ పరిషత్ ఆంక్షలు విధించింది 'వారి నివాసాల్లో నమాజ్ చేసుకుంటే ఎవరడ్డుకుంటారు' అంటూ వీహెచ్‌పి వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేంద్ర రావత్ వారిని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఈ ఉద్దేశపూర్వకమైన మాటల దాడిని చూస్తుంటే కావాలనే ముస్లింలను రెచ్చగొట్టే పద్ధతిని ఆరెస్సెస్-సంఘ్‌పరివార్ ప్రేరేపిస్తున్నదా? అనే అనుమానం రాకమానదు! సంస్కృతీ సంప్రదాయాలను ఆచరిస్తున్నామనే పేరుతో, గౌరవిస్తున్నామనే సాకుతో ప్రజల్ని ఆంక్షల ఛట్రంలోకి లాగే అధికారం వారికి ఎవరిచ్చారు? దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే హిందువులు గుళ్లలో పూజలు చేస్తున్నారు. ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేస్తున్నారు. ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రానిది ఇప్పుడే ఎందుకు సృష్టించబడుతున్నవి? 'హిందూ, ముస్లిం భాయ్‌భాయ్' అని సోదరుల వలే కలిసుండే వారి మధ్య విభజన చిచ్చును ఎందుకు రగిలిస్తున్నారో ఆలోచన చేయాల్సిన అంశంగా కనిపిస్తున్నది.

దేశంలో మైనార్టీ ప్రజలు నిత్యం అభద్రత, ఆందోళన, అసహనంతో బతుకులీడుస్తున్నారు. వారికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలకు కత్తెరేశారు. హిజాబ్ ధరించి కళాశాల, పాఠశాలలకు వెళ్లకూడదని ఆంక్షలు విధించారు. అంతకుముందే ఎవరూ బీఫ్ తినొద్దని హెచ్చరికలు చేశారు. ఆవు దేవుని ప్రతిరూపమని, దాన్ని పూజించాలని చెప్పుకొస్తున్నారు. ఆవు మూత్రం తాగితే సర్వరోగనివారిణిగా పనిచేస్తుందని ప్రచారం చేస్తున్నారు. ఆవు మూత్రం తాగి ఆవుపాలను గంగలో కలిపే సన్యాసులను చూస్తుంటే ఏమై పోతుంది దేశం అని అనిపించకమానదు. ముస్లింల వృత్తిలో ప్రధానమైనది మాంసం విక్రయించడం. ఇది ఏండ్లుగా సాగుతున్న వారి జీవనోపాధి. ఇప్పుడు కొత్తగా ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో, శోభాయాత్రలు నిర్వహించే ప్రదేశాల్లో, హోమాలు జరిగే చోట్ల మాంసపు అమ్మకాలు నిషేధం అంటే వారి జీవనోపాధి ఏం కావాలి? ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జంతు వధను నిషేధించారు. అక్కడక్కడ పట్టుబడిన మాంసాన్ని కూడా గో మాంసం పేరుతో దాడులు చేస్తూ ముస్లింలను చంపేస్తున్నారు. దానికి తాజా ఉదాహరణ మహారాష్ట్రలో హత్యకు గురైన అబ్దుల్ అన్సారీ. వాస్తవానికి దేశ, విదేశాలకు మాంసాన్ని సరఫరా చేస్తున్నవారిలో హిందువులు కూడా ఉన్నారు. కానీ బాధితులు మాత్రం ముస్లింలే. దీన్ని బట్టి కాషాయపరివారానికి ముస్లింల మీదే ద్వేషం తప్ప మాంసం మీద కాదని అర్థమవుతున్నది.

తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్ఘనిస్థాన్‌లో ప్రజల మీద అమలు చేస్తున్న ఆంక్షల గురించి విన్నాం. వారు ఎదుర్కొంటున్న అవరోధాలను తెలుసుకున్నాం. విధిస్తున్న శిక్షలను చూసి ఆందోళనకు గురయ్యాం. ఇప్పుడు ఇక్కడ ముస్లింల మీద జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష దాడులు చూస్తుంటే అవే పరిస్థితులు మనదేశంలోనూ గోచరిస్తున్నాయి. విభజించు, పాలించు నినాదంతో మత, విద్వేష పాలన సాగిస్తున్న కేంద్రం విధానాల్ని ఎదుర్కోవడం ప్రస్తుతం దేశ లక్ష్యం. లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న శక్తులకు మద్దతునివ్వడం, వారిబాటలో అడుగులేయడం ప్రజల కర్తవ్యం. చీకట్లోకి నెడుతున్న భారతావనికి వెలుగులు చూపడం అందరి బాధ్యత. ఇక ఆలోచించాల్సింది పౌర సమాజమే...

నేటి తరాలకు చెరగని స్ఫూర్తి 'కొరటాల'

చరిత్ర నిర్మాతలు ప్రజలే. వారిని ఉద్యమాల బాట పట్టించినవారిలో అనేక మంది ఉన్నప్పటికీ కొన్ని ప్రత్యేకతలు కొందరి స్వంతం. వ్యక్తుల పాత్రను విస్మరించలేం. ఇది చరిత్ర చెప్పిన సత్యం. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న నేతలలో కొరటాల సత్యనారాయణ ఒకరు. క్యాన్సర్‌తో 2006 జూలై ఒకటిన మరణించిన కొరటాల అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా అంతకు ముందు రైతు, వ్యవసాయకార్మిక సంఘాల కార్యదర్శిగా పని చేశారు. చేనేత, యువజన, విద్యార్థి, మహిళా ఉద్యమాలకు మార్గదర్శిగా, ప్రజాశక్తి సాహితీ సంస్థ అధ్యక్షుడిగా, శాసనసభ్యునిగా కూడా సేవలందించారు. వామపక్ష, కమ్యూనిస్టు ఉద్యమాలలో, పత్రికల నిర్వహణలో భాగస్వాములుగా ఉన్న నేటితరాలు కొరటాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం.



ఎం. కోటేశ్వరరావు

పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య తరం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల సీపీఐ(ఎం), వివిధ ప్రజాసంఘాలలో నాయకత్వ స్థానాల్లో ఉన్న నేటి తరాలకు ఒక వారధిగా కొరటాల పని చేశారంటే అతిశయోక్తి కాదు. తనకంటే సీనియర్లుగా ఉన్నవారితో, ఎంతో జూనియర్లుగా ఉన్నవారితో కూడా పని చేస్తూ తరాల అంతరాలను పూడ్చేందుకు, దెబ్బతిన్న ఉద్యమాన్ని ఇతరులతో కలసి నిలబెట్టేందుకు, ఒకడుగు ముందుకు తీసుకుపోయేందుకు దోహదం చేశారు. 'ఏరా బాబూ' అంటూ

> ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పొగాకు పంట తరువాత ఆకర్షించిన పత్తి రైతులకు కాస్త ఆదాయం సమకూర్చటంతో పాటు అనేక మందిని ఆత్మహత్యలకు సైతం పురికొల్పింది. ఒకానొక సందర్భంలో అలాంటి ఆత్మహత్యలు తమ ప్రాంతంలో సాధారణమే అన్నట్లుగా కార్యకర్తలు చెప్పిన అంశాన్ని తీవ్రంగా పరిగణించి ప్రకాశం జిల్లాలో కొరటాల అనేక గ్రామాలను సందర్శించారు. విపరీతమైన తెల్లదోమ, అది రెచ్చిపోయినతీరు, సింథటిక్ పైరిత్రాయిడ్స్ కలిగించిన పర్యావరణహాని, దాంతో రైతులు నష్టపడి అప్పులపాలు కావటానికి, బలవన్మారణాలకు సంబంధం ఉందన్న అంశాన్ని తొలిసారిగా మీడియా ద్వారా వెలుగులోకి తీసుకు వచ్చిన ప్రత్యేకత కొరటాలదే.

భుజం మీద చేయి వేసి ఉద్యమంలోకి వచ్చిన యువకులతో కొరటాల మాదిరి మమేకం కావటం మరొకరి నుంచి ఊహించలేం. ఆయనతో పరిచయం ఉన్నవారెవరూ దీన్ని గురించి మర్చిపోలేరు. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అమృతలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో 1926 సెప్టెంబరు 24న ఒక ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. ఆ కుటుంబం, ఇతర సమీప బంధువులు కాంగ్రెస్, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నవారే. ఆ ప్రభావంతోనే పాఠశాలల్లో కొత్తగా ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తురిమెళ్ల హైస్కూలు విద్యార్థిగా పద్నాలుగేండ్ల ప్రాయంలోనే ఉద్యమకారుడిగా మారారు. పదకొండు రోజులు సమ్మె జరిగినా హెడ్‌మాస్టర్ దిగిరాకపోవటంతో అప్పటికే గుంటూరులో విద్యార్థి సంఘనేతగా ఉన్న మాకినేని బసవపున్నయ్యను కలిసి ఆందోళన తీవ్రతకు సంప్రదింపులు జరిపారు. దాంతో హెడ్‌మాస్టర్ డిటెన్షన్ విధానాన్ని తొలగించేందుకు అంగీకరించారు. దాని కొనసాగింపుగా గుంటూరు ఆంధ్రాక్రిస్టియన్(ఏసి కాలేజి) కాలేజీలో విద్యార్థి ఉద్యమంలో భాగస్వామిగా మారారు. మాకినేని, మోటూరు హనుమంతరావు, లావు బాలగంగాధరరావు తదితరులతో ఏర్పడిన పరిచయం కమ్యూనిస్టుగా మార్చింది. ఇంటర్‌తో చదువుకు స్వస్తి చెప్పి పార్టీ కార్యకర్తగా రేపల్లె ప్రాంత ఉద్యమంలోకి వచ్చారు. అప్పటి నుంచి మరణించేవరకు ఎర్రజెండా, కష్టజీవులను వదలకుండా నిలిచారు.

ప్రజాసమస్యలను అధ్యయనం చేయటంలో ప్రతి వామపక్ష, కమ్యూనిస్టు నేత ముందుంటారు. వారిలో కొరటాల ఒక ప్రత్యేకతను కనపరిచారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త సమస్యలు ముందుకు వస్తుంటాయి. వాటిని గ్రహిస్తేనే జనానికి దగ్గర అవుతారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పొగాకు పంట తరువాత ఆకర్షించిన పత్తి రైతులకు కాస్త ఆదాయం సమకూర్చటంతో పాటు అనేక మందిని ఆత్మహత్యలకు సైతం పురికొల్పింది. ఒకానొక సందర్భంలో అలాంటి ఆత్మహత్యలు తమ ప్రాంతంలో సాధారణమే అన్నట్లుగా కార్యకర్తలు చెప్పిన అంశాన్ని తీవ్రంగా పరిగణించి ప్రకాశం జిల్లాలో కొరటాల అనేక గ్రామాలను సందర్శించారు. విపరీతమైన తెల్లదోమ, అది రెచ్చిపోయినతీరు, సింథటిక్ పైరిత్రాయిడ్స్ కలిగించిన పర్యావరణహాని, దాంతో రైతులు నష్టపడి అప్పులపాలు కావటానికి, బలవన్మారణాలకు సంబంధం ఉందన్న అంశాన్ని తొలిసారిగా మీడియా ద్వారా వెలుగులోకి తీసుకు వచ్చిన ప్రత్యేకత కొరటాలదే. అంతే కాదు మహబూబ్‌నగర్ జిల్లాల్లో తలెత్తిన తీవ్రకరవు పరిస్థితుల్లో గంజి కేంద్రాల ఏర్పాటు చొరవ కూడా ఆయనదే. దేశంలో తలెత్తిన అస్తిత్వ ఉద్యమాలు అనేక తరగతులను ఊపివేస్తున్న తరుణం. కమ్యూనిస్టులు వర్గ సమస్యలను తప్ప కులవివక్ష వంటి సామాజిక అంశాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వరనే విమర్శలు వెలువడ్డాయి. ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాదు వచ్చిన ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ ఈ అంశాలను కొరటాలతో చర్చించారు. వాటిని తీవ్రంగా పరిశీలించిన సీపీఐ(ఎం) నాయకత్వం వేసిన ముందుడుగు కులవివక్ష వ్యతిరేక సంఘం రూపంలో ఉనికిలోకి వచ్చింది. అనేక గ్రామాల్లో అది జరిపిన పరిశీలనలో రెండు గ్లాసుల పద్ధతి, ఇతర తీవ్ర వివక్ష రూపాలు, తరువాత జస్టిస్ పున్నయ్య కమిటీ ఏర్పాటు, అది సమర్పించిన నివేదికలో కొనసాగుతున్న వివక్షను నిర్ధారించిన తీరు తెలిసిందే. వర్గసమస్యల మీదనా లేక కుల అంశం మీద ముందుగా పోరాడాలా ఏది ముందు ఏది వెనుక, దేనికి ప్రాధాన్యత అనే తర్కం అవసరం లేదని, ఎక్కడ ఏ అంశం ముందుకు వస్తే దాని మీద, రెండు అంశాల మీద ఆందోళనలను కూడా జమిలిగా జరపాలనే అభిప్రాయం, తరువాత కొన్ని రాష్ట్రాలలో, జాతీయ సంఘ ఆవిర్భావం కూడా తెలిసిందే.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వం గ్రోమోర్ ఫుడ్ అనే నినాదంతో ఎక్కడ సాగుభూమి ఉంటే అక్కడ పంటలు పండించాలని పిలుపునిచ్చింది. పూర్వపు గుంటూరు జిల్లాలోని రొంపేరు ప్రాంతంలో బంజరు భూములు కొన్ని పడావుగా ఉండగా మరికొంత అన్యాక్రాంతమైంది. ఈ భూములతో పాటు రేపల్లె ప్రాంతంలోని కృష్ణానది లంకల్లో తేలిన భూములను భూస్వాములు, జమిందార్లు ఆక్రమించుకున్నారు. వాటిని పేదలకు పంచాలని, చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో ఇతర నేతలతో కొరటాల కూడా భాగస్వామిగా ఉన్నారు. రేపల్లె ప్రాంతంలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉండటం, కుల సంఘాల పేరుతో ఉన్న నేతలు వారి గురించి పట్టించుకోకపోవటం, ఆ తరగతికి చెందిన వారు కమ్యూనిస్టు అభిమానులుగా గణనీయంగా



నేడు 17వ వర్ధంతి

> మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి మద్దతుగా సరిహద్దులోని ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో కమ్యూనిస్టులు అండగా నిలిచారు. ఆ కక్షతో నాటి కాంగ్రెస్ పాలకులు అనేక మందిని పట్టుకొని నిలువునా కాల్చిచంపారు, గ్రామాల మీద దాడులు చేశారు. అనేక మందిని జైలుపాలు చేశారు. అలాంటి వారిలో కొరటాల ఒకరు. 1948లో కడలూరు జైలుకు పంపారు. అక్కడి పరిస్థితుల మీద ఆందోళనకు దిగినపుడు దెబ్బతిన్న జీర్ణ వ్యవస్థ కొరటాలను జీవితాంతం బాధించింది.1975 ఎమర్జెన్సీ, అంతకు ముందు, నాలుగు సంవత్సరాల పాటు అజ్ఞాతవాసం గడిపారు.

> ప్రజా ఉద్యమాలు, వాటికి తోడుగా మార్గదర్శిగా ఉండే పత్రికల నిర్వహణ గురించి కొరటాల వంటి వారు పడిన తపనను నేటి తరాలు అవగతం చేసుకొని వాటిని మరింతగా ముందుకు తీసుకుపోవటం, అంతిమ లక్ష్యమైన సమసమాజ దిశగా అడుగులు వేయటమే ఘనమైన నివాళి. కార్యకర్తలతో నేతల దగ్గరితనం అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించటాన్ని ప్రోత్సహిస్తుంది. కమ్యూనిస్టు పార్టీల్లో హోదాలు అనేవి బాధ్యతలు తప్ప దర్పాన్ని ప్రదర్శించుకొనేందుకు కాదు. ఎంత మంది నేతలు, కార్యకర్తలు అలా ఉన్నారో కొరటాల వర్ధంతి సందర్భంగా ఆత్మవిమర్శ చేసుకోవాలి. అవసరమైతే పద్ధతులు మార్చుకోవాలి.

ఉండటంతో కొరటాల వారి సమస్యలను లోతుగా పరిశీలించారు. ఎంతగా అంటే అసెంబ్లీలో, వెలుపలా చేనేత గురించి కొరటాల చేసిన ప్రస్తావనలు, ఆందోళనలకు నాయకత్వం వహించిన తీరు గురించి వారంతా కొరటాల తమ సామాజిక తరగతికి చెందిన వారనే నమ్మేంతగా మమేకమయ్యారు. తరువాత చేనేత కార్మిక సంఘం ఏర్పాటు జరిగింది. అదే విధంగా రైతు, వ్యవసాయ కార్మిక సమస్యల మీద కూడా కొరటాలకు పట్టు ఉంది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీ చేసి కొన్ని వందల ఓట్ల తేడాతో కొరటాల ఓడినా తరువాత కాలంలో కేంద్ర మంత్రిగా పని చేసిన కొత్త రఘురామయ్య తరువాత ఎన్నికలలో గుంటూరుకు మారేట్లుగా పోటీనిచ్చారు. తరువాత రెండుసార్లు ఎంఎల్‌ఏగా గెలిచారు.

మహత్తర తెలంగాణ సాయుధ పోరాటానికి మద్దతుగా సరిహద్దులోని ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో కమ్యూనిస్టులు అండగా నిలిచారు. ఆ కక్షతో నాటి కాంగ్రెస్ పాలకులు అనేక మందిని పట్టుకొని నిలువునా కాల్చిచంపారు, గ్రామాల మీద దాడులు చేశారు. అనేక మందిని జైలుపాలు చేశారు. అలాంటి వారిలో కొరటాల ఒకరు. 1948లో కడలూరు జైలుకు పంపారు. అక్కడి పరిస్థితుల మీద ఆందోళనకు దిగినపుడు దెబ్బతీన్న జీర్ణ వ్యవస్థ కొరటాలను జీవితాంతం బాధించింది.1975 ఎమర్జెన్సీ, అంతకు ముందు, నాలుగు సంవత్సరాల పాటు అజ్ఞాతవాసం గడిపారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ సారధిగా, పత్రికలో తెచ్చిన మార్పులకు, అది తనకాళ్ల మీద తాను నిలిచే విధంగా ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు తీసుకున్న అన్ని చర్యలు, విస్తరణ వెనుక కొరటాల చోదకశక్తిగా ఉన్నారు. పత్రిక అందించే వార్తలు, విశ్లేషణల్లో రావాల్సిన మార్పులు, సూటిదనం గురించి నిరంతరం తపన పడేవారు. కార్యకర్తలు, వారి కుటుంబాల పరిస్థితుల గురించి పట్టించుకోవటంలో కూడా తనదైన ముద్ర వేశారు. ప్రజా ఉద్యమాలు, వాటికి తోడుగా మార్గదర్శిగా ఉండే పత్రికల నిర్వహణ గురించి కొరటాల వంటి వారు పడిన తపనను నేటి తరాలు అవగతం చేసుకొని వాటిని మరింతగా ముందుకు తీసుకుపోవటం, అంతిమ లక్ష్యమైన సమసమాజ దిశగా అడుగులు వేయటమే ఘనమైన నివాళి. కార్యకర్తలతో నేతల దగ్గరితనం అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించటాన్ని ప్రోత్సహిస్తుంది. కమ్యూనిస్టు పార్టీల్లో హోదాలు అనేవి బాధ్యతలు తప్ప దర్పాన్ని ప్రదర్శించుకొనేందుకు కాదు. ఎంత మంది నేతలు, కార్యకర్తలు అలా ఉన్నారో కొరటాల వర్ధంతి సందర్భంగా ఆత్మవిమర్శ చేసుకోవాలి. అవసరమైతే పద్ధతులు మార్చుకోవాలి.

సెల్: 8331013288



సవాళ్లను అధిగమిస్తూ... 'సంఘటితం'గా ముందుకెళ్తూ...

'ఒంటరితనం నుండి సంఘటితం దిశగా' నినాదంతో 'ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్' (ఏఐఐఈఏ) 1951 జులై 1వ తేదీన ఆవిర్భవించింది. ఇన్సూరెన్స్ రంగ జాతీయాకరణ కోరుతూ మొదటి సమావేశంలోనే తీర్మానాన్ని ఆమోదించి... ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను అన్నింటిని కలిపి జాతీయాకరణ చేసి 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'గా ఏర్పాటు చేసేలా పోరాడిన చైతన్యపూరిత చరిత్ర 'ఏఐఐఈఏ'ది. ఈ జనవరిలో కలకత్తాలో జరిగిన యూనియన్ జాతీయ మహాసభలో సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తపన్‌సేన్ సందేశమిస్తూ... 'జీతభత్యాల గురించి, ఉద్యోగ భద్రత గురించి చర్చించుకోవడం సాధారణంగా మహాసభలలో జరుగుతుంటుంది. కానీ, సామాజిక స్పృహగల ఒక సంఘంగా సమాజంలోని రుగ్మతలకు కారణాలను చర్చించి వాటిని నివారించేందుకు అన్ని వర్గాలతో కలిసి ఏ విధంగా పోరాటం చేయాలో చర్చించటం ఏఐఐఈఏ విశిష్టత' అని పేర్కొనటం గమనార్హం. ఏఐఐఈఏ తొమ్మిదవ మహాసభ 1978లో కలకత్తాలో జరిగినప్పుడు సోషలిజం స్థాపనే లక్ష్యమనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన చరిత్రాత్మక నేపథ్యం ఉంది. అప్పటి ఎమర్జెన్సీకి కారణమైన ఇందిరా గాంధీ ప్రభుత్వానికి దేశ ప్రజలు చరమగీతంపాడి దేశ ప్రజాస్వామ్యంపై నమ్మకం, విశ్వాసం పాదుగొల్పిన గొప్ప సందర్భమది.

ఎల్ఐసిని ఐదు ముక్కలుగా విభజన చేయాలన్న బిల్లుకు వ్యతిరేకంగా యూనియన్ సాగించిన పోరాటాన్ని పార్లమెంట్‌లో ప్రతిబింబించేలా వామపక్షాలు గొప్ప కృషి చేశాయి. ఏఐఐఈఏ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన కామ్రేడ్ సునీల్ మైత్రా అప్పటి పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. నాటి ప్రధాని రాజీవ్ గాంధీని కలిసి ఎల్ఐసి విభజన బిల్లు దేశ సమగ్రతకు ఏ విధంగా విఘాతం కలిగిస్తుందో వివరించి ఆ బిల్లును పార్లమెంట్ నుంచి విరమించుకునేలా చేయడం యూనియన్ పోరాట ప్రస్థానంలో మరొక ముఖ్య ఘట్టం. జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని పరిరక్షించటానికి ఏఐఐఈఏ ఏడు దశాబ్దాలుగా నిరంతర పోరాటాన్ని కొనసాగించింది. 'ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సు కోసమే' అనే ఇన్సూరెన్స్ జాతీయాకరణ లక్ష్యాల సాధన కోసం ప్రచార, పోరాట కార్యాచరణతో నిరంతరం సైద్ధాంతిక నిబద్ధతతో పయనించింది. ఎమర్జెన్సీ కాలంలోనే ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు గొంతెత్తి నినదించింది. ఎల్ఐసిని ఐదో స్వతంత్ర ప్రతిపత్తిగల కార్పొరేషన్‌గా విభజించాలన్న నాటి ప్రభుత్వ ప్రయత్నాలకు, మల్హోత్రా కమిటీ, బీమా రంగ సంస్కరణలు, ప్రయివేటీకరణ వంటి అంశాలకు వ్యతిరేకంగా కోటి యాభై లక్షల సంతకాల సేకరణతో విస్తృత ప్రజాభిప్రాయాన్ని కూడగట్టింది. బీమా రంగ ప్రయివేటీకరణ ప్రతి పాదనలకు వ్యతిరేకంగా 'పీపుల్స్ పిటిషన్' పేరుతో వాటిని పార్లమెంట్‌కు సమర్పించడం వంటి ప్రచార ఆందోళనా ఉద్యమాలను చేపట్టింది.

ఎల్ఐసి, ఇన్సూరెన్స్ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల పార్లమెంట్ సభ్యులను కలిసి వివరించి పార్లమెంట్‌లో అనేక సార్లు జాతీయ ఇన్సూరెన్స్ రంగ పరిరక్షణ కోసం చర్చ జరిగేలా కృషి చేసింది. ప్రభుత్వం చేపడుతున్న ప్రయివేటీకరణ విధానాలపై జాతీయ కార్మిక సంఘాలతో కలిసి సమ్మెలలో పాల్గొని సమర శంఖం పూరించింది. దీంతోపాటు వేతన సవరణలు, పెన్షన్ సాధనతో సహా అనేక సౌకర్యాలు, సదుపాయాలను సాధించి మెజారిటీ ఉద్యోగుల మన్ననలు పొందింది. ఎల్ఐసి, జాతీయ సాధారణ బీమా పరిశ్రమల వ్యవస్థాగత లక్ష్యాలను పరిరక్షించడం, విశాల ఉద్యోగుల ఐక్యతను కాపాడడం, ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల పోటీని ఎదుర్కొని సంస్థను మార్కెట్ లీడర్‌గా నిలపడం, ప్రభుత్వ ప్రయివేటీకరణ, డిజిన్వెస్ట్‌మెంట్ విధాన ప్రభావం నుంచి జాతీయ బీమా రంగాన్ని కాపాడుకోవడం, ఎల్ఐసి-ఐపీఓ అనంతర పరిణామాలపై పట్టాదారులకు భరోసా కల్పించడం వంటి అనేక రూపాలలో నేడు ఏఐఐఈఏ బహుముఖ సవాళ్ళను ఎదుర్కొంటోంది. ప్రస్తుత సవాళ్ల గతంలో ఎదుర్కొన్న వాటి కంటే పెద్దవి. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ప్రభావమే ఇందుకు కారణం. ప్రజాస్వామిక భిన్నాభిప్రాయాన్ని, ప్రశ్నించేతత్వాన్ని ఆహ్వానించే పరిస్థితి కూడా నేడు లేదు.

ఏఐఐఈఏ గత ఏడు దశాబ్దాలుగా సైద్ధాంతిక పునాదితో ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంతో అనుసంధానం చేస్తూ ఎదురైన సవాళ్ళను అధిగమిస్తూ ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగించటం, ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ కాకుండా కాపాడుకోవడం, పాలసీ దారుల ప్రయోజనాలను ఎల్ఐసి సంరక్షిస్తుందని భరోసా ఇవ్వడం, వారి ప్రయోజనాల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించడం ఏఐఐఈఏ నేటి లక్ష్యంగా ఉంది. పాలక వర్గాల మతతత్వ, విచ్ఛిన్నకర పోకడలను, కార్మిక చట్టాల మార్పుల వంటి విధానాలను తిప్పికొట్టాలి. ఇన్సూరెన్స్ పరిశ్రమలో ఉద్యోగుల ఐక్యతకే పరిమితం కాక, విశాల కార్మిక వర్గ ఐక్యత-నిర్మాణం కోసం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి. ఈ లక్ష్యాల సాధనకు ఏఐఐఈఏ 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పునరంకితమవ్వడం దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ ఉద్యోగుల నేటి కర్తవ్యం.

(నేడు ఏఐఐఈఏ 73వ వ్యవస్థాపక దినోత్సవం)

- జి. కిషోర్‌కుమార్, సెల్:9440905501

సిగ్గుపడవలసింది ఎవరు కామ్రేడ్?

> బూర్జువా పార్టీలకున్నట్లు కమ్యూనిస్టు పార్టీలకు ఆర్థిక వనరులు ఉండవు ఆ కారణంగా జరగవలసినంత కృషి జరగలేదన్నది వాస్తవం. అయితే చెరుకూరి సత్యనారాయణ రాసిన వికృత కోణం తమ నుంచి విడిపోయిన లేదా విభేదించిన వారిని అతి దారుణంగా నిందించడం, కొన్ని సందర్భాలలో హత్య చేయడం, ప్రత్యేకించి సీపీఐ(ఎం)పైనా, పార్లమెంటరీ పోరాటాన్ని కూడా ఒక పోరాట మార్గంగా గుర్తించిన వామపక్షాల పైనా అలుపెరగకుండా నిందలు వేయడం, వర్గ శత్రువు పట్ల సరళంగా ఉండటం చేస్తున్నది ఎవరో, సిగ్గుపడవలసింది ఎవరో మీరే నిర్ణయించండి కామ్రేడ్.

'కొంచెం సిగ్గుగా ఉంది కామ్రేడ్స్" అనే శీర్షికతో చెరుకూరి సత్యనారాయణగారి వ్యాసం ఆంధ్రజ్యోతి పత్రికలో జూన్ 11న ప్రచురిత మైంది. శ్రామికవర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తూ భూస్వాములచేత, పోలీసులచేత, అధికారపార్టీ వాళ్ళ చేత చంపబడిన కార్యకర్తల పట్ల మన ఎర్రజెండా పార్టీలెప్పుడైనా బాధ్యత తీసు కున్నాయా అని అంటూ ఇంకా కొన్ని ప్రశ్నలు సంధించారు. వారి ప్రశ్నలలోని కొన్ని విషయా లకు సమాధానంగా, ఒక కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా (హెూల్ టైమర్) నా అనుభవాలను పాఠకుల దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తాను...

నేను 1976 నుండి అదిలాబాద్ జిల్లా (ప్రస్తుతం మంచిర్యాల) భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిర్మాణంలో పాలుపంచుకుంటూ 2017లో జిల్లా కార్యదర్శిగా బాధ్యతల నుండి (వయస్సు రీత్యా) రిలీవ్ అయ్యాను. పార్టీలో పనిచేసే పూర్తికాల కార్యకర్తల పిల్లల విద్యకు విజయవాడలోని నేతాజీ స్కూలు, వైరాలోని మధు విద్యాలయాలు బాధ్యత వహించాయి. ఆర్థిక పరిస్థితిని బట్టి ఫీజు రాయితీలు ఇస్తూ ఉండేవారు. పాఠశాల విద్య ముగిసిన తర్వాత ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రం వారి ఉన్నత చదువులకు బాధ్యత స్వీకరించి వారి ఆసక్తి మేరకు చదివించడం జరిగినది. ఆ విద్యార్థులు తరువాత ఇంజనీర్లు, టీచర్లు, బ్యాంకు ఉద్యోగులు, పార్టీ పూర్తికాలం కార్యకర్తలుగా తమ తమ అభిరుచికి అనుగుణంగా పని చేసుకుంటున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని ప్రగతి విద్యానిలయం వాటికి తోడైంది. చిలుమూరు, గుంటూరులలో అలాంటి స్కూళ్ళు నడుస్తున్నాయి.

కార్యకర్తల కుటుంబాలలో ఆరోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఆస్పత్రులలోనూ, ప్రయివేటు ఆసుపత్రుల లోనూ పనిచేస్తున్న మాతో సత్సంబంధాలు కలిగి ఉన్న వైద్యుల సహకారంతో వారికి సహాయం అందించడం జరుగుతున్నది. అత్యవసరమైతే హైదరాబాద్‌కు, లేదా నెల్లూరు ప్రజావైద్యశాలలకు పంపించి వైద్యం చేయించే బాధ్యతను పార్టీ రాష్ట్ర కేంద్రమే తీసుకునేది. అంతేకాక పార్టీ సభ్యులైన అనేక మంది డాక్టర్లు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ స్వచ్ఛందంగా ప్రజావైద్యశాలలు నిర్వహిస్తూ పార్టీ కార్యకర్తలకూ, సభ్యులకు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలకు కూడా వైద్యసేవలు అందిస్తున్న విషయం జగమెరిగిన సత్యం. పార్టీ కార్యకర్తలు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థికసహకారం అందించి నిలబెట్టడం జరిగేది. తాత్కాలిక సహాయం అందించడంతో సరిపుచ్చక వారి విద్యా స్థాయిని బట్టి వారికి శాశ్వత ఉపాధి కల్పనకు పార్టీ తన శక్తి మేరకు కృషి చేసింది. విద్యుత్ పోరాటంలోనూ, ముదిగొండ కాల్పులలోనూ అమరులైన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆయా కుటుంబాలను నిలబెట్టింది. వారి పిల్లలు పెద్ద వారై ప్రస్తుతం ఉద్యోగాలు చేసుకుంటున్నారు.



సూర్యదేవర సత్యనారాయణ

అమర వీరుల విషయంలో మరొక వికృత కోణం కూడా ఉంది అంటూ 1964, 1968లలో పార్టీ చీలిన తర్వాత తమ నుండి విడిపోయిన వారు ఎంతటి త్యాగధనులైన ఉద్యమకారులైనా గుర్తించరు అనడం పాక్షిక సత్యమే. సీపీఐ(ఎం)కు సంబంధించి నంత వరకు 1976లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అమరు డైనప్పుడు అత్యవసర స్థితి కారణంగా రహస్య జీవితం గడుపుతున్న కామ్రేడ్ సుందరయ్య, నీలం సంజీవరెడ్డి ద్వారా సోదరి లక్ష్మికి నా సంతాపం తెలపడం తప్ప మరేమీ చేయగలను అని తన అశక్తతను తెలియజేస్తూ సుదీర్ఘమైన లేఖను రాశారు. కామ్రేడ్ కొల్లా వెంకయ్య అమరుడైనప్పుడు సీపీఐ నాయకుడు వేములపల్లి శ్రీకృష్ణ విశాలాంధ్ర పత్రికలో ఒక వ్యాసమే రాశారు. అంతేకాదు అత్యవసర స్థితి కాలంలో వెంగళరావు ప్రభుత్వం జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులైన కామ్రేడ్ల విషయంలో విచారణకు భార్గవ కమిషన్‌ను ఏర్పాటు చేయడంలో సీపీఐ(ఎం) ప్రత్యేకించి కామ్రేడ్ సుందరయ్య చేసిన కృషి మరువ లేనిది.

తెలుగు నేలలో తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఆ తరువాత జరిగిన పోరాటాలలోనూ అమరులైన వారిని గురించి, వారి కుటుంబాల ప్రస్తుత స్థితి గతులపై లెక్క ఏ ఎర్రజెండా పార్టీ అయినా చెప్పగలదా? అని మరొక ప్రశ్న సంధించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన 1983మంది అమరుల పేర్లను జిల్లా, తాలూకాలవారీగా 1973లో ప్రచురించిన సుందరయ్య గారి రచన "వీర తెలంగాణ విప్లవ పోరాటం-గుణ పాఠాలు"లో ప్రచురించారు. ఆ తరువాత ఈ శతాబ్దంలో సీపీఐ(ఎం)కు చెందిన ఖమ్మం, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లా కమిటీలు వారికి అందుబాటులో ఉన్న అమరుల చరిత్రను సంక్షిప్తంగా వివరిస్తూ పుస్తకాలు ప్రచురించారు. ఇందులో గుంటూరు జిల్లా కమిటీ ప్రచురించిన 642 పేజీల గుంటూరు జిల్లా కమ్యూనిస్టు వీరులు అన్న పుస్తకం పాత గుంటూరు జిల్లా అంటే పోరాట కాలంనాటి గుంటూరు జిల్లాకు చెందిన అమరుల చరిత్రను ఎంతో శ్రమకు ఓర్చి అమరుడు కామ్రేడ్ హరిబాబు, మిత్రులు డాక్టర్ కొల్లా రాజమోహన్, వాసిరెడ్డి నాగేంద్ర ప్రసాద్‌ల సహకారంతో సేకరించగా ప్రొఫెసర్ ఎం.వి.ఎస్., కోటేశ్వరరావు, శ్రీమతి సుధాకిరణ్ గార్లు సంకలనం చేశారు. ఇంకా మరొక సంపుటికి సరిపడా అమరుల సమాచారం కూడా సేకరించబడినది, కానీ మిత్రుడు హరి అకాల మరణంతో ప్రచురణకు నోచుకోలేదని తెలిసింది. మిత్రుడు చెరుకూరి సత్యనారాయణ లోకేష్, భువనేశ్వరి గురించి రాయడానికి సమాచారం సేకరణకు వెచ్చించిన సమయంలో కొంతైనా వీటికోసం వెచ్చించే ప్రయత్నం చేస్తే సీపీఐ(ఎం), ఇతర కమ్యూనిస్టు పార్టీలు ఈ దిశగా చేసిన కృషి తెలిసి ఉండేది.

చివరగా సీపీఐ(ఎం) శాసన సభ్యులు తమ వేతనాలను మొత్తం పార్టీకే చెల్లించి కడు పేదరికంలో గడిపారని కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. పార్టీ అనుసరిస్తున్న విధాన పరంగానే శాసనసభ్యులే కాదు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ తమ వేతనాలను పార్టీకి చెల్లించి, పూర్తికాలం కార్యకర్తలు మాదిరిగా అలవెన్సులు తీసుకుం టారు. పదవీ విరమణ తరువాత కూడా అవసరం ఉన్న వారికి అలవెన్సులు అందు తున్నాయి. అంతేకాదు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన ఇండ్ల స్థలాలను కూడా తిరస్కరించారు సీపీఐ(ఎం) శాసనసభ్యులు.

బూర్జువా పార్టీలకున్నట్లు కమ్యూనిస్టు పార్టీలకు ఆర్థిక వనరులు ఉండవు ఆ కారణంగా జరగవలసినంత కృషి జరగలేదన్నది వాస్తవం. అయితే చెరుకూరి సత్యనారాయణ రాసిన వికృత కోణం తమ నుంచి విడిపోయిన లేదా విభేదించిన వారిని అతి దారుణంగా నిందించడం, కొన్ని సందర్భాలలో హత్య చేయడం, ప్రత్యేకించి సీపీఐ(ఎం)పైనా, పార్లమెంటరీ పోరాటాన్ని కూడా ఒక పోరాట మార్గంగా గుర్తించిన వామపక్షాల పైనా అలుపెరగకుండా నిందలు వేయడం, వర్గ శత్రువు పట్ల సరళంగా ఉండటం చేస్తున్నది ఎవరో, సిగ్గుపడవలసింది ఎవరో మీరే నిర్ణయించండి కామ్రేడ్.

బట్టలు ఉతికే పని రజక వృత్తిదారులకే

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేసిన రజక వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ రంగ సంస్థల్లోని బట్టలను ఉతికే పని రజక వృత్తిదారులకే కేటాయించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో నెంబర్ 102ను విడుదల చేయటం పట్ల తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నరేశ్, పి ఆశయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ,పోలీస్ శాఖలు ,అతిథి గృహాలు, దేవాదాయ శాఖ, ఆస్పత్రుల్లోని లాండ్రీ పనిని పెట్టుబడిదారులకు కాంట్రాక్టు పద్ధతిలో ఇస్తున్న క్రమంలో ఆ వృత్తి పనిని తిరిగి రజక వృత్తిదారుల సొసైటీలకు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా చేస్తున్న పోరాటాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. అత్యంత వెనుకబడ్డ రజక వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా వృత్తి పనిని రజక సొసైటీలకు ఇవ్వాలని ఆలోచించిన సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగులకమలాకర్, శాసనమండలి సభ్యులు బస్వరాజ్ సారయ్య, ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. వెంటనే టెండర్లను పిలవాలనీ, ప్రస్తుత కాంటాక్ట్‌లన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా తక్షణమే అన్ని జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించి.. అమలు చేయించాలని కోరారు.

3న కలెక్టరేట్ల వద్ద మహాధర్నా

తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఈనెల మూడో తేదీన అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద మహాధర్నాలు నిర్వహించాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండ్లు లేని పేదలు వేలాది తరలివచ్చి ధర్నాల్లో పాల్గొనాలని, వారి గొంతు వినిపించాలని కోరారు. ప్రజాసంఘాల నాయకత్వ బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని సూచించారు. జిల్లాలో సమస్య లోతుపాతులను కలెక్టర్‌కు వివరిస్తుందని తెలిపారు. పరిష్కార మార్గాలను ప్రతిపాదిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఈ వేదిక ఆధ్వర్యంలో బస్సు యాత్ర పూర్తయ్యిందని గుర్తు చేశారు. 64 పోరాట కేంద్రాల్లో గుడిసెలు వేసుకున్న లక్షకుపైగా కుటుంబాలకు ఈ యాత్ర ధైర్యాన్నిచ్చిందని వివరించారు. సమస్య తీవ్రతను పాలకులు గుర్తించడం లేదని తెలిపారు. కొన్ని కేంద్రాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, రియల్ ఎస్టేట్ కబ్జాదారులతో కుమ్మక్కై పేదల మీద దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం కోసం సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. యాత్ర సందర్భంగా పోరాట వేదిక నాయకత్వ బృందం ఎనిమిది మంది గుడిసె వాసులతోపాటు ఆ కేంద్రాల్లోనే బస చేసిందని తెలిపారు. వారి కష్టాలను కండ్లారా చూసిందని పేర్కొన్నారు. పాములు, తేళ్ల మధ్య దిక్కులేని బతుకులు వెతలు గమనించిందని వివరించారు. అందుకే ఈ పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఉద్యమం మీద నిర్బంధం ఆపాలని, కేసులను రద్దు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

డిమాండ్లు

- గుడిసెలు వేసుకున్న వారందరికీ 125 గజాల చొప్పున పట్టాలివ్వాలి. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, కేంద్రం రూ.10 లక్షలివ్వాలి.
- ఇండ్లు లేని పేదలందరికీ స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం చేయాలి.
- గృహలక్ష్మి పథకం నిబంధనలను సవరించాలి. సొంత ఫ్లాటు ఉన్న పేదలందరికీ వర్తింప చేయాలి. ఆర్థిక సహాయంపైన చెప్పిన విధంగా మార్పు చేయాలి.
- నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లన్నీ వెంటనే అర్హులకు కేటాయించాలి. మిగిలినవి తక్షణం నిర్మాణం పూర్తి చేసి కేటాయించాలి.
- గుడిసె వాసుల మీద కేసులను రద్దు చేసి నిర్బంధాన్ని ఆపాలి.

రాష్ట్ర మంత్రులకు దక్షిణ కొరియాలో ఘనస్వాగతం

- ఉత్తమ పర్యాటక రాష్ట్రమే లక్ష్యంగా టూర్ : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి నిమిత్తం విదేశాల్లో అధ్యయనం చేయడానికి వెళ్లిన రాష్ట్రమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌లతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందానికి దక్షిణ కొరియాలో భారత రాయబారి శుక్రవారం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రాన్ని ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విదేశీ పర్యటనకెళ్లినట్టు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం దక్షిణ కొరియా రాజధాని సీయోల్‌లోని వాటర్ రివర్ ఫ్రంట్‌ను తాము అధ్యయనం చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదుల వెంట సహజ సిద్ధంగా ఏర్పడిన అద్భుతమైన ప్రకృతి రమణీయ దశ్యాలు ఉన్నాయన్నారు. కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్ అభివద్ధికి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, మహబుబ్ నగర్‌లోని ట్యాంక్ బండ్ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు.

17, 18 తేదీల్లో హైదరాబాద్‌లో సివిల్ ఇంజనీర్ల జాతీయ సదస్సు

- ఏసీసీఈఐ హైదరాబాద్ కేంద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోనే అతి పెద్ద సివిల్ ఇంజినీర్ల సమ్మేళనం, జాతీయ సదస్సు జూలై 17, 18 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) తెలిపింది. ఈ సదస్సును హైదరాబాద్ కేంద్రం నిర్వహించనున్నది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అసోసియేషన్ సౌత్ ఇండియా అధ్యక్షులు కె.రాజ్ కుమార్ మాట్లాడుతూ సదస్సులో 600 మంది ప్రతినిధులతోపాటు ఎనిమిది దేశాల నుంచి 14 మంది అంతర్జాతీయ వక్తలు, జాతీయ వక్తలు పాల్గొంటారని తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.రెండు లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నదని చెప్పారు. ఎత్తైన భవనాల్లో హైదరాబాద్ భారతదేశంలో ఎనిమిది శాతం వాటా కలిగి ఉన్నదన్నారు. జాతీయ బిల్డర్లు సివిల్ ఇంజినీర్లనీ, వారి సంఖ్య పెరగాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సీహెచ్. నర్మద, హైదరాబాద్ సెంటర్ చైర్మెన్ కాశీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులకు ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యటనల సందర్భంగా మహబూబాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు పేరుతో అక్రమంగా అర్ధరాత్రి ఇండ్లపై పడి అరెస్టు చేయడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎక్కడ పర్యటన చేసినా మానవ హక్కులను హరించి పోలీసులు అర్ధరాత్రి ఇండ్లపై దాడి చేసి మరీ అరెస్టులు చేయడం దారుణమని విమర్శించారు. రాజ్యాంగ హక్కులు రాష్ట్ర పోలీసులు కాలరాస్తున్నారని తెలిపారు. మహబూబాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అధ్యక్షులు, కార్యదర్శులతోపాటు ఇతర నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటు : పీడీఎస్‌యూ

సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాల పర్యటనల సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని ఆ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పర్యటనల సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడం సరైంది కాదని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి విద్యారంగ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోకుండా పోలీసులు నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యారంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెల్త్ డైరెక్టర్‌పై చర్యలెందుకు తీసుకోరు..?

- ప్రగతిభవన్ ముట్టడికి లంబాడి హక్కుల పోరాట సమితి యత్నం

నవతెలంగాణ - బంజారాహిల్స్

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావు అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ లంబాడి హక్కుల పోరాట సమితి, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. ఈ నేపథ్యంలో ప్రగతి భవన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతతో పోలీసుల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే నివాసాల్లో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు పెద్ద ఎత్తున ప్రగతి భవన్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో పోలీసులు నాయకులను ముందస్తు అరెస్టు చేసి నారాయణ గూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హెల్త్ డైరెక్టర్ అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ వారు పోలీస్ స్టేషన్‌లోనే కరపత్రాలు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును

ఉపసంహరించుకోవాలి

- అటవీ భూమి దోపిడి ఆపాలి
- దేశవ్యాప్తంగా భూమి అధికార్ ఆందోళన్ నిరసనలు

న్యూఢిల్లీ : అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని భూమి అధికార్ ఆందోళన్ (బీఏఏ) డిమాండ్ చేసింది. శుక్రవారం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో అటవీ సంరక్షణ చట్ట తిరోగమన సవరణలు, అటవీ భూమి దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లో రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన తదితర 50కిపైగా సంఘాల కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, ర్యాలీలు జరిగాయి. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో ఆందోళన జరిగింది. అలాగే కర్నాటకతో పాటు వివిధ రాష్ట్రాల్లోనూ ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా బీఏఏ నేత హన్నన్ మొల్లా మాట్లాడుతూ అటవీ భూములు కనికరం లేకుండా దోపిడీకి గురవుతున్నాయనీ, ఇది తీవ్రమైన పర్యావరణ నష్టానికి, స్థానిక ప్రజలను వేరే చోటకి తరలింపుకు దారితీసిందని విమర్శించారు. అటవీ పరిరక్షణ చట్టానికి ప్రతిపాదించిన సవరణలు గిరిజన వర్గాల హక్కులకు తీవ్ర ముప్పు తెచ్చిపెడతాయని తెలిపారు. ప్రతిపాదిత సవరణలు 2006 అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ), 2013 నాటి భూ సేకరణ, పరిహారం, పునరావాస చట్టం (ఎల్ఏఆర్ఆర్)లోని నిబంధనలను విస్మరిస్తాయని చెప్పారు. తద్వారా అట్టడుగు వర్గాల హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. గ్రామ సభలను పిలిచే స్థానిక పరిపాలన సంస్థల అనుమతి లేకుండా అటవీ భూమి మళ్లింపులను వేగవంతం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. అట్టడుగు వర్గాల రాజ్యాంగ హక్కులను నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. ఈ సవరణలు కేంద్ర ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలను మంజూరు చేస్తాయనీ, ఈ అధికార కేంద్రీకరణ అటవీ సలహా కమిటీ, కేంద్ర సాధికారిత కమిటీ వంటి ఇప్పటికే ఉన్న చెక్‌లు, బ్యాలెన్స్‌లను బలహీనపరుస్తాయని విమర్శించారు. తగిన అటవీ అనుమతుల అవసరాలు లేకుండా అడవులు, అటవీ వనరులపై నియంత్రణ సాధించడానికి ప్రయివేటు సంస్థలకు అవకాశాలను కల్పిస్తాయని, ప్రభావ అంచనాలు, నియంత్రణ పర్యవేక్షణ లేకపోవడం ఆవాసాలు, జాతులు, అటవీ పర్యావరణ వ్యవస్థలకు ప్రమాదాలను కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రతిపాదిత సవరణలు గ్రామసభల అధికారాన్ని బలహీనపరుస్తాయనీ, కేంద్ర ప్రభుత్వ చేతిలో పాలనా అధికారాన్ని కేంద్రీకరించాయని అన్నారు. ఇది జీవవైవిధ్య పరిరక్షణ కోసం స్థానిక స్థాయి చర్యలను బలహీనపరుస్తుందనీ, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉంటుందని అన్నారు. అందుకే అటవీ సంరక్షణ సవరణ బిల్లు-2023ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ గమనం

ఉక్రెయిన్ వైఫల్యంతో బైడెన్ భవితకు తిప్పలు



న్యూయార్క్: ఉక్రెయిన్ రష్యాపై చేస్తున్న ప్రతిదాడి విఫలం కావటంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రాబోయే ఎన్నికల్లో ఓటమిపాలయ్యే అవకాశం ఉన్నట్టు ప్రముఖ జర్నలిస్టు సేమౌర్ హెర్ష్ అభిప్రాయపడ్డారు. డోనెట్స్క్, లుగాన్స్క్, ఖేర్సన్, జపోర్జియా ప్రాంతాలపైన రష్యా పట్టు ఏమాత్రం సడల లేదని ఆయన ఓ పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు.

రష్యాలో 24గంటలపాటు జరిగిన తిరుబాటు ఉక్రెయిన్ ప్రతిదాడి వైఫల్యం నుంచి కాసేపు అందరి దృష్టిని మరల్చినా ఉక్రెయిన్ ఘోర పరాజయం పాలవటం ఖాయమనిపిస్తున్నది. ఉక్రెయిన్‌లో అమెరికా పోషిస్తున్న పాత్రను తన విదేశాంగ విధాన విజయంగా ప్రకటించుకుని 2024లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించాలన్న ఆశతోవున్న బైడెన్ రాజకీయ భవితను ఉక్రెయిన్ పరాజయం దెబ్బ తీస్తుందని హెర్ష్ విశ్లేషించాడు. ఇప్పటివరకు అమెరికా ఉక్రెయిన్‌కు 150 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను అందించింది. ఉక్రెయిన్ ఓడిపోతే దాని ప్రభావం బైడెన్ భవితపై తీవ్రంగా ఉంటుంది.

ఉక్రెయిన్ ప్రతిదాడి ముందుకు సాగకపోవటానికి గల కారణం అది కేవలం ప్రారంభం మాత్రమేనని, పశ్చిమ దేశాల్లో శిక్షణ పొందిన సైన్యాన్ని ఇంకా రంగంలోకి దింపలేదని ఉక్రెయిన్ రక్షణ మంత్రి అలెక్సీ రెజనికోవ్ ప్రకటించాడు. ఉక్రెయిన్ విజయం గురించి మీడియాలో ఎంతగా ప్రచారం చేసినా యుద్ధరంగంలో ఫలితాలు అంతగా ఆశాజనకంగా లేవు. అమెరికాలో బైడెన్‌కున్న జనామోదం రోజురోజుకూ క్షీణిస్తున్న స్థితిలో డెమోక్రాట్లు అప్రమత్తం కావాలని హెర్ష్ హెచ్చరించాడు. ఉక్రెయిన్ సైన్యం ఎంతగా ముందుకు తోసుకొచ్చినా తమ రక్షణ రేఖలను అధిగమించటం అటుంచి కనీసం వాటి సమీపంలోకి కూడా రాలేకపోతున్నాయని రష్యన్ రక్షణ శాఖ ప్రకటించింది. అంతేకాకుండా జర్మనీ సరఫరా చేసిన లియోపర్డ్ 2 భారీ ట్యాంకులు, అమెరికా సరఫరా చేసిన బ్రాడ్లే యుద్ధ శకటాలు రష్యా దాడుల్లో కుప్పయిపోతున్నాయి. ఇదిలావుండగా నాటో దేశాలకు చెందిన అధికారులు కూడా ఉక్రెయిన్ చేస్తున్న ప్రతిదాడి సజావుగా సాగటంలేదని తమ ప్రయివేటు సంభాషణల్లో అంగీకరిస్తున్నారు. తత్ఫలితంగా ఉక్రెయిన్‌కు చేస్తున్న సహాయంలో కోతపడే అవకాశం ఉంది. రష్యాపై ఉక్రెయిన్ చేస్తున్న ప్రతిదాడిలో చెప్పుకోదగిన విజయాలు ఏమీలేవని నాటో కమాండర్, క్రిష్టోఫర్ కవోలి ఒక ప్రయివేటు సమావేశంలో చెప్పాడు. దీని ప్రభావం ఉక్రెయిన్‌కు అందిస్తున్న ధన సహాయం, మద్దతు, అన్నింటికంటే ముఖ్యంగా రానున్న శాంతి చర్చలపై ఉంటుందని అన్నాడు. ఇటువంటి అవగాహన ఉన్నప్పటికీ పైకి మాత్రం రష్యాను ఓడించే వరకు ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఉంటుందని పశ్చిమ దేశాల అధికారులు భీరాలు పలుకుతున్నారు. తాము శాంతి చర్చలకు సిద్ధమని, అందుకు ఉక్రెయిన్ సంసిద్ధంగా లేదని, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు చేస్తున్న ఆయుధ సరఫరా యుద్ధాన్ని పొడిగిస్తుందే తప్ప తమ దేశాన్ని కదిలించలేదని రష్యా పదేపదే ప్రకటిస్తున్నది.

పాత, కొత్త లేకుండా కలిసి సాగుతాం..

- ఖమ్మం జిల్లాకు భట్టి, రేణుక రెండు కండ్లు.. పొంగులేటి మూడో కన్ను
- అధికారంలోకి రాగానే నూటికి నూరుపాళ్లు ధరణీ పోర్టల్ రద్దు
- పదవి ఇవ్వనందుకు మీ అయ్య టీడీపీని వీడలేదా..?
- పొంగులేటిపై కేటీఆర్ వ్యాఖ్యలకు : రేవంత్‌రెడ్డి కౌంటర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"ఖమ్మం సభతో బీఆర్ఎస్ పాలనకు సమాధి కడతామని, తమ శీనన్న మూడో కన్నులాంటివాడని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా అంతే అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పొంగులేటి చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందన్నారు. తెలంగాణ జన గర్జన సభ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. జులై 2న ఖమ్మంలో జరిగే రాహుల్ సభ ఏర్పాట్ల పరిశీలన కోసం శుక్రవారం ఖమ్మం వచ్చిన రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఖమ్మం వేదికగా కాంగ్రెస్ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ ఎన్ని అడ్డుగోడలు పెట్టినా కాంగ్రెస్ కార్యకర్తలు వాటిని పడగొట్టి ఖమ్మం సభకు హాజరవుతారని అన్నారు. పార్టీలో పాత, కొత్త లేకుండా నాయకులందరం కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. ఖమ్మంలో 10కి 10 సీట్లు గెలిపిస్తే.. రాష్ట్రంలో 80కి పైగా సీట్లు గెలిపించే బాధ్యత తమదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టంచేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డితో నాలుగైదు నెలలుగా చర్చలు జరిపామని, కార్యకర్తలు, అభిమానులతో చర్చించాకే వారి అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరాలని పొంగులేటి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాకు భట్టి విక్రమార్క, రేణుక రెండు కండ్లయితే.. పొంగులేటి మూడో కన్ను అని అన్నారు. జులై 2న ఖమ్మం సభ వేదికగా సమరశంఖం పూరించాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చిందన్నారు.

టికెట్లు ఇవ్వనందుకే పొంగులేటి కాంగ్రెస్‌లోకి వెళుతున్నాడనే కేటీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. ఆనాడు చంద్రబాబు పదవి ఇవ్వకపోతేనే కదా.. కేసీఆర్ టీడీపీని వీడిందని చురకలు అంటించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి సాయంగా ఉండేందుకు పొంగులేటి 1500 బస్సులు సభ కోసం అద్దెకు తీసుకోవాలనుకున్నా.. బస్సులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని మంత్రి పువ్వాడను ఉద్దేశించి ఆరోపించారు. బస్సులు ఇచ్చినా ఇవ్వకపోయినా.. నడుచుకుంటూనైనా ఇక్కడి ప్రజలు సభకు వస్తారని, మీరు అడ్డుగోడలు కడితే దూకి వస్తారని, మీరే అడ్డు వస్తే తొక్కుకుంటూ వస్తారని స్పష్టంచేశారు. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరుతున్నారనే కేసీఆర్ ప్రగతి భవన్ నుంచి కదిలారన్నారు. భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి వెయ్యి కిలోమీటర్లు నడిచారని, అందుకే కేసీఆర్ పోడు పట్టాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. సచివాలయానికి రాని కేసీఆర్‌ను ప్రజల బాట పట్టించామన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని.. మరో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. అధికారంలోకి రాగానే నూటికి నూరుపాళ్లు ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ, నాయకులు మల్లు రవి, బలరాంనాయక్, వి.హనుమంతరావు, పొంగులేటి ప్రసాదరెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-4 రాతపరీక్ష

9.51 లక్షల మంది దరఖాస్తు

- 2,846 కేంద్రాల ఏర్పాటు
- 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు రాతపరీక్ష శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరగనుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఏర్పాట్లను పూర్తి చేసింది. శనివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2ను ఓఎంఆర్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అయితే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తారు. అభ్యర్థులు పేపర్-1కు ఉదయం 9.45 గంటల్లోపు, పేపర్-2కు మధ్యాహ్నం 2.15 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఆ తర్వాత అభ్యర్థులను అనుమతించరు. పేపర్-1కు ఉదయం ఎనిమిది గంటల నుంచి పేపర్-2కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందు భద్రతా సిబ్బందికి, గదిలోకి వెళ్లాక ఇన్విజిలేటర్‌కు ఫొటో గుర్తింపు కార్డును చూపించాలి. ఈ పరీక్షకు అభ్యర్థులు భారీగా హాజరు కానుండడంతో వేలిముద్రను తప్పనిసరి చేశారు. ఓఎంఆర్ పత్రంలో బ్లూ/బ్లాక్ పెన్‌తో పేరు, కేంద్రం కోడ్, హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ రాయాలి. హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ సరిగా రాయకున్నా, బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ కాకుండా ఇంక్‌పెన్, జెల్‌పెన్, పెన్సిల్ ఉపయోగించినా ఓఎంఆర్ పత్రం చెల్లుబాటు కాదు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమోట్‌తో కూడిన కారు తాళాలు, విలువైన, నిషేధిత వస్తువులను అభ్యర్థులు తీసుకెళ్ల కూడదు. అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి. షూ వేసుకుని రాకూడదు. గ్రూప్-4 రాతపరీక్ష నిర్వహించే పరీక్షా కేంద్రాలున్న విద్యాసంస్థలకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం సెలవును ప్రకటించింది. వచ్చేనెల ఎనిమిదిన రెండు శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్ ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-4కు రాష్ట్రవ్యాప్తంగా 9,51,205 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసిన వారిలో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల వరకు 9,01,051 (94.72 శాతం) మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50,154 (5.27 శాతం) మంది డౌన్‌లోడ్ చేసుకోలేదని వివరించారు. 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బీజేపీలోనూ కేసీఆర్ కోవర్టులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో 'దున్నపోతు' వ్యవహారం దుమారం రేపుతున్నది. చినుకు చినుకు కాస్త జడివానలా మారినట్టు జితేందర్‌రెడ్డి ట్వీట్‌తో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరుకున్నది. ఈటల కౌంటర్ ఎటాక్‌తో ఇంటి పోరు బజారున పడ్డది. జితేందర్‌రెడ్డి ట్వీట్ చేసి రెండు రోజులవుతున్నా దాన్ని నేతలెవ్వరూ ఖండించలేదు. పార్టీలో ఈ ధోరణి మంచిదికాదనీ, నేతలెవ్వరూ అలా ట్వీట్లు చేయొద్దని అధిష్టానం చెప్పలేదు. రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ వాటిని ఖండించకపోవడం పైనా ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఆ ట్వీట్‌ను ఉపసంహరించుకోవాలని ఎందుకు సూచించలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇంత రచ్చ జరుగుతున్నా జితేందర్‌రెడ్డి తొలగించకపోవడాన్ని బట్టి చూస్తేనే ఈటలకు వ్యతిరేకంగా ఆ పార్టీలో బలమైన ఫోర్స్ పనిచేస్తున్నదని అర్థమవుతున్నది. ఈ వాస్తవాన్ని పసిగట్టిన ఈటల రాజేందర్ తన స్థాయిలోనే విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. 'వయస్సు, అనుభవం ఉన్నవారు ఏదిపడితే అది మాట్లాడొద్దు. జాగ్రత్తగా ఉండాలి. ఇతరుల స్వేచ్ఛ, గౌరవానికి భంగం కలిగేలా చూడొద్దు' అంటూ తనదైన శైలిలో చురకలు అంటించారు. అదే సమయంలో కాంగ్రెస్‌పార్టీలోనే కాదు...బీజేపీలోనూ కేసీఆర్ కోవర్టులున్నారని మరోమారు బాంబు పేల్చారు. ఆ కోవర్టులు పార్టీలోనే ఉంటూ అదే పార్టీని ముంచుతారని మరోమారు హెచ్చరికలు జారీ చేశారు. కోవర్టులతోనే కేసీఆర్ రాజకీయం చేస్తారనీ, ఇంటిదొంగల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందేననని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ 'కోవర్ట్' కామెంట్ చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ చేశారు. ఆ సమయంలో తమ పార్టీలో 'కోవర్టులెవ్వరూ లేరు' అంటూ బండి, విజయశాంతి, పలువురు సీనియర్లు ఖండించిన సంగతి తెలిసిందే. తాజా ఈటల బాంబుతో...అసలు పార్టీలో కేసీఆర్ కోవర్టులు ఎవరు? అనే చర్చ తెరపైకి వచ్చింది. ఇది ఎటువైపు దారి తీస్తుందో అని ఆ పార్టీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, బలమైన ముదిరాజ్ సామాజిక తరగతి నుంచి వచ్చిన ఈటల రాజేందర్ సేవలను బీజేపీ సరిగ్గా వాడుకోవట్లేదనే విమర్శా రాజకీయ విశ్లేషకుల నుంచి వస్తున్నది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు కూడా తాము గీసిన చక్రబంధంలో ఉండి పనిచేయాలనే బీజేపీ విధానం కూడా ఆ పార్టీకి చేటు చేస్తున్నదనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నది. ఈ పద్ధతే ఈటల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డి, కపిలవాయి దిలీప్‌కుమార్, తదితర నేతలు అంటీముట్టనట్టు ఉండటానికి కారణమనే చర్చ కూడా నడుస్తున్నది.

ఈటలకు వై ప్లస్ భద్రత
బుల్లెట్ ప్రూఫ్ కారు, 16 మంది పోలీసులతో రక్షణ

ఈటల రాజేందర్‌కు రాష్ట్ర ప్రభుత్వం వైప్లస్ భద్రతను కల్పించింది. అతనికి బుల్లెట్ ప్రూఫ్ కారును కేటాయించింది. 16 మంది పోలీసులతో భద్రత కల్పించనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నుంచే ఆయనకు వైప్లస్ కేటగిరీ భద్రత అమల్లోకి రానున్నది.

బీజేపీలో జరుగుతున్న పరిణామాలు, మరోవైపు తన భర్తను చంపించే కుట్ర జరుగుతున్నదని జమున చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యి ఈ నిర్ణయం తీసుకున్నది. దీనికి ముందే కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రత్యేక భద్రత కల్పించబోతుందన్న ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఈటలకు భద్రత అంశాన్ని ఐపీఎస్ ఆఫీసర్‌ను పంపి పరిశీలించాలని కేటీఆర్...డీజీపీని ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో డీసీపీ సందీప్‌రావు ప్రత్యేక నివేదికను డీజీపీకి అందజేశారు. ఈ క్రమంలో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. సౌమ్యుడైన ఈటల రాజేందర్ విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా రాజకీయ ఎత్తుగడలో భాగమేనన్న చర్చ నడుస్తున్నది.

పోరాటాల ఫలితమే పోడు భూములకు హక్కు పత్రాలు

- తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోరాటాల ఫలితంగానే పోడు భూములకు హక్కు పత్రాలు వచ్చాయని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాలం గిరిజనులు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీలు చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం 4 లక్షల ఎకరాలపై హక్కు పత్రాలను ఇస్తున్నదని గుర్తుచేశారు. పోడు పోరాటంలో గిరిజనులు, గిరిజన సంఘాలు నాయకులపై పెట్టిన కేసులు అన్నిటిని ఎత్తేయాలని ఆసిఫాబాద్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చీఫ్ సెక్రటరీని ఆదేశించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులు, ఇతర పేదలు రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో పోడు భూములను సాగు చేస్తున్నారని తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ప్రకారం వారందరికీ హక్కులు కల్పించాలని తొమ్మిదేండ్లుగా గిరిజనులు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీలు పోరాటాలు నిర్వహించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందని తెలిపారు. వేలాది మందిపై అక్రమ కేసులు పెట్టిందనీ, వందలాదిమంది జైళ్లకు వెళ్లారని గుర్తుచేశారు. ఇప్పటికీ అనేకమంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆ పోరాటాల ఫలితంగానే సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 11.50 లక్షల ఎకరాలపై హక్కులు కల్పిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ కేవలం 4 లక్షల ఎకరాలపై, 1 లక్ష 51 వేల మంది గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. మరో 7.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా నిరాకరించడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం అట్టహాసంగా పంపిణీ చేస్తున్న పోడు హక్కు పత్రాలు అన్ని జిల్లాల్లో సమాంతరంగా పంపిణీ చేయకపోవడం వలన లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు. మరో వైపు ముఖ్యమంత్రి ,మంత్రులు పోడు భూముల పంపిణీకి జిల్లాలకు వెళ్లిన సందర్భంగా అనేక మంది గిరిజన సంఘం, గిరిజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం, గృహనిర్బంధం విధించడమేంటని ప్రశ్నించారు. గిరిజనులు, పేదల దరఖాస్తులను తిరస్కరించిన వాటన్నిటిని తిరిగి పరిశీలించి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేటినుంచి పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియ శనివారం ఉంటుందని వివరించారు. ఆదివారం ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. శనివారం నుంచి ఈనెల మూడో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు గడువుందని పేర్కొన్నారు. ఈనెల ఏడో తేదీన తుదివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు https://tspolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.


పోడుపట్టాదారులకు ఉచిత విద్యుత్, రైతుబంధు

ఖమ్మం, పాల్వంచలో పోడుపట్టాల పంపిణీలో.. మంత్రులు హరీశ్ రావు, పువ్వాడ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాలు పంపిణీ చేసిన రైతులకు రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ పథకాలను వర్తించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోడు రైతులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పోడు పట్టాలను మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజక వర్గాల్లోని 77 గ్రామ పంచాయతీలు, 9 మండలాల పరిధిలో ఉన్న 6589 మంది పోడు రైతులకు 13,139.04 ఎకరాలకు సంబంధించి పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ సుగుణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సభలో జిల్లాలో మొత్తం 50,595 మంది పోడు రైతులకు 1,51,195 ఎకరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభల్లో ముందుగా గురువారం అకాల మృతి చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ వేద సాయిచంద్‌కి సంతాపం తెలిపారు. అనంతరం మంత్రులు మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా 4.06 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ పోడు భూములపై గిరిజనులకు సర్వహక్కులు ఉంటాయని చెప్పారు. అలాగే, ఈ భూములు వారసత్వంగా కూడా సంక్రమించే హక్కు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో 2471 గూడెంలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. 2005లో రూపొందించిన ఆర్ఓఎఫ్ఆర్ చట్టం మేరకు పోడు భూములు సాగుచేస్తున్న వారిని హక్కుదారులుగా పట్టాలు అందజేసినట్టు తెలిపారు. పట్టాలు పొందిన వారికి రైతుబంధు, రైతుబీమా తదితర అన్ని ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు.



సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. కాగా, భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెంలో 4541 మందికి 15311.27ఎకరాలు, భద్రాచలంలో 6,515 మందికి 16211.02 ఎకరాలు, ఇల్లందులో 12,347 మందికి 36,588.37 ఎకరాలు, పినపాకలో 15962 మందికి 52,438.39 ఎకరాలు, అశ్వారావుపేటలో 9,418మందికి 25,817.15 ఎకరాలు, వైరాలో 1,812 మందికి 4,826.40 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చ నాగేశ్వర రావు, హరిప్రియ, రాములునాయక్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, అనుదీప్, ఐటీడీఏ పీవో గౌతమ్, రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మెన్ రాయల శేషగిరిరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీలకు లక్ష అందని ద్రాక్షేనా?

- దరఖాస్తులకు దూరంగా లక్షల మంది.. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలజారీకి కొర్రీలు
- స్థిరనివాసం లేనివారిని పట్టించుకోని అధికారులు
- 5,28,862 లక్షల దరఖాస్తుల్లో ఎంబీసీలవి 12వేలే..

ప్రభుత్వం ప్రకటించిన లక్ష సాయం అత్యంత వెనుకబడిన కుల వృత్తుల (ఎంబీసీ) దరిచేరేనా? అంటే ఏమో..చెప్పలేం అంటూ సమాధానాలొస్తున్నాయి. కులవత్తుల వారికి సర్కారు ప్రకటించిన రూ.లక్ష సాయం పథకం.. అర్హులందరికీ అందే పరిస్థితి లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నిర్ణీత సమయానికి దరఖాస్తు చేసుకుందామంటే కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు రాకపాయే.. గడువు పొడిగించాలని సర్కారును వేడుకున్నా..పట్టించుకోకపాయే..ఇప్పుడు ఎలా? అని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వం ప్రకటించిన లక్ష సాయంకు విధించిన గడువు చివరి తేదీ నాటికి 5,28,862 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో బీసీ ఏ 2,66,001, బీసీ బి1,85,136,బీసీ డి 65,310, కాగా,ఎంబీసీలవి 12,415 ఉన్నాయి. వృత్తి ఆధారిత జీవనంపై బతుకుతున్న 14 కుల వృత్తులతో పాటు, ఎంబీసీలలోని 36కులాలకు ఈ పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేస్తున్నది.

ధృవపత్రాలకు కొర్రీ..

'సంచారమే మా బతుకాయే.. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు ఎక్కడవి'? ఇది ఎంబీసీల ఆవేదన. అడ్రస్ లేనోళ్లు.. అడుక్కునేటోళ్లు.. మీకు ధృవ పత్రాలు ఇవ్వాలంటే..ఎట్లా..? కష్టమే అంటూ ప్రభుత్వ అధికారులు కొర్రీలు పెట్టారు. మరో పక్క సర్వర్ డౌన్ సమస్యలతోపాటు, సిబ్బంది కొరత, ఆ సమయంలో దశాబ్ది ఉత్సవాల హడావిడి.. ఇత్యాది సమస్యలతో ఆ పత్రాలు చేతికి అందలేదు. దీంతో 12వేల మంది ఎంబీసీలు మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారు. సకాలంలో పత్రాలు అందక లక్షలాధి మంది పథకానికి దూరమయ్యారు. దరఖాస్తులకు గడువు పెంచాలని ప్రజాసంఘాలు, వృత్తి సంఘాలు సర్కారుకు మొర పెట్టుకున్నా..పెడచెవిన పెట్టింది. ఎంబీసీలే కాదు, అర్హత ఉన్నా సమయం లేక లక్షల మంది పథకానికి దరఖాస్తు చేసుకోలేక పోయారు. బీసీ జనాభాలో 38శాతం ఎంబీసీలుంటారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేవీ వీరి దరి చేరటం లేదు. దీంతో రూ.లక్ష సాయం పథకాన్నైనా సద్వినియోగం చేసుకుందామని ఆశించినా..అది కూడా అందని ద్రాక్షలా మారుతుందా? అన్న అనుమానాలను లబ్దిదారులు వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించటంలో సర్కార్ వైఫల్యం..

పథకం లబ్దిదారులకు తగిన అవగాహన కల్పించటంలో సర్కార్ వైఫల్యం ఉన్నది. ఇందుకు ఆశావాహులు చేసుకున్న దరఖాస్తులే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అత్యంత వెనుకబడిన వృత్తి కులాలవారు తక్కువ దరఖాస్తులు చేసుకున్నారు. ఎవరికైతే ఈ పథకం ఫలాలు అందాల్నో వారి నుంచే తక్కువ దరఖాస్తులు రావటం విచారకరమే. తరతరాలుగా సేవా,యాచక, సంచార జీవనాన్ని నమ్ముకుని బతుకుతున్న కుల వృత్తుల వారికి ప్రభుత్వ లక్ష్యం చేరువైతే..వారి బతుక్కు ఉపశమనాన్ని కల్పించినట్టవుతుంది. కానీ..వడ్డెర 52వేలు, కుమ్మరి 47వేలు, నాయీబ్రాహ్మణ 44వేలు,వడ్రంగి 40వేలు, పద్మ శాలి 23 వేలు, కమ్మరి 16వేలు,స్వర్ణకారులు 14 వేలు, రజక 1.13వేల గడువు సమయానికి దరఖాస్తులు చేసుకున్నారు. ఎంబీసీల పరిస్థితి చెప్పన వసరం లేదు. నేటికీ వారికి ప్రభుత్వం ఒక పథకం ప్రకటించిందన్న సంగతే తెలియకుండా ఉన్నారు.

పరిశీలనపై స్పష్టత ఇవ్వని సర్కార్..

వచ్చిన దరఖాస్తుల పరిశీలన సమయంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల పరోక్ష జోక్యం పెరుగుతున్నదని విమర్శలు వస్తున్నాయి. తమ పార్టీ అనుయాయులకే ఈ పథకం ప్రయోజనం దక్కితే..దరఖాస్తు చేసుకున్నా..అందరికీ అందకపోతే ఎలా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మంత్రి సంతకంతో లబ్దిదారులకు లక్ష సాయాన్ని అందించాలనే నిబంధన తిరిగి బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాలకే అన్న విమర్శలు లేకపోలేదు. మరో పక్క ఏ ఏ క్యాటగిరిల్లో ఎవరెవ రికి మొదటి విడతలో రూ.లక్ష సాయమందు తుందనేది స్పష్టత లేదు. దీంతో ఆశావాహులు ఆం దోళన చెందుతున్నారు. జూన్ ఆరున వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ విడుదల చేసిన జీవో 5లో నాయీబ్రాహ్మణ, రజకులు, సగర ఉప్పర, కుమ్మరి శాలివాహన, అవుసలి, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల/వడ్రంగి/ శిల్పులు, కృష్ణబలిజ,మేదరి, వడ్డెర, ఆరెకటిక, మేర తదితర 15 కులాలతోపాటు ఎంబీసీ 36 కులాలు ఈ జాబితాలో ఉన్నాయి.

నిరంతర ప్రక్రియపై సందేహాలు..

ఈ పథకానికి కాలపరిమితి లేకుండా నిరంతర ప్రక్రియ అంటూ అసంబద్ధంగా ప్రభుత్వం ప్రకటించటంలో సహేతుకత లేదని వృత్తి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో వెనుకబడ్డ కులాల జనాభా ఎంత? వారిలో వృత్తి కులాల వారు ఎంత మంది? ఇందులో సేవా, సంచార కుల వృత్తుల వారి సంఖ్య ఎంత? వీరందరికీ ఎప్పటి వరకు రూ. లక్ష సాయం పథకం లక్ష్యాన్ని చేరుకోగలమనే ప్రణాళికను ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించలేదు. దీనికి తగిన బడ్జెట్ కేటాయింపులు చూపించలేదు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను ప్రారంభించటం మూలంగా గతంలో ప్రకటించిన మూడెకరాల భూమి, దళిత బంధు పథకాలలాగానే ఇది కూడా నత్తను మరిపించేలా సాగుతుందా? అని లబ్దిదారులు అనుమానిస్తున్నారు.

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వారు ఫ్రంట్‌లైన్ వారియర్లు. కరోనా కాలంలో వారి విలువ మరింతగా తెలిసి వచ్చింది. రాత్రింబవళ్లు నిద్రాహారాలు లేకుండా వైరస్‌పై జరిగిన యుద్ధం చేసి మానవాళిని కాపాడిన త్యాగధనులు. ఆ యుద్ధంలో ప్రాణాలను సైతం కోల్పోయిన వారెందరో. ఇంట్లో మనుషులే దగ్గర ఉండేందుకు ఇబ్బంది పడిన క్షణాలవి. అలాంటిది వేలాది మంది కరోనా రోగుల మధ్య నడుమ గడిపిన వీరత్వం వారిది. అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యంగా హాయిగా జీవించేందుకు నిరంతరం ప్రజారోగ్య పరిరక్షణ కోసం పని చేస్తున్న డాక్టర్లను గుర్తించి, ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది జూలై ఒకటో తేదీన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వైద్యరంగంలో విశేష సేవలందించిన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని జూలై ఒకటో తేదీన నేషనల్ డాక్టర్స్ డే నిర్వహిస్తున్నారు. ఆయన 1882 జూలై ఒకటో తేదీన జన్మించారు. 1962 జూలై ఒకటో తేదీన మరణించారు. పశ్చిమబెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1961 ఫిబ్రవరి నాలుగున కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో ఆయన్ను సత్కరించింది. ప్రతి ఏడాది జూలై ఒకటో తేదీన ఆయా డాక్టర్ల సంఘాలు వివిధ కార్యక్రమాలతో తమ సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

భగవంతునితో సమానుడిగా, అంతటి వాడిగా సమాజంలో డాక్టర్లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇటీవల కాలంలో ప్రజావైద్యులపై దాడుల పెరిగిపోతున్నాయి. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో తాము రోగులకు సేవలందిస్తున్నామని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తగిన భద్రత కల్పించాలని కోరుతున్నారు.

13 వేలతో ఎట్ల బతకాలో చెప్పండి

- జీవో 21 గెజిట్ చేసి రూ.27వేల వేతనం ఇవ్వాలి? ● ధరలు పెరిగేలా చేస్తున్న పాలకులకు జీతాలు పెంచాలనే సోయి లేదా?

- మార్కెట్ యార్డుల సెక్యూరిటీ గార్డులను పర్మినెంట్ చేయాలి : యూనియన్ ధర్నాలో పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికులకు, చిరుద్యోగులకు జీతాలు పెంచాలనే సోయిలేదా? చేతికొచ్చే రూ.13 వేల జీతంతో ఎట్ల బతకాలో చెప్పండి? అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రశ్నించారు. కనీస వేతనాల జీవో 21ని వెంటనే గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్(కార్మిక శాఖ కమిషనరేట్) ఎదుట మార్కెట్ సెక్యూరిటీ గార్డులు ధర్నా చేశారు. జేసీఎల్ చంద్రశేఖరానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు, చట్టాల మీద దాడి చేస్తున్నదనీ, అదే దారిలో రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయాణిస్తున్నదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు, జీవన వ్యయాలు పెరిగాయని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సీఎం కేసీఆర్ జీతాలు పెంచుకున్నారని విమర్శించారు. అదే సమయంలో కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నా బుద్ధి ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. షాపులోకి పోయి టమాటలు కొంటే ఎమ్మెల్యే కాబట్టి ఎక్కువ ధర, కూలోడు కాబట్టి తక్కువ ధరకు ఇస్తారా? ఇద్దరికీ ఇచ్చే రేటు ఒకటే కదా? అలాంటప్పుడు రూ.13 వేల జీతంతో సెక్యూరిటీ గార్డులు ఎట్ల బతుకతరు? జీవో విడుదల చేస్తే ప్రభుత్వ సొమ్మేం పోదుకదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జీవో జారీ చేసిన తేదీ నుంచీ మార్కెట్ సెక్యూరిటీ గార్డులకు ఎరియల్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఉన్నట్టుగానే మార్కెట్ సెక్యూరిటీ గార్డులకూ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలనీ, గతంలో ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ యార్డుల్లో స్థలమిచ్చి ఇల్లు కట్టివ్వాలని కోరారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు మాట్లాడుతూ..ఐదేండ్ల కోసారి సవరించాల్సిన కనీసవేతనాల జీవోలను పదేండ్లు దాటినా ఎందుకు సవరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 180 వ్యవసాయ మార్కెట్లలో 28 ఏండ్ల నుంచి కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ పద్ధతిన మార్కెట్ యార్డుల్లో, చెక్‌పోస్టులలో సెక్యూరిటీ గార్డులుగా సుమారు 1,200 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిని ఎందుకు పర్మినెంట్ చేయడం లేదని ప్రశ్నించారు. జీవితాంతం అదే పద్ధతిలో పనిచేయాలా? అని నిలదీశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా కనీస వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదని అడిగారు.

ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల సాంబయ్య, యాటల సోమన్న మాట్లాడుతూ...ఏజెన్సీలు జీతాల్లో, పీఎఫ్ చెల్లింపుల్లో కోతలు పెడుతున్నాయనీ, దీనివల్ల సెక్యూరిటీ గార్డులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము, కోశాధికారి టి. జనార్ధన్, ఉపాధ్యక్షులు జి. లక్ష్మణ్, వెంకట నారాయణ, పి. రాము, మహమూద్, మహేందర్ రెడ్డి, సభ్యులు వెంకటేష్, ఎండి. యాకూబ్, ముత్తయ్య, ఎం. యాకయ్య, ఎం. భాస్కర్, లక్ష్మయ్య, నర్సయ్య, చంటన్న, శ్రీను, నర్సోజీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన జీపీ కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట ధర్నా, భారీ ర్యాలీ
- సమస్యలు పరిష్కరించకుంటే 6 నుంచి సమ్మెకు సిద్ధం
- జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సుధాకర్, జిల్లా చైర్మెన్ రాపర్తి రాజు



నవతెలంగాణ-జనగామ

కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు కలెక్టరేట్‌కు కదం తొక్కారు. పంచాయతీ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి కార్మికులు ధర్నా నిర్వహించారు. సుమారు 5 గంటలకు పైగా సాగిన ఈ ధర్నాలో.. ఐక్య పోరాటాల ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకుంటామని నినదించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సభలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సుధాకర్, జిల్లా చైర్మెన్ రాపర్తి రాజు వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికుల శ్రమ ఫలితంగానే జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు రాష్ట్రానికి వచ్చాయని, కానీ వారి సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని గ్రామపంచాయతీల్లో 11 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దాంతో వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో సుమారు 50 వేల మందికి పైగా పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారని, ఏండ్ల తరబడి పనిచేస్తున్నా వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటివి అమలుచేయడం లేదన్నారు. ఇప్పటికైనా వారిని పర్మినెంట్ చేసి పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు.. డీపీఓ కలెక్టర్ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని, 8 గంటల పని దినం, వారాంతపు, పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. ఏడాదికి 3 జతల యూనిఫామ్, సరిపడా చెప్పులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ప్రభుత్వానికి అందించామని, జులై 5వతేదీ లోపు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్లు పగిడిపల్లి మల్లేష్, నారోజు రామచంద్రం, డి శ్రీశైలం, బత్తిని వెంకన్న, బస్వ రామచంద్రం, జిల్లా నాయకులు ఎస్ విజేందర్, జె ప్రకాష్, రాజేంద్రప్రసాద్, గుర్రం లాజర్, జీడి ఆనందం, గుగులోతు రతన్ సింగ్, టి. యాకూబ్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

- అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-మహేశ్వరం

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడానికి అంగన్‌వాడీలు సిద్ధమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి స్పష్టంచేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో జరిగిన జీపు జాత ముగింపు సభలో వారు మాట్లాడారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్లో కేటాయింపులు తగ్గడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, లబ్దిదారులు నష్టపోతున్నారన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి అన్ని సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు.. ఉద్యోగ భద్రతకు ప్రమాదం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస చట్టబద్ధ హక్కులు, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని విమర్శించారు. 13 ఏండ్ల క్రితం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు చేసిన.. కనీస వేతనం ప్రతిపాదననూ అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో గ్రాడ్యు టీ ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్నేండ్లుగా బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తుండటం తోనే, నేడు 60 శాతం నిధులతో ఐసీడీఎస్ అనేక సమస్యలతో సతమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతాలు పెంచలేదన్నారు. 2018లో టీచర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1250 పెంచాలని కోరినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధ్యం కాదంటున్నాయని తెలిపారు. నూతన విద్యావిధానం వల్ల ఐసీడీఎస్ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించి, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, చంద్రమోహన్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, కిషన్, జగదీష్, రుద్రకుమార్, సాయిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, బాలరాజ్, పోచంనేని కృష్ణ, బుగ్గ రాములు, కె.కృష్ణ, సీహెచ్ ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని కాపురాన్ని చిదిమేసిన మద్యం

- ముగ్గురు పిల్లలతో కలిసి మానేరులో దూకిన మహిళ
- మృతదేహాలను వెలికి తీసిన పోలీసులు
- భర్త మద్యానికి బానిసయ్యాడని..
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో విషాదం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పచ్చని కాపురాన్ని మద్యం కూల్చేసింది.. మతాలు వేరైనా వాళ్లను పెండ్లితో ఒక్కటి చేసిన ప్రేమను చిదిమేసింది. నలుగురి ప్రాణం తీసింది. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్న ఇంటి పెద్ద మద్యానికి బానిసవ్వడం.. ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతోపాటు.. అతనిలో మార్పు లేకపోగా.. తాను బతికుండగానే పట్టించుకోని భర్త తాను పోయాక పిల్లలను ఏం చూసుకుంటాడని మనస్తాపం చెందిన ఇల్లాలు.. ముగ్గురు పిల్లలు సహా తానూ మధ్యమానేరు డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలంలోని మిడ్‌మానేరులో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వేములవాడ మండలం రుద్రవరానికి చెందిన రజిత, కరీంనగర్‌కు చెందిన మహమూద్ అలీ పదేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు ఆయాన్(7), కుమార్తె అసరజా(5), 14నెలల పసికందు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న మహమ్మద్ అలీ మద్యానికి బానిసయ్యాడు. క్రమంగా ఆర్థిక ఇబ్బందులూ ఎదురై కుటుంబంలో కలతలు తీవ్రమయ్యాయి. దీంతో రజిత పలుమార్లు భర్తను హెచ్చరించింది.. పంచాయితీ కూడా పెట్టించింది. అయినా అతని తీరు మారలేదు. చివరికి ఠాణా మెట్లు కూడా ఎక్కింది. ఈ నెల 27న భార్యాభర్తలిద్దరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సర్దిజెప్పి పంపించారు. అయినా అలీ తాగుడు మానలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రజిత పిల్లలతో కలిసి ఆత్మహత్య నిర్ణయానికి వచ్చింది. ముగ్గురు పిల్లలను తీసుకుని వేములవాడ నుంచి బోయిన్‌పల్లి మండలం శాత్రాజుపల్లి వద్ద మధ్యమానేరు డ్యామ్ వద్దకు చేరుకుంది. డ్యామ్‌లో ముగ్గురు పిల్లలతోపాటు తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. నలుగురి మృతదేహాలు నీటిపై తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డ్యామ్ నుంచి మృతదేహాలను పోలీసులు వెలికి తీయించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోస్త్ రెండోవిడతలో 49,267 మందికి సీట్ల కేటాయింపు

- 14వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు ● ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రెండో విడతలో 49,267 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, పాలమూరు వర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, మహిళా వర్సిటీ వీసీ విజ్జులత, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, టీయూ రిజిస్ట్రార్ యాదగిరి, కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ జి యాదగిరి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డి తిరువెంగళచారి రెండోవిడత సీట్లను కేటాయించారు. మూడో విడత షెడ్యూల్‌ను వారు విడుదల చేశారు. దోస్త్ రెండో విడతకు 53,184 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. మొదటి ప్రాధాన్యత ద్వారా 35,195 మంది, రెండో ప్రాధాన్యత ద్వారా 14,072 మంది విద్యార్థులు సీట్లు పొందారని తెలిపారు. తక్కువ వెబ్‌ఆప్షన్లు నమోదు చేయడం వల్ల 3,917 మంది సీట్లు పొందలేకపోయారని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారిలో ఆర్ట్స్ 6,307 మంది, కామర్స్ (బీబీఏ కలిపి) 21,255 మంది, లైఫ్ సైన్సెస్ 11,944 మంది, ఫిజికల్ సైన్సెస్ 9,076 మంది, డేటా సైన్స్ 431 మంది, డీఫార్మసీ 203 మంది ఇతరులు 51 మంది కలిపి మొత్తం 49,267 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ శనివారం నుంచి ఈనెల 14 వరకు చేయాలని సూచించారు. మొదటి విడతలో సీటు పొంది ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థుల రెండో విడతలో సీటు పొందితే మళ్లీ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కోరారు. రెండోవిడతలో సీటు కేటాయిస్తే మొదటి విడతలోని సీటును కోల్పోతారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోయినా సీటు కోల్పోతారని, దోస్త్ రిజిస్ట్రేషన్ రద్దవుతుందని పేర్కొన్నారు. మూడో విడత తర్వాతే ఈనెల 21 నుంచి 24 వరకు కాలేజీల్లో విద్యార్థులు రిపోర్టు చేయాలని సూచించారు. శనివారం నుంచి మూడో విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈనెల 14 వరకు గడువుందని పేర్కొన్నారు. శనివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఈనెల 20న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఈనెల 24 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

'కారుణ్య' ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీకి జేఏసీ విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సర్వీసులో ఉండి మరణించిన ఉద్యోగుల స్థానంలో విధుల్లో చేరిన కుటుంబసభ్యులను రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు విన్నవిస్తూ, ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్‌కు విజ్ఞాపనపత్రం అందచేశారు. దీనిపై జేఏసీ కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ కే యాదయ్య సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సర్వీసులు ఉండి మరణిస్తే, వారి వారసులకు ఉద్యోగం కల్పించడం కోసం అవసరమైతే కొత్త ఉద్యోగం సృష్టించి నెలరోజుల్లో పోస్టులో నియామకం చేస్తారని తెలిపారు. కానీ ఆర్టీసీలో ఖాళీలను బట్టి నియమించాలనే నిబంధన అటంకంగా ఉందన్నారు. సంవత్సరాల తరబడి ఆ కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉద్యోగాలు రావట్లేదనీ, దాదాపు 1,100 మంది కుంటుంబాలు ఈ విధంగా ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. ఇటీవల కొందర్ని విధుల్లోకి తీసుకున్నా, వారిని రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా, కాంట్రాక్ట్ పద్ధతిలో కన్సాలిడేటెడ్ వేతనంతో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. వారందరినీ తక్షణం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 160 మంది సెక్యూరిటీ గార్డులుగా నియమితులైన వారికి తార్నక ఆస్పత్రిలో వైద్యం, బస్‌పాస్ సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. బ్రెడ్‌విన్నర్ స్కీంలో కాంట్రాక్ట్ పద్ధతిలో రిక్రూట్ అయిన వారికి రెగ్యులర్ ఉద్యోగులతో వర్తించే అన్ని ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బోయినపల్లి గోపాల్‌రావుకు నివాళి

నవతెలంగాణ వరంగల్ రీజియన్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆయన కుమారుడు



నవతెలంగాణ-వరంగల్

'నవతెలంగాణ' వరంగల్ రీజనల్ మేనేజర్ బోయినపల్లి దేవేందర్ రావు తండ్రి బోయినపల్లి గోపాల్‌రావు ఇటీవల మృతిచెందిన విషయం విధితమే. కాగా, వారి స్వగ్రామమైన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి తిమ్మాపూర్‌లో శుక్రవారం జరిగిన ఆయన దశదినకర్మకు 'నవ తెలంగాణ' సీజీఎం పి.ప్రభాకర్, మఫిషల్ ఇన్‌చార్జి వేణుమాధవ్, అడ్వర్టయిజింగ్ జనరల్ మేనేజర్ వెంకటేష్, జనరల్ మేనేజర్లు భరత్, శశి కుమార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వాసుదేవ్ హాజరై గోపాల్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో 'నవతెలంగాణ' బుక్ హౌస్ మేనేజర్ బండారి బాబు, వరంగల్ జిల్లా రిపోర్టర్లు ఈర్ల సురేందర్, బవండ్లపల్లి కిరణ్ కుమార్, వెల్ది రాజేందర్, కందుకూరి సంజీవ్, సిబ్బంది శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సర్వేలో చేతివాటం!


సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్

- 650 మంది లబ్దిదారుల్లో 72 మందికే పాసు పుస్తకాలు
- రూ.రెండు వేల నుంచి మూడు వేలు వసూలు

నవతెలంగాణ-పెద్దవూర

నల్లగొండ జిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాల జారీకి సంబంధించిన సర్వేల్లో కొంతమంది అధికారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. గతేడాది నవంబర్‌లో పోడు భూముల సాగుదారుల నుంచి అర్జీలను స్వీకరించిన అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. ఆక్రమణకు తావు లేకుండా సాంకేతికతను వినియోగించి గిస్ట్ భూముల కొలతలు తీసుకుంటూ అర్జీదారుల ఫోటోలను చిత్రీకరించారు. ఇప్పుడు పట్టాదారు పాసుపుస్త కాలు జారీ చేస్తున్నారు. ఇదే క్రమంలో ఒకరిద్దరు అధి కారులు లబ్దిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. తిరుమలగిరి సాగర్ మండలం నాగార్జునపేటలో పోడుభూముల సర్వేలో ఆ గ్రామ కార్యదర్శి ఒక్కొక్కరి నుంచి భూమిని బట్టి రూ.2వేల నుంచి 3 వేలు.. 72 మంది నుంచి లక్ష రూపాయలకుపైగా తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామంలో 650 మంది దరఖాస్తు చేసుకోగా.. 72 మందికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేశారని గ్రామస్తులు తెలిపారు.సర్పంచ్ లేకుండానే సర్పంచ్ ఉన్నట్టు గ్రామసభ తీర్మానం చేసి సర్పంచ్ సంత కాన్ని ఫోర్జరీ చేశారు. కార్యదర్శితో ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై ఇష్టం వచ్చినట్టు డబ్బులు దండుకుంటూ సమీప బంధువులకు మాత్రమే పట్టాలు ఇప్పించా రంటూ గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అసలైన లబ్దిదారులకు పాస్ పుస్త కాలు ఇప్పించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పలువురు గ్రామస్తులు తెలిపారు.

40 ఏండ్లుగా కబ్జాలో ఉంటున్నాం



మానాన్న, మా తాతలు 40 ఏండ్ల నుంచి కబ్జాలో ఉన్నారు. మాకు పాసు పుస్తకం రాలేదు. 600 మందికి పైగా లబ్దిదారులను ఎంపిక చేస్తే 72 మందికే పాస్ బుక్కులు ఇచ్చారు. సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసి కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ వారి దగ్గర బంధు వులకు, డబ్బులు ఇచ్చిన వారికి పుస్తకాలు ఇచ్చారు. మేమంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- నేనావత్ శంకర్ (నాగార్జునపేట)

సర్వే చేసి పాసు పుస్తకాలు ఇవ్వలేదు



మాకు మూడెకరాల భూమి వుంది. అధికారులు సర్వే చేశారు. కార్యదర్శికి భూమికి సంబంధం చిన కాగితాలు, జీరాక్స్‌లు ఇచ్చాం. మీకు రాస్తాం.. వెళ్లిపొమ్మని చెప్పారు. కానీ, డబ్బులు ఇచ్చిన వారికే రాసి పంపారు. మేము డబ్బులు ఇవ్వలేదు. మాకు పాసు పుస్తకం రాలేదు.

- అంగోతు సాలి(నాగార్జునపేట)

కేటీఆర్ హామీలన్నీ అమలు చేయాలి

- 10న కలెక్టరేట్ల ఎదుట ధర్నా: తెలంగాణ కల్లు గీత కార్మిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-జనగామ

గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు వారం రోజుల్లో అమలు చేయకపోతే.. జులై 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట వేలాదిమంది గీత కార్మికులతో మహా ధర్నా చేపడతామని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 29, 30 తేదీల్లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర చైతన్య సభలో వారు మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సొసైటీలో సభ్యులందరికీ బైకులు,సేఫ్టీ మోకులు అందించాలని డిమాండ్ చేశారు. కుల వృత్తిదారులకు ప్రభుత్వం ఇస్తామన్న లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేయాలని, సొసైటీలకు భూమి, కల్లుకు మార్కెట్, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు ప్రభుత్వం ఐదువేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ సభలో తీర్మానించినట్టు తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కారం చేయని పక్షంలో 10వ తేదీన వేలాదిమంది గీత కార్మికులు ఆందోళనలో పాల్గొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగానీ సీత రాములు, యస్.రమేష్ గౌడ్, బూడిద గోపి, అరుణ్, అంజయ్య, ఉపాధ్యక్షులు గోవింద్, వెంకట నరసయ్య, గౌని వెంకన్న, బల్నే వెంకట మల్లయ్య, బొలగాని జయ రాములు, సురుగు రాజేష్, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సోషల్ మీడియా రాష్ట్ర, జిల్లా నాయకత్వం, కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.

రాజస్థాన్ వస్త్ర వ్యాపారి పరార్..?

- దాదాపు ఏడు కోట్లతో ఉడాయింపు

నవతెలంగాణ-ఆర్మూర్

నమ్మకంగా ఉంటూ.. ఏకంగా సుమారు ఏడు కోట్ల రూపాయలతో ఓ రాజస్థాన్ వ్యాపారి పరార్ అయ్యాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో వెలుగుజూసింది. దీనికి సంబంధించిన వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే, డబ్బు తీసుకున్న వ్యక్తి పేరు చెప్పడానికి బాధితులు నిరాకరిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్మూర్ పట్టణంలో ఏడేండ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి.. వ్యాపారం కోసం ప్రముఖుల నుంచి, వడ్డీ వ్యాపారస్తుల నుంచి, ఫైనాన్స్‌ల వారి వద్ద అప్పులు తీసుకుంటూ తిరిగి చెల్లిస్తుండేవాడు. నమ్మకంగా ఉండటంతో అతనికి వారంతా పెద్దమొత్తంలో అప్పులు ఇస్తుండేవారు. ఈ నేపథ్యంలో ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి సుమారు ఏడు కోట్ల రూపాయలకుపైగా తీసుకున్న వ్యాపారి రాత్రికిరాత్రే పరారైనట్టు సమాచారం. నెల రోజులైనా షాప్ తీయకపోగా, ఇంటికి సైతం తాళం వేసి ఉంది. ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో తాము మోసపోయినట్టు పలువురు బాధితులు వాపోతున్నారు. కానీ, బాధిత వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం కొసమెరుపు.

పరీక్షలో విద్యార్థికి సమాధానాలు రాసిచ్చిన అధికారిపై కేసు

- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో ఘటన

నవతెలంగాణ-బేగంపేట

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థికి సమాధానాలు రాసిచ్చిన అధికారిపై ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సార్ నగర్‌లోని అమోఘ జూనియర్ కాలేజీలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా.. జూన్ 15న గణితం-బీ పరీక్ష జరిగింది. ఆ సమయంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ అంజనేయులు ఓ విద్యార్థికి పెన్సిల్‌తో సమాధానాలు రాసి అందించారు. ఇది గుర్తించిన పరీక్షా కేంద్రం అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావు పరీక్షల హైపవర్ కమిటీకి ఫిర్యాదు చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.ఒడ్డెన్న ఫిర్యాదు మేరకు పోలీసులు అంజనేయులుపై కేసు నమోదు చేశారు.

చెప్పిందొకటి..చేస్తున్నదొకటి !

- శ్రీరాంసాగర్ రెండోదశపై శీతకన్ను
- 4.40 లక్షల ఎకరాల
- ఆయకట్టు స్థీరీకరణ పెండింగ్
- 1984 నుంచీ నిర్లక్ష్యమే



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తున్న గులాబీ సర్కారు ఉమ్మడి రాష్ట్రంలోని పథకాలపై శీతకన్నేసింది. ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదు. ఆ ప్రాజెక్టుల పట్ల తీవ్ర అలసత్వం, నిర్లక్ష్యం కనిపిస్తున్నది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో 4.40 లక్షల ఎకరాలకు సాగునీరందించే శ్రీరాంసాగర్(ఎస్ఆర్ఎస్పీ) ప్రాజెక్టు రెండో దశ పనులు ఆ కోవలోకే వస్తాయి. రాష్ట్రంలో 18 భారీ, 31 మధ్యతరహా ప్రాజెక్టులున్నాయి. కాగా మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తిచేసే అవకాశం ఉన్నా, ఆతరహా కార్యాచరణే లేదు.

మూడు జిల్లాల్లో స్థీరీకరణ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ పనులు పూర్తిచేస్తే ఖమ్మం జిల్లాలోని 68,914 ఎకరాలు, వరంగల్‌లోని 1,13,575 ఎకరాలు, నల్లగొండ జిల్లాలోని 2,57,508 ఎకరాల ఆయకట్టు స్థీరీకరణ జరుగుతుంది. తద్వారా ఆ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులు పూర్తయినా, నీటిని పంపిణీ చేసే ఉపకాలువల పనులు ఇంకా ఆలస్యమవుతూనే ఉన్నాయి. ఈ రెండో దశకు 40 టీఎంసీల నీరు అవసరం. ఈ నీరు శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ద్వారా దిగువకు రావడం గత దశాబ్దకాలంలో సాధ్యం కాలేదు. కాకతీయ కాలువకు 234వ కిలోమీటర్ వరకే నీరు వస్తున్నది. మొదటి దశలోని 234-284 కిలోమీటర్లకు కూడా నీరందడంలేదు. పై 50 కిలోమీటర్లల్లో మోరంచ, తీగలవేని, వెన్నవరం కాలువలకు కూడా నీరు రావడం లేదు. 284 నుంచి 343 కిలోమీటర్ల వరకు గత రెండు దశాబ్దాలుగా నీళ్లు రాలేదు. కాళేశ్వరం ద్వారా స్థీరీకరిస్తామని చెప్పినా, అమలుకాలేదు. కాలువలు పూర్తయినా ఇప్పుడవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాకతీయ కాలువ మొదటి దశ 50 కిలోమీటర్లతోపాటు రెండో దశకు 70 టీఎంసీల నీరు కావాల్సి ఉంటుంది. ఈ నీటిని దేవాదుల లిఫ్ట్ ద్వారా గానీ, లేదా కాంతాలపల్లి ఎత్తిపోతల ద్వారాగానీ సరఫరా చేయడానికి వీలుంది. ఇదొక్కటే మార్గం.

మూడుసార్లు శంకుస్థాపనలు

ఈ ప్రాజెక్టు రెండోదశకు మూడుసార్లు శంకుస్థాపనలు జరిగాయి. అప్పటి ప్రధాని కి.శే ఇందిరాగాంధీతోపాటు అప్పటి ముఖ్యమంత్రి కీ.శే ఎన్టీఆర్‌తో కలిసి 1984, మే నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కాగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం 1996, మార్చి ఆరున ఒకసారి, 2002 మే తొమ్మిదిన రెండోసారి శంకుస్థాపన చేశారు. తొలుత ఈ ప్రాజెక్టు వ్యయం సాగునీటి పారుదల, ఆయకట్టు శాఖ రూ. 1258 కోట్లుగా నిర్ధారించింది. ఆ తర్వాత పెరుగుతూ వస్తున్నన్నది. ప్రధాన ఉపకాలువలు డీబీఎం 30, డీబీఎం 40, డీబీఎం 48 కాలువలు తవ్వినా లైనింగ్ చేయలేదు. చేసినవీ కూలిపోయాయి. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయి నిధులు కాజేశారంటూ దాదాపు 12 మంది అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)పై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నారు.

1984 నుంచీ నిర్లక్ష్యమే

ఖమ్మం జిల్లా 68,914 ఎకరాలకు నీరిచ్చేందుకు పాలేరు నుంచి భక్తరామదాసు లిఫ్ట్‌పెట్టారు. పాలేరు ఆయకట్టుకు కృష్ణానదీ నుంచి ఇస్తున్నారు. కానీ, భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలోని గోదావరి ఆయకట్టుకు మళ్లించారు. గోదావరిలో సరిపోను నీళ్లు ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా ఇచ్చే అవకాశం ఉంది. కృష్ణాకు లింకుపెట్టి ఖమ్మంలో పబ్బంగడిపారు. రెండోదశకు ఇప్పటికీ నీటి కేటాయింపుల గ్యారంటీ లేదు. కరీంనగర్, వరంగల్ సరిహద్దు వరకు మొదటిదశ శ్రీరాంసాగర్ నీళ్లు వస్తున్నాయి. కిందకు వదలడంతో వరంగల్ నగరానికి తాగునీటిని అందిస్తున్నారు. వడ్డేపల్లి, భద్రకాళి చెరువును నింపుతున్నారు. దేవాదుల ప్రాజెక్టుతో ధర్మసాగర్ చెరువు నీటిసమస్య తీరుతున్నది. కానీ రెండో దశకు నీళ్లివ్వడంపై 1984 నుంచి దృష్టిపెట్టలేదు.

నీటి గ్యారంటీ ఏదీ ?

శ్రీరాంసాగర్ రెండో దశకు నీటి గ్యారంటీ లేదు. పంపిణీచేసే కాలువల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అదనపు నిధులు కావాల్సి ఉంది. మరో రూ. 1000 నుంచి రూ. 1200 కోట్లు అవసరం. ప్రస్తుత ప్రభుత్వం వీటిని కేటాయించాల్సి ఉంది. అది పూర్తిచేయకుండానే వరదనీటితో నీళ్లు ఇస్తామని చెప్పడం సరికాదని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. మొదటి దశ ప్రాంతంలో రెండో పంట నీళ్లను ఆపి, శ్రీరాంసాగర్ రెండో దశ ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనే డిమాండ్ ముందుకొచ్చింది. గత ప్రభుత్వాలు గోదావరి నదీపై ఉన్న కాంతాలపల్లి, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా కనెక్షన్లు ఇచ్చి కాకతీయ కాలువకు నీళ్లు ఇస్తామన్నా చెప్పి, దాన్నీ పట్టించుకోలేదు. ఇప్పుడు కాంతాలపల్లిని ఎత్తేసి తుపాకులగూడెం చేపట్టారు. దీంతోనైనా కూడా శ్రీరాంసాగర్ రెండో దశ స్థీరీకరణకు గోదావరి నీళ్లను లిఫ్ట్ ద్వారా ఇస్తామన్న సర్కారు హామీనీ నెరవేర్చాలనే డిమాండ్ వస్తున్నది.

పేదలను కోటీశ్వరులను చేస్తాం

- విజన్ 2035 దిశగా ముందుకు సాగాలి
- భవిష్యత్తు యువతరానిదే
- టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

పేదలను కోటీశ్వరులను చేయడమే తెలుగుదేశం లక్ష్యమని ఆపార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు విజన్ 2020 కాదనీ, విజన్ 2035 దిశగా ముందుకు సాగాలని చెప్పారు. భవిష్యత్తు అంతా యువతరానిదేనని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జహీరాబాద్ పార్లమెంట్, వరంగల్ తూర్పు, నిర్మల్ జిల్లాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ తెలుగుదేశం పుట్టిన నాటి నుంచి పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కషి చేసిన పార్టీ టీడీపీ అని అన్నారు. నాడు ఎన్టీఆర్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, కోట్లాది మంది ప్రజల మన్నలను పొందారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విజన్ 2020 తో ఐటి హబ్ లు ఏర్పాటు చేసి లక్షల మంది విద్యార్థుల కు ఐటి రంగంలో ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. నేటి యువతకు మద్యం కాదు, మంచి భవష్యత్తు ఇచ్చే ప్రభుత్వాలు రావాలన్నారు. అది తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కిలి ఐలయ్య, జహీరాబాద్ పార్లమెంట్, వరంగల్ తూర్పు, నిర్మల్ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

అరుణాచలం బస్‌కు ఫుల్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయాలనుకునే యాత్రీకుల కోసం తొలిసారిగా ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీకి అనూహ్య స్పందన వస్తున్నది. కేవలం ఒక్క బస్సును మాత్రమే నడపాలని తొలుత నిర్ణయించిన ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణీకుల రద్దీ పెరగడంతో ఈ సంఖ్యను 30కి పెంచింది. వీటన్నింటిలోనూ సీట్లు భర్తీ అయ్యాయని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా మరికొన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రత్యేక బస్సులన్నీ జులై 1, 2 తేదీల్లో హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అరుణాచలానికి బయలుదేరుతాయని తెలిపారు. అరుణాచల టూర్ ప్యాకేజీ కోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. జులై 3న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి టీఎస్ఆర్టీసీ రెండు రోజుల టూర్ ప్యాకేజీని ప్రకటించిన విషయం తెలిసిందే.

గొల్లకురుమల సమస్యల పరిష్కారం కోసం..

- ఈనెల 12న పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ముట్టడి .. జీఎంపీఎస్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొల్లకురుమల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) పిలుపునిచ్చింది. గొర్రెలు ఇస్తామంటూ గొల్లకురుమలతో డీడీలు కట్టించి, గొర్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించింది. గొర్లు ఇవ్వకుండా ఆలస్యం చేయడంతో వారంతా అప్పులపాలయ్యారని పేర్కొంది. శుక్రవారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ జూన్ 9వ తేదీన రెండో విడుత గొర్రెల పంపిణీ ప్రారంభించినట్టు రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 1500 మందికి మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకుండా, కనీస ప్రణాళిక లేకుండా అందరిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇచ్చిన గొర్రెల్లో ముసలి గొర్లు, చిన్నపిల్లలనే ఎక్కువ చోట్ల ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇంకా మిగిలిన 3.5లక్షల మందికి కావాల్సిన రూ. 6వేల కోట్ల నిధుల్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీతో గొర్లకాపరులు తమకు నచ్చినచోట ఇష్టమొచ్చిన గొర్లు కొనుక్కునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే దశలవారిగా జిల్లా అధికారులకు,శాసన సభ్యులకు మెమోరాండాలు ఇచ్చామని గుర్తు చేశారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు అవిశెట్టి శంకరయ్య, బొల్లం అశోక్, మద్దెపురం రాజు, తుషాకుల లింగయ్య, అమీర్‌పేట్ మల్లేష్, కాల్వ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజం.. మానవత్వం

- ఎనిమిదేండ్లుగా హెల్త్ క్యాంపుల నిర్వహణ
- ట్రస్టుల సహకారంతో నిరుపేదలకు వైద్యం
- రూ.100కే నెలకు సరిపడా మందులు
- వేలాది మందికి లభిస్తున్న ఉచిత వైద్య సేవలు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

విద్యా వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని.. ప్రతి ఒక్కరికీ ఇవి ఉచితంగా దక్కాలని మార్క్సిస్టులు అనేక ఏండ్లుగా పోరాటాలు చేస్తున్నారు. కొద్దిమంది నిరుపేదలకైనా మేలు చేయాలనే సంకల్పంతో ఖమ్మం జిల్లాలో ఎనిమిదేండ్ల నుంచి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. మార్క్సిస్టు యోధులు యలమంచిలి రాధాకృష్ణమూర్తి, బోడేపూడి వెంకటేశ్వరరావు, తమ్మినేని సుబ్బయ్యల పేర్లతో జిల్లాలోని ఖమ్మం టూటౌన్, త్రీటౌన్, వైరా, వరంగల్ ఎక్స్ రోడ్, నేలకొండపల్లిలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలకు వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు తరలివస్తున్నారు. ప్రతినెలా వారానికి ఓ చోట ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.100కే రూ.వెయ్యి విలువ చేసే దీర్ఘకాలిక వ్యాధుల మందులను అందిస్తున్నారు. కంటి పరీక్షలు సైతం నిరంతరం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర చోట్ల కూడా నేతల పేర్లతో వైద్యశిబిరాలు నడుస్తున్నాయి. శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

డాక్టర్ల సహకారం..

ఖమ్మంలో పలువురు డాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు ఈ హెల్త్ క్యాంప్‌ల నిర్వహణకు సహకరిస్తున్నారు. నిరంతరాయంగా ఈ హెల్త్ క్యాంప్‌లను పర్యవేక్షిస్తున్న డాక్టర్లలో చీకటి భారవి, యలమంచిలి రవీంద్రనాథ్, రామకోటేశ్వరరావు, నాగమణి, రమాదేవి, కొల్లు అనుదీప్, గెట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు, ఏ ప్రవీణ్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, కేవీ.భాస్కర్‌రావుతో పాటు పలువురు ఇతర డాక్టర్లు కూడా వస్తుంటారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి స్పెషలిస్టు డాక్టర్లను సైతం రప్పించి వైద్య పరీక్షలు చేయిస్తున్నారు.

సుందరయ్య స్ఫూర్తితో వైద్యశిబిరాలు..



ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండాలని పోరాటాలు చేస్తున్నాం. అయినప్పటికీ ప్రభుత్వ వైద్యసేవలు మెరుగుపడట్లేదు. పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మార్క్సిస్టు పార్టీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. నెలకు సుమారు రూ.లక్షకు పైగా ఖర్చు వస్తున్నా రిటైర్డ్ ఉద్యోగులు, వామపక్ష అభిమానులు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, అన్నింటికీ మించి వామపక్ష భావజాలం ఉన్న డాక్టర్ల సహకారంతో ఈ శిబిరాలు కొనసాగుతున్నాయి. రూ.3వేల విలువ చేసే షుగర్, బీపీ మందులను కేవలం రూ.100కు ఇవ్వడంతో పాటు అల్పాహార సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. స్పెషలిస్టు డాక్టర్లను పిలిపించి వేల విలువ చేసే టెస్టులు ఉచితంగా చేయిస్తున్నాం. మా పోరాట ఫలితంగా ఖమ్మానికి మెడికల్ కళాశాల మంజూరైంది. నిమ్స్ తరహాలో దీన్ని అభివృద్ధి చేస్తానని గతంలో కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం. ఈ హెల్త్ క్యాంపుల నిర్వహణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు.

- నున్నా నాగేశ్వరరావు,
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

డిజిటల్ బాల్యం అభ్యంతరకరం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సాంకేతికత పేరుతో పిల్లలు డిజిటలైజేషన్‌కు అలవాటుపడటం వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దీనిపై ఉషారామన్, సుమన కస్తూరి రాసిన 'చైల్డ్‌స్కేప్-మీడియా స్కేప్' పుస్తకం అనేక సందేహాలకు సమాధానాలు ఇచ్చిందన్నారు. శుక్రవారంనాడిక్కడి విద్యారణ్య హైస్కూల్‌లో ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రచయితలతో పాటు హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్ పవరాల, యునిసెఫ్ బాలల హక్కుల మాజీ న్యాయవాది సుధామురళి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి, విశ్లేషించారు. పిల్లల బాల్యం డిజిటలైజ్‌పై అనేవ ప్రపంచ పరిశోధనలు జరిగాయమన్నారు. దీనిపై భిన్నమైన వైఖరులు వెల్లడయ్యాయనీ, భవిష్యత్ తరాల పోటీ ప్రపంచంలో డిజిటలైజేషన్ అవసరమని కొందరు పేర్కొంటే, మరికొందరు దీనివల్ల బాల్యం అనేక సమస్యల్ని ఎదుర్కొంటుందని తెలిపారన్నారు. పిల్లలు మీడియా ల్యాండ్‌స్కేప్‌లో అనేక రకాల థీమ్‌లను అన్వేషిస్తూ డిజిటల్‌గా ఎదగడం అంటే ఏమిటో ఈ పుస్తకంలో వివరించారని తెలిపారు. పిల్లల్లో డిజిటల్ మీడియా అక్షరాస్యత, కొత్త మీడియా పద్ధతులు, మధ్యవర్తిత్వ బాల్యం, హక్కుల విభజన, సోషల్ మీడియా వినియోగదారులు, నిర్మాతలుగా పిల్లలు ఎదుగుతున్నారనే 12 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయని చెప్పారు. పిల్లల వినోదం, విశ్రాంతి అభ్యాసం ప్రధానమని పుస్తకంలో వివరించారన్నారు. మీడియా, కమ్యూనికేషన్ స్టడీస్, కల్చరల్ స్టడీస్, సైకాలజీ, జర్నలిజం విద్యార్థులకు ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిక్షణా సంస్థలు, బాలల హక్కుల స్వచ్ఛంద సంస్థలు ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాలన్నారు. కార్యక్రమంలో ఓరియంట్ బ్లాక్‌స్వాన్ ప్రచురణకర్త ప్రతినిధి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీ-డయాగ్నోస్టిక్స్‌లో నేటి నుంచి 134 టెస్టులు

- ఇప్పటివరకు 57 టెస్టులు అందుబాటులో
- నూతనంగా 8 జిల్లాల్లో పాథాలజీ, 16 జిల్లాల్లో రేడియాలజీ హబ్‌లు ఏర్పాటు
- రంగారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించనున్న హరీశ్‌రావు
- టీ డయాగ్నోస్టిక్స్ ద్వారా ఇప్పటివరకు 10 కోట్లకుపైగా టెస్టులు పూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో టీ-డయాగ్నోస్టిక్స్ సేవలు మరింత విస్తరించనున్నాయి. ఇప్పటివరకు టీ-డయాగ్నోస్టిక్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా 57 రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. టెస్టుల సంఖ్యను 134కు పెంచారు. దీంతోపాటు కొత్తగా 8 జిల్లాల్లో పాథాలజీ ల్యాబులు, 16 జిల్లాల్లో రేడియాలజీ ల్యాబులు సేవలందించేందుకు సిద్ధమయ్యాయి. వీటిని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు శనివారం ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని జిల్లా దవాఖాన నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. కొత్తగా అందుబాటులోకి రానున్న టెస్టుల్లో ప్రయివేటు ల్యాబుల్లో రూ.500 నుంచి రూ.10వేల వరకు ఖరీదు చేసే పరీక్షలు కూడా ఉన్నాయి. 2018 జనవరి నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీ నుంచి అన్ని స్థాయిల దవాఖానల్లో ఉచిత పరీక్షలు ప్రారంభమయ్యాయి. 57 రకాల పాథాలజీ (రక్త, మూత్ర) పరీక్షలతో పాటు, ఎక్స్‌రే, యూఎస్‌జీ, ఈసీజీ, 2డీ ఈకో, మామోగ్రామ్ వంటి రేడియాలజీ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయివేటులో ఖర్చుల భారం, ఆ భారానికి భయపడి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోకుండా రోగం ముదిరే వరకు తెచ్చుకోవడం వంటి సమస్యలు తప్పాయి. దీంతో పాటు 24 గంటల్లోనే కచ్చితమైన ఫలితాలు వస్తుండటంతో వైద్యులకు చికిత్స అందించడం సులువుగా మారింది.

10 కోట్లకు పైగా టెస్టులు పూర్తి..

హైదరాబాద్‌లో సెంట్రల్ ల్యాబ్‌తోపాటు 19 మినీ హబ్‌లు, 435 స్పోక్స్‌కు (అనుసంధానిత కేంద్రాలు) విస్తరించింది. మరో 19 జిల్లా కేంద్రాల్లో హబ్‌లు ఉన్నాయి. మిగతా 13 జిల్లాల్లో హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం గతేడాది అనుమతించిన సంగతి తెలిసిందే. వీటిలో 8 హబ్‌ల పనులు పూర్తయ్యాయి. రంగారెడ్డి (కొండాపూర్), సూర్యాపేట, వనపర్తి, వరంగల్ (నర్సంపేట), యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

హైదరాబాద్‌లోని సెంట్రల్ ల్యాబ్‌లో నాణ్యత ప్రమాణాలు అత్యుత్తమంగా పాటిస్తున్నారంటూ ఇప్పటికే ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ ఇచ్చిన విషయం విదితమే. 13 జిల్లా ల్యాబులు ఎన్ఏబీఎల్ ప్రాథమిక అక్రిడిటేషన్ సాధించాయి. మరో ఆరు ల్యాబుల తనిఖీ కొనసాగుతున్నది. ఇప్పటివరకు టీ డయాగ్నోస్టిక్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 57.68 లక్షల మందికి 10 కోట్లకు పైగా టెస్టులు నిర్వహించారు. 57.68 లక్షల మంది రోగులు ప్రయోజనం పొందారు.

జిల్లాకు ఒక రేడియాలజీ హబ్

రేడియాలజీ పరీక్షలు మరింత నాణ్యంగా, వేగంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక రేడియాలజీ హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

32 రేడియాలజీ హబ్‌ల ఏర్పాటుకు గతేడాది అనుమతించింది. ఇందులో ఇప్పటివరకు 13 హబ్‌ల పనులు పూర్తయ్యాయి. హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ (నర్సంపేట), వనపర్తి, రంగారెడ్డి, పెద్దపల్లి, కామారెడ్డి, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజిగిరి (హైదరాబాద్), నారాయణపేట జిల్లాల్లో రేడియాలజీ హబ్‌లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఆటలతోనే ఆరోగ్యం

అదే మెడికవర్ హాస్పిటల్స్ కర్తవ్యం



నవతెలంగాణ- హైదరాబాద్

ఆటలతోనే ఆరోగ్యమని, అదే మెడికవర్ హాస్పిటల్స్ లక్ష్యమని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ వివిధ విభాగాల వైద్యులు, ఎన్‌సీసీ గార్డెనియా మెంబర్స్ మధ్య శుక్రవారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. అనంతరం డాక్టర్ మిథిల్ ఘుసే మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆటలతో మెదడు ఆరోగ్యానికి ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. పిల్లలకు, పెద్దలకు ఆరోగ్యకరమైన అభివద్ధికి ఆటలు అవసరమన్నారు. పిల్లలు వాళ్ళకి తెలియని వాటిని కూడా ఆచరించడానికి, సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి, ఉత్తమ వ్యూహాలను రూపొందించడానికి క్రీడలు అవసరమన్నారు. ఆటలు అవుట్‌డోర్ యాక్టివిటీస్, ఫిజికల్ స్టామినా, ఫిట్‌నెస్‌ని పెంచడానికి సహాయపడతాయన్నారు. ఆరుబయట ఆటలు కండరాలు, ఎముకలను బలోపేతం చేయడం, రోగనిరోధక శక్తిని పెంపొందించడంతోపాటు వివిధ తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయని చెప్పారు. ఈ మ్యాచ్‌లో మెడికవర్ హాస్పిటల్స్ కెప్టెన్ వీఎల్. కేశవరెడ్డి, ఎన్‌సీసీ కెప్టెన్ మోజెస్, మెడికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికష్ణ, డాక్టర్ సతీష్‌కుమార్ కైలాసం, డాక్టర్ మిథిల్‌ఘుసే. మెడికవర్ నుంచి చాలా మంది ఆడారు.

పీడీ యాక్ట్ సబబే

నవతెలంగాణ-హైదరాబాద్

ఒక కేసులో నిందితుడు జైలు నుంచి విడుదలైన తర్వాత నేరాలకు పాల్పడితే అతనిపై పీడీ యాక్ట్ పెట్టి పోలీసులు నిర్బంధంలోకి తీసుకోవచ్చని హైకోర్టు తీర్పు చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన సల్మాన్ ఖాన్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించడాన్ని సవాల్ చేసిన కేసును కొట్టేస్తూ జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు వెలురించింది. హైదరాబాద్ యూత్ కరేజ్ పేరిట ఎన్‌జీవో ఏర్పాటు చేసి నేరాలకు పాల్పడ్డారని పోలీసులు సుమారు పది కేసులు నమోదు చేశారు. అందులో బాలలపై అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసు కూడా ఉంది. ఈ క్రమంలో పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఒకసారి పీడీ యాక్ట్‌ను హైకోర్టు కొట్టేస్తే మళ్లీ పీడీ యాక్ట్ ప్రయోగించడం అన్యాయమంటూ బేగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది.

పురపాలక శాఖ కమిషనర్ సత్యనారాయణ పదవీవిరమణ

- ఘనంగా సన్మానించిన అర్వింద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పురపాలక, పట్టణాభివద్ధి శాఖ సంచాలకులు డాక్టర్ ఎన్.సత్యనారాయణ శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. పురపాలక విభాగంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో విశేష సేవలు అందించారని, కరోనా విపత్కర పరిస్థితులలో కూడా నిర్విరామంగా కషి చేశారని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా నియమితులైన సందర్భంగా ఆయన్ను కూడా అర్వింద్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంల పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణపై వివరణ ఇవ్వండి

నవతెలంగాణ-హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామం నుంచి సామాజిక బహిష్కరణకు కారణమేంటనే కేసులో గ్రామ కమిటీ అధ్యక్షుడు పీర్ల సురేష్‌కుమార్ జులై 3న వ్యక్తిగంగా విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 300 ముదిరాజ్ కుటుంబాలను మార్చి 20న బహిష్కరిస్తూ వీడీసీ తీర్మానాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. ఇప్పటికీ గ్రామ బహిష్కరణ చర్యలు తీసుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇసుక అమ్మాలన్నా, కొనాలన్నా వీడీసీ అనుమతి తీసుకోవాలన్న నిబంధనను, గుడి వద్ద అక్రమంగా ఇసుక నిల్వ చేయడాన్ని, అక్కడ మద్యం అమ్మకాలు నిర్వహించడాన్ని వ్యతిరేకించిన పాపానికి వీడీసీ గ్రామ బహిష్కరణ చేసిందని పిటిషన్ తరుపు లాయర్ వాదన. గ్రామ బహిష్కరణ జరగలేదని అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఆ మేరకు గ్రామంలో టామ్ టామ్ చేసి దానిని వీడియో తీసి తదుపరి విచారణ సమయంలో నివేదించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది.

షకీల్ అహ్మద్ ఉద్యోగ విరమణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల విభాగం సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ షకీల్ అహ్మద్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. 1983 నుండి వివిధ హెూదాల్లో 40 ఏండ్లపాటు ఆయన రైల్వేకు సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్), రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీలో డిప్యుటేషన్‌పై పనిచేశారు. ఈ సందర్భంగా షకీల్ అహ్మద్ దంపతులను రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల విభాగం అధికారులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సీహెచ్ రాకేష్, బీ అనిల్‌కుమార్, ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో రెచ్చిపోయిన గోగూండాలు

- ఆవులను దొంగతనం చేస్తున్నాడని వ్యక్తిపై మూకదాడి
- గాయాలతో బాధితుడి మృతి

అగర్తల : బీజేపీ పాలనలోని త్రిపురలో గోగూండాలు మరోసారి రెచ్చిపోయారు. ఆవులను దొంగతనం చేస్తున్నాడని ఆరోపిస్తూ 41 ఏండ్ల ఒక వ్యక్తిపై మూకదాడికి పాల్పడ్డారు. ఏకంగా విద్యుత్ స్థంభానికి కట్టేసి వెదురు కర్రలతో దారుణంగా కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ దారుణం పశ్చిమ త్రిపుర జిల్లాలో జరిగింది. ఈ విషయాన్ని శుక్రవారం పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈస్ట్ చంద్రపూర్ గ్రామానికి చెందిన 41 ఏళ్ల నందు సర్కార్‌ను ఆవులు దొంగతనం చేస్తున్నాడని ఆరోపిస్తూ గురువారం ఉదయం 8 గంటల సమయంలో గోగూండాలు బలవంతంగా ఇంటి నుంచి లాక్కొని వచ్చారు. పశువులా ఈడ్చుకుని తీసుకుని వెళ్లి కరెంటు స్థంభానికి కట్టివేశారు. వెదురు కర్రలతో ఇష్టం వచ్చినట్లు దారుణంగా కొట్టారు. కొద్ది సేపటి తరువాత విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. తీవ్ర గాయాలతో ఉన్న నందు సర్కార్‌ను సమీపంలోని రాణిబజార్ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ నందూ మృతి చెందాడు.

కుటుంబ వ్యవస్థకు మూలాధారం వివాహం. అందుకే పెండ్లంటే నూరేళ్ళ పంట అంటారు పెద్దలు. ప్రతి భార్యా తన భర్త తనకు మాత్రమే సొంతం అనుకుంటుంది. భర్త కూడా అంతే. అయితే నేడు వివాహేతర సంబంధాలు ఎక్కువయ్యాయి. దీనికి అనేక కారణాలు ఉంటున్నాయి. దీని వల్ల ఎన్నో జంటలు విడిపోవల్సిన పరిస్థితి వస్తుంది. అలాంటి సమస్యతోనే దీపిక ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చింది.



ఆవేశం కాదు ఆలోచన కావాలి

చాలా మంది ఇతరులతో తమ జీవిత భాగస్వామిని పోలుస్తూ ఉంటారు. భాగస్వామి తాను ఆశించినట్లుగా లేకపోతే అసంతృప్తితో ఇతరులతో సంబంధాలు పెట్టుకుంటారు. రహస్యంగా ఉన్నంత వరకు ఎలాంటి సమస్యా ఉండదు. అవి బయట పడ్డప్పుడు కాపురాలు కూలిపోతున్నాయి. అలా దీపిక కూడా తన భర్త నుండి విడాకులు కావాలని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

దీపిక, కుమార్‌లది ప్రేమ వివాహం. కుమార్ వాళ్ళ ఇంట్లో ఒప్పించి దీపికను పెండ్లి చేసుకున్నాడు. దీపిక ఇంట్లో వాళ్ళు పెండ్లయిన మూడేండ్లకు ఒప్పుకున్నారు. ఇద్దరూ ఉద్యోగస్తులే. వారికి ఇద్దరు పిల్లలు. పెండ్లయి 20 ఏండ్లు గడిచిపోయింది. దీపిక చేసే ఉద్యోగరీత్యా నెలలో వారం రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్ళాలి. కుమార్‌కు నైట్ షిఫ్ట్ ఉంటుంది. తన ఆఫీసులో పని చేసే ఓ మహిళతో పరిచయం పెంచుకున్నాడు. మొదట కేవలం ఆఫీసులో మాత్రమే మాట్లాడుకునే వారు. తర్వాత ఫోన్‌లో చాట్ చేయడం మొదలు పెట్టాడు. మరి కొన్ని రోజులకు నైట్ డ్యూటీ అని చెప్పి వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడు. ఆమెను తీసుకుని బయట కూడా తిరిగేవాడు. దీపిక లేనప్పుడు పిల్లలతో ఉండకుండా ఆమె దగ్గరకే వెళ్ళడం మొదలుపెట్టాడు.

పిల్లలకు తోడుగా దీపిక తల్లిని ఇంట్లో పెట్టి వెళ్ళిపోయేవాడు. ఆమె లేకపోతే వాళ్ళను ఇంట్లోనే పెట్టి బయట తాళం వేసి వెళ్ళేవాడు. గత ఐదేండ్ల నుండి ఇలానే జరుగుతుంది. ఇదంతా గమనించిన దీపిక తోటి కోడలు 'నీవు వేరే ఉద్యోగం చూసుకో'. కుమార్ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది' అని దీపికను హెచ్చరించింది. కానీ అప్పట్లో ఆ మాటలు ఆమె పెద్దగా పట్టించుకోలేదు. ఒక రోజు కుమార్ ఆమెతో ఫోన్ మాట్లాడుతుంటే దీపిక విన్నది. భరించలేక పోయింది. భర్త ఇంకో అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడని తట్టుకోలేకపోయింది. దాంతో తోటి కోడలిని వెంటబెట్టుకొని భర్త నుండి విడాకులు ఇప్పించమంటూ ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చింది.

విషయం మొత్తం తెలుసుకున్న లీగల్ సెల్ సభ్యులు కుమార్‌ని పిలిపించి మాట్లాడితే 'నాకు ఎవరితో సంబంధం లేదు. నేను దీపికను ప్రేమించి పెండ్లి చేసుకున్నాను. నాపై అనవసరంగా నిందలు వేస్తున్నారు' అన్నాడు.

'మీరు మాకు నిజం చెబితేనే మీ జీవితం, మీ పిల్లల జీవితం బాగుంటుంది. లేకపోతే మీతో పాటు మీ పిల్లల జీవితం కూడా పాడుచేసిన వారవుతారు. పిల్లలు చిన్న వాళ్ళేం కాదు. మీ ప్రవర్తన ఇలా ఉంటే మీ నుండి వాళ్లేం నేర్చుకుంటారు. మీది ఉమ్మడి కుటుంబం. మీ పిల్లలతో పాటు మీ అన్నయ్య, తమ్ముడి పిల్లలు కూడా ఉన్నారు. నిజం చెబితేనే మేము దీపికతో మాట్లాడే అవకాశం ఉంటుంది. లేకపోతే ఆమె మీకు విడాకులు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది' అన్నారు లీగల్ సెల్ సభ్యులు.

దాంతో అతను కంగారు పడి 'దీపిక ఉద్యోగం చేస్తున్నా నన్ను అర్థం చేసుకోదు. నేను ఉద్యోగంతో పాటుగా బిజినెస్ కూడా చేస్తాను. అందులో నష్టం వచ్చింది. దాంతో దీపిక, వాళ్ళ అమ్మ కలిసి నన్ను తిట్టారు. ఆ సమయంలో మా ఆఫీసులో ఫ్రెండ్ నాకు సపోర్ట్ చేసింది. అప్పుడే కాదు నాకెప్పుడు ఆర్థిక ఇబ్బంది వచ్చినా ఆమె నాకు డబ్బులు ఇస్తుంది. నన్ను బాగా అర్థం చేసుకుంటుంది. పైగా ఆమె భర్త కూడా ఇక్కడ ఉండడు. వేరే రాష్ట్రంలో ఉంటాడు. ఆమె ఒక్కతే పిల్లలను చూసుకుంటుంది. అలాంటి ఆమెకు నేను తోడుగా ఉన్నాను. ఆమె నన్ను చాలా ప్రేమగా చూసుకుంటుంది. దీపిక ఉద్యోగం అంటూ నన్ను, పిల్లలను వదిలేసి వేరే ప్రాంతాలకు వెళుతుంది. ఆమె లేని లోటు ఈమె తీరుస్తుంది. ఇందులో తప్పేముంది' అన్నాడు.

> బిజినెస్‌లో నష్టం వచ్చినప్పుడు నేనే కాదు మా కుటుంబం మొత్తం ఆయనకు సహాయం చేసింది. ఆయన ఉద్యోగం చేసి సంపాదించింది ఆయన అప్పులకే సరిపోతుంది. నాకు వచ్చిన జీతంతోనే పిల్లల్ని చదివించుకుంటున్నాను. నేను ఉద్యోగం చేయకపోతే ఇల్లు గడవడం చాలా కష్టం. అందుకే చేస్తున్నాను. నేను వేరే ప్రాంతాలకు వెళ్ళడం కుమార్‌కి ఇష్టం లేకపోతే మానేస్తానని ముందే చెప్పాను. జాబ్ చేసేందుకు ఆయనే ఒప్పుకున్నాడు. ఇప్పుడు నాకు టైం ఇవ్వడం లేదని అంటున్నాడు.

దానికి దీపిక 'అంతా అబద్ధం మేడమ్, బిజినెస్‌లో నష్టం వచ్చినప్పుడు నేనే కాదు మా కుటుంబం మొత్తం ఆయనకు సహాయం చేసింది. ఆయన ఉద్యోగం చేసి సంపాదించింది ఆయన అప్పులకే సరిపోతుంది. నాకు వచ్చిన జీతంతోనే పిల్లల్ని చదివించుకుంటున్నాను. నేను ఉద్యోగం చేయకపోతే ఇల్లు గడవడం చాలా కష్టం. అందుకే చేస్తున్నాను. నేను వేరే ప్రాంతాలకు వెళ్ళడం కుమార్‌కి ఇష్టం లేకపోతే మానేస్తానని ముందే చెప్పాను. జాబ్ చేసేందుకు ఆయనే ఒప్పుకున్నాడు. ఇప్పుడు నాకు టైం ఇవ్వడం లేదని అంటున్నాడు' అంటూ బాధపడింది.

దాంతో లీగల్ సెల్ సభ్యులు 'కుమార్ మీరు తప్పు చేస్తూ కూడా మీ తప్పేం లేనట్టు మాట్లాడుతున్నారు. తాత్కాలిక సంతృప్తి కోసం మీ కుటుంబాన్నే చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఒకసారి ఆలోచించండి. ఇతరులతో సంబంధాలు పెట్టుకోవడం మంచిది కాదు. అనవసరంగా సమస్యలు పెంచుకుంటున్నారు. రేపు ఆమె భర్త వస్తే ఏం చేస్తారు. అప్పుడు సమస్యలు మరింత ఎక్కువవుతాయి. మిమ్మల్ని మీ ఇంట్లో వాళ్ళంతా బాగా అర్థం చేసుకుంటున్నారు. అందుకే మీ వదినె విషయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా విడాకులు తీసుకుంటానంటున్న దీపికకు నచ్చజెప్పడానికి మా దగ్గరకు తీసుకొచ్చింది. మిమ్మల్ని మార్చి ఇద్దరినీ కలపాలని మీ వదిన కోరుకుంటుంది. ఇలాంటి కుటుంబం ఉండడం మీ అదృష్టం. రేపు ఈ విషయం మీ ఇంట్లో అందరికీ తెలిస్తే మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోండి' అన్నారు.



దీపికతో 'మీరు వెంటనే వేరే ఉద్యోగం చూసుకోండి. కుటుంబం కోసం కష్టపడుతున్నారు. కానీ సంతోషంగా ఉండలేకపోతున్నారు. కాబట్టి ఆలోచించి మీరిద్దరూ ఓ మంచి నిర్ణయం తీసుకోండి. మీ భర్తకు కొంచెం సమయం ఇవ్వండి. అయినా ఆయనలో మార్పు రాకపోతే అప్పుడు విడాకుల గురించి ఆలోచించండి' అని చెప్పి ఇద్దరినీ పంపించారు.

నెల తర్వాత దీపిక లీగల్‌సెల్‌కు వచ్చి 'కుమార్‌లో చాలా మార్పు వచ్చింది. ఆమెతో మాట్లాడటం మానేశాడు. మా బావగారు ఆమెను వేరే ప్రాంతానికి బదిలీ చేయించారు. నేను కూడా వేరే ఉద్యోగం చూసుకున్నాను. ఇప్పుడు మేము మా పిల్లలతో చాలా సంతోషంగా ఉంటున్నాం. మీరు చెప్పకపోతే ఆవేశంలో నిర్ణయం తీసుకునేదాన్ని. నా జీవితాన్ని నేనే నాశనం చేసుకునేదాన్ని' అని చెప్పి సంతోషంగా వెళ్ళింది.

- వై. వరలక్ష్మి, 9948794051



ఎవరిపై ఆధారపడకుండా...

చాలా మంది మహిళలు ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకుండా సొంత కాళ్ళ మీదే నిలబడాలనుకుంటారు. అలా బతకాల్సిన అవసరం నేటి సమాజంలో చాలా ఉంది. అయితే ఇందుకోసం ఆర్థిక ప్రణాళికలను ముందే రూపొందించుకోవాలి. ఈ విషయంలో కొంత జాగ్రత్తగా కూడా వ్యవహరించాలి. అంతేకాదు, రిటైర్‌మెంట్ ఫండ్స్ సమకూర్చుకోవడానికి పురుషులతో పోలిస్తే మహిళలు రెండింతలు ఎక్కువ డబ్బు ఆదా చేయాలని అంటున్నారు ఆర్థిక నిపుణులు. అందుకే మహిళలు తమ ఆర్థిక ప్రణాళికలను ఎలా రూపొందించుకోవాలో చూద్దాం..



ఆర్థిక నివేదికల ప్రకారం భారత్‌లో మహిళల ఆదాయం పురుషులతో పోల్చి చూస్తే దాదాపు 20 శాతం తక్కువ. ఒంటరి మహిళలకు సేవింగ్స్ మరింత ముఖ్యం. భారత్‌లో ఎనిమిది కోట్ల మంది ఒంటరి మహిళలు ఉన్నారు. వారిలో పెండ్లి కాని మహిళలు, విడాకులు తీసుకున్న మహిళలు, వితంతువులు లేదా ఇతర కారణాల వల్ల తమ జీవిత భాగస్వాములకు దూరంగా ఉంటున్న వారున్నారు. భారత్‌లో పురుషుల సగటు ఆయుష్షు 66.9 ఏండ్లయితే మహిళల సగటు ఆయుష్షు 69.9 ఏండ్లు. కుటుంబ బాధ్యతలు, పిల్లలు, వారి పెంపకం వంటి బాధ్యతల వల్ల మహిళలు తమ వృత్తి నుంచి, చేసే ఉద్యోగాల నుంచి విరామం తీసుకోవాల్సి వస్తుంది. అది వారి సేవింగ్స్‌ను ప్రభావితం చేస్తాయి. దీని వల్ల ఆ మహిళలు ఆర్థికంగా తమ జీవిత భాగస్వాముల మీదే ఆధారపడుతున్నారు.

క్రమపద్ధతిలో పెట్టుబడులు

ఆర్థిక నిపుణులు చెబుతున్న ప్రకారం మహిళలు ఎక్కువ డబ్బు పొదుపు చేయడం, ఆరోగ్య బీమా తీసుకోవడం, ఉద్యోగాలలో చేరే ముందే జీతాలకు సంబంధించి స్పష్టంగా చర్చించడం, ఎంత వీలైతే అంత ఎక్కువ కాలం వృత్తిలో కొనసాగడం, సరైన విధంగా పెట్టుబడులు పెట్టడం వంటివి చేయాలి. ఉదాహరణకు ఇండ్లలోనే ఉండే మహిళలు తాము దాచుకున్న డబ్బును క్రమపద్ధతిలో పెట్టుబడులకు ప్రణాళిక వేసుకోవాలి. అంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. వేరే ఇంకేదైనా చిన్న మొత్తంలో పొదుపులు ప్రయత్నించవచ్చు.

సరైన సమయం...

మహిళలు అధిక లాభాలు పొందేందుకు, ఎక్కువ డబ్బును పొదుపు చేసుకునేందుకు ఎన్నో బ్యాంకులు కస్టమైజ్డ్ అకౌంట్లు ఓపెన్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. అలాగే క్యాష్ బ్యాక్ ఆఫర్లు, రివార్డ్ పాయింట్స్ లాంటి అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక మరొక ప్రత్యామ్నాయం టర్మ్ ఇన్సూరెన్స్. ఎన్నో బీమా కంపెనీలు పురుషులతో పోల్చి చూస్తే మహిళలకు బీమా పాలసీ ప్రీమియంలో ఎక్కువ డిస్కౌంట్లు అందిస్తున్నాయి. దీనికి ముఖ్య కారణం మహిళల సగటు ఆయుష్షు పురుషులకంటే ఎక్కువ ఉండడం. ఇవే కాకుండా ఇంకా ఎన్నో ఆకర్షణీయ ఆఫర్లు మహిళల కోసం అందుబాటులో ఉన్నాయి. ఇలాంటివన్నీ సరైన సమయంలో ఉపయోగించుకుంటే మహిళలు అవసరమైతే వృద్ధాప్యంలో కూడా ఎవరి మీదా ఆధారపడకుండా జీవించవచ్చు.

విభజన చట్టం హామీలపై.. మాట తప్పిన మోడీ క్షమాపణ చెప్పాలి

- 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌కు విమర్శించే హక్కులేదు
- మహబూబాబాద్‌లో 24,181 మందికి పోడు పట్టాలు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



విభజన చట్టంలో రాష్ట్రానికి ఇవ్వాల్సిన కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఇవ్వనందుకు ప్రధాని మోడీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో పోడు భూముల పట్టాలను సాగుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. విభజన చట్టంలో ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 360 ఎకరాలు కేటాయించినా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్మించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ నియోజకవర్గంలోని బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సి ఉండగా తొమ్మిదేండ్లయినా ఏర్పాటు చేయలేయకపోవడం దారుణమన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకపోగా.. గుజరాత్‌లో రూ.21వేల కోట్లతో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు రైళ్లను మరమ్మతులు చేసే షెడ్‌ను మనకు మంజూరు చేశారని, దీని శంకుస్థాపనకు ప్రధాని వస్తున్నారన్నారు. గుజరాత్‌కు ఒక న్యాయం, మనకో న్యాయమా అని ప్రశ్నించారు. మీరు గుజరాత్‌కు మాత్రమే ప్రధాని కాదని, దేశానికి ప్రధాని అని గుర్తు చేశారు. కొమురం భీం ఒకనాడు జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేశారని, ఆయన కలను నేడు గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వడం ద్వారా సాకారం చేశామని తెలిపారు. 'జల్' విషయంలో ఇప్పటికే సీఎం కేసీఆర్ కాలంతో పోటీపడుతూ నీళ్ల సమస్యను పరిష్కరించారన్నారు. జంగల్ విషయంలో హరితహారం కార్యక్రమం ద్వారా ఈ తొమ్మిదేండ్లలో 240 కోట్ల మొక్కలను నాటి 5.13 లక్షల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని విస్తరించామన్నారు. ఇక జమీన్ విషయంలో.. ఈ ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 1.50లక్షల మందికి 4లక్షల ఎకరాల పోడు భూముల్లో పట్టాలిస్తున్నామని తెలిపారు. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే 67,730 ఎకరాల్లో 24,181 మంది గిరిజనులకు పట్టాలిచ్చినట్టు చెప్పారు. ఈ పట్టాలతో ప్రభుత్వ పథకాలైన రైతు బంధు, రూ.5లక్షల రైతు బీమా వారికి వర్తిస్తాయని, ఈ నెలలోనే రైతు బంధు కింద రూ.68కోట్ల నిధులు గిరిజన రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. అలాగే, రాష్ట్ర ఏర్పాటుకు ముందు పదేండ్లలో 26 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తే, రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం ఈ తొమ్మిదేండ్లలో 1.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 80 వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నామన్నారు. ఇటీవల మహబూబాబాద్‌లో పాదయాత్ర చేసిన కాంగ్రెస్ నేత భట్టి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ప్రస్తావిస్తూ 50 ఏండ్లు పాలించి ఏం చేశారని, ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెసోళ్ల మాటలు వింటే చక్కెరొచ్చి పడిపోతారని, రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తరంట.. అధికారం కోసం హామీలపై హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, ప్రభుత్వ అధికారులు, పోడు రైతులు పాల్గొన్నారు.

తమిళనాడు గవర్నర్‌ను తొలగించండి

(మొదటిపేజి తరువాయి)

దిగుతున్నారని, తాజాగా ఒక మంత్రిని తొలగించిన దారుణమైన చర్య రవి రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవిని నిర్వహించడానికి తగినవాడు కాదని స్పష్టంగా తెలియజేస్తుందని పొలిట్ బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. రవిని తక్షణమే భారత రాష్ట్రపతి రీకాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది.

పోడు రైతులపై కేసులు రద్దు...

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



శుక్రవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ముఖ్యమంత్రి నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు పోడుపట్టాల పంపిణీ చేశారు. అలాగే, పలువురికి రైతుబంధు చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనేతరుల గురించి స్పందిస్తూ.. 75 సంవత్సరాలుగా పోడు భూముల్లో సాగులో ఉన్నట్టు ఆధారాలు చూపిస్తే వారికీ త్వరలో పట్టాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగుల సహకారాన్ని గుర్తుచేసి.. అభినందించారు. అంతకు ముందు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.

గతంలో మంచం పట్టిన మన్యం అనే వార్తలు వచ్చేవని..భగీరథ నీరు వచ్చిన తర్వాత ఆ సమస్య లేకుండా పోయిందని తెలిపారు. మన్యం వీరుడు కుమురంభీం పేరుతో ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 24గంటలపాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అటవీ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజన బిడ్డల పొలాలకు రెండు మూడు నెలల్లోనే రూ.300 కోట్లు ఖర్చుపెట్టి త్రీఫేజ్ కరెంట్ అందజేస్తామని చెప్పారు. దేశంలో సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రమే మొదటి స్థానంలో ఉందని తలసరి ఆదాయం, శుభ్రమైన మంచినీరు, కేసీఆర్ కిట్, రైతుబంధు తదితర పథకాలు ఇక్కడే అమలవుతున్నాయని వ్యాఖ్యానించారు. ధరణి పుణ్యంతో రైతుబీమా రూ.5లక్షలు చెక్కు రూపంలో ఇంటికే వస్తుందన్నారు. రైతుబంధు ఖాతాల్లో పడుతోందని చెప్పారు. ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ చెబుతోందని, ధరణి లేకపోతే పైరవీకారులు బలవంతంగా భూములు దోచుకుంటారని అన్నారు. ధరణిపోతే రైతుబంధు ఎలా వస్తుందని, వడ్ల పైసలు ఎలా పడతాయని, వీటి కోసం షావుకారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసమే రైతుబంధు తీసుకొచ్చామని వివరించారు. ఈ పథకాలు చూసి మహారాష్ట్రలోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని.. అక్కడా బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారని వివరించారు. తన ప్రాణం పోతుందని తెలిసినా తెలంగాణ కోసం పోరాటం చేశానని, పేదలే దేవుళ్లుగా పని చేస్తున్నామని చెప్పారు. గురుకులాల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీ తరగతుల బిడ్డలు అభివృద్ధి సాధించేందుకు దోహదం చేస్తున్నామన్నారు. అందుకే రాబోవు ఎన్నికల్లోనూ వందశాతం మనమే గెలుస్తున్నాం.. తెలంగాణ రాష్ట్రాన్ని మరింత గొప్పగా తీర్చిదిద్దుకుందామని వ్యాఖ్యానించారు.

> తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి అటవీ ప్రాంతాల్లో పర్యటించానని.. అనేక దశాబ్దాలుగా ఇక్కడి గిరిజనులు మానవాటే.. మావరాజ్(మాఊళ్లో..మారాజ్యం) నినాదంతో పోరాటం చేసినా సాధ్యం కాలేదని తెలిపారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత 4వేల గూడేలు, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ఇది సాధ్యమైందని చెప్పారు.

వరాల జల్లు

ఆసిఫాబాద్ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు ఒక్కో దానికి రూ.10లక్షల చొప్పున, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నామని.. మంచిర్యాల జిల్లాలోనూ ఏడు మున్సిపాలిటీలకు రూ.25కోట్లు, 311 పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. దేశంలో 20గ్రామ పంచాయతీలకు అవార్డులు వస్తే అందులో 19 గ్రామాలు తెలంగాణలోనివేనని తెలిపారు. కౌటాల నుంచి మహారాష్ట్ర వెళ్లేందుకు వార్ధా నదిపై రూ.75కోట్లతో వంతెన మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన జీఓను కూడా ఎమ్మెల్యే కోనప్పకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కుమురంభీం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ సిర్పూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హృదయవిదారకం

ఇంఫాల్ : జాతి హింసతో అట్టుడికిన మణిపూర్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ రెండో రోజూ పర్యటించారు. హింసతో ప్రభావితమైన ప్రజలను తాను కలిసిన తర్వాత అక్కడి పరిస్థితి గుండెను కలచివేసిందని అన్నారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన పోస్టు చేశారు. "మణిపూర్‌లో హింస కారణంగా తమ ప్రియమైనవారిని, ఇండ్లను కోల్పోయిన బాధితుల వేదన వినటం, వారి పరిస్థితిని చూస్తే హృదయవిదారకంగా ఉన్నది. నేను కలిసిన ప్రతి ఒక్క సోదరుడు, సోదరి, చిన్నారి ముఖంలో సాయం కోసం ఏడుపు కనిపించింది" అని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతికి ఆయన పిలుపునిచ్చారు. " మన ప్రజల జీవితాలు, జీవనోపాధికి భద్రత కల్పించటం కోసం మణిపూర్‌నకు ఇప్పుడు అత్యంత ముఖ్యమైన విషయం శాంతి. ఆ లక్ష్యం దిశగా మన ప్రయత్నాలన్నీ ఏకం కావాలి" అని రాహుల్ తన పోస్టులో వివరించారు.

శుక్రవారం బిష్ణుపూర్ జిల్లాలోని మోయిరాంగ్‌లో గల రెండు సహాయ శిబిరాలను రాహుల్ సందర్శించారు. ఈ రెండు శిబిరాల్లో దాదాపు వెయ్యి మంది ప్రజలు ఆశ్రయం పొందుతున్నారు. ఇంఫాల్ నుంచి మోయిరాంగ్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్న రాహుల్.. బాధిత ప్రజలను కలిసి వారి బాధను విన్నారు.

రాహుల్ తన పర్యటనలో మణిపూర్ సివిల్ సొసైటీ సంస్థల సభ్యులను కలిసి వారి సమస్యలను విన్నారు. కోఆర్డినేషన్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటీగ్రిటీ, యునైటెడ్ నాగా కౌన్సిల్ ప్రతినిధులు, షెడ్యూల్ ట్రైబ్ డిమాండ్ కమిటీ, జేఎన్‌యూ ప్రొఫెసర్ బిమోల్ ఎ వంటి ముఖ్య నాయకులను రాహుల్ కలిశారు. రాహుల్ పర్యటనలో ఆయనతో పాటు మణిపూర్ మాజీ సీఎం ఓక్రమ్ ఇబోబి సింగ్, పార్టీ జనరల్ సెక్రెటరీ(ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్, పీసీసీ అధ్యక్షులు కెశం మేఘచంద్ర, ఇతర నాయకులు ఉన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా మణిపూర్‌కు గురువారం చేరుకున్న రాహుల్.. అల్లర్లకు కేంద్ర స్థానమైన చురాచాంద్‌పూర్‌నకు తన వాహనశ్రేణితో వెళ్లడానికి యత్నించిన విషయం విదితమే. అయితే, బిష్ణుపూర్ ప్రాంతంలో ఆయన కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవటం.. అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటం.. ఆ తర్వాత రాహుల్ ఇంఫాల్‌కు తిరిగి వచ్చి అక్కడి నుంచి ప్రభుత్వం కల్పించిన హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అక్కడ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న ప్రజలతో రాహుల్ కలిసి మాట్లాడారు.

కలిసే ముందుకెళ్తాం...

(మొదటిపేజి తరువాయి)

ఆ ప్రయత్నం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అస్థిరంగా మారే ప్రమాదంలో పడేది. కానీ మునుగోడు ఫలితం తర్వాత మమ్మల్ని విమర్శించిన వారు కూడా హర్షించారు.'అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో శుక్రవారం సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుల ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, కలవేణి శంకర్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊహాగానాలపై నిర్ణయం తీసుకోలేం : తమ్మినేని

అనంతరం మీడియాతో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పొత్తులపై రకరకాల వార్తలు మీడియాలో వచ్చాయని చెప్పారు. బీఆర్ఎస్‌తో కమ్యూనిస్టులు ఇటీవల దూరమయ్యారని, కాంగ్రెస్‌తో జతకడతారంటూ ప్రచారం జరిగిందన్నారు. అవి పూర్తిగా నిరాధార ఆరోపణలని, దాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో పొత్తులు రాజకీయ విధానాల ప్రాతిపదికన ఉంటాయి తప్ప ఓట్లు, సీట్ల ప్రాతిపదిక కాదన్నారు. అఖిల భారత స్థాయిలో బీజేపీని ఓడించడమే తమ రాజకీయ విధానమని స్పష్టం చేశారు. దానికి అనుగుణంగానే రాష్ట్రంలోనూ ఆ విధానమే ఉంటుందన్నారు. బీఆర్ఎస్‌తో తమ మైత్రి ఆ ప్రాతిపదికనే ఏర్పడిందని, ఇప్పటికీ అది కొనసాగుతున్నదని వివరించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉండడం, ఓట్లు చీలకుండా ఉండేందుకే మునుగోడులో బీఆర్ఎస్‌తో స్నేహంగా ఉన్నామని చెప్పారు. మద్దతివ్వాలంటూ కాంగ్రెస్ నుంచి ప్రతిపాదన వచ్చిందని గుర్తు చేశారు. కానీ బీజేపీని ఓడించే శక్తి బీఆర్ఎస్‌కు ఉందని అన్ని కమిటీల్లో చర్చించి నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ తర్వాత ఖమ్మం సభలో, ఇతర సభల్లో వచ్చే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసే ఉంటామని సీఎం కేసీఆర్ ప్రకటించారని అన్నారు. బీజేపీని కేంద్రంలో గద్దెదించేదాకా విశ్రమించేది లేదంటూ కేసీఆర్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అయితే బీజేపీకి బీఆర్ఎస్ బీటీం అంటూ ఊహాగానాలొచ్చాయని, అవి ఆధారాల్లేనివని చెప్పారు. కేంద్ర మంత్రులను కలవడం, కవిత కేసు వంటి విషయాలపై కేటీఆర్, కేసీఆర్ బహిరంగంగా ప్రకటించారని అన్నారు. అయితే ఊహాగానాల మీద ఆధారపడి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేశారు. బీజేపీ వ్యతిరేక శక్తులను ఐక్యం చేయడమే తమ పని అని చెప్పారు. అందులో సీఎం కేసీఆర్ ముఖ్యమైన శక్తి అని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధానం కొనసాగుతుందన్నారు. సీట్ల పంపకం ఉంటుందా? ఎన్ని సీట్లు కోరుకుంటున్నాం, తక్కువ సీట్లకు అంగీకరిస్తారా?, ఇది అవమానకరంటూ వస్తున్న వార్తలపై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే సీట్ల పొత్తు ఉండాలనేది ఏం లేదన్నారు. తమకు బలమున్న నియోజకవర్గాల్లో కేంద్రీకరించి పనిచేస్తున్నామని, ప్రజలను సన్నద్ధం చేస్తున్నామని వివరించారు. తాము అనుకున్న సీట్లు గెలవడానికి ఆలోచనలు చేస్తున్నామని అన్నారు.

బీఆర్ఎస్‌పై యూటర్న్ తీసుకోలేదు : కూనంనేని

పార్టీలో చర్చించి ఓ నిర్ణయం తీసుకున్నాక కార్యదర్శి ఏది పడితే అది మాట్లాడేది ఉండబోదని, ఆ నిర్ణయం మారబోదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. నిర్ణయం మారాలంటే కిందిస్థాయి నుంచి మళ్లీ చర్చించాల్సి ఉంటుందన్నారు. అయితే బీఆర్ఎస్‌పై యూటర్న్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పేదల కోసం పోరాడే కమ్యూనిస్టులు అసెంబ్లీ, పార్లమెంటులో ఉండాలని అన్నారు. అనేక సమస్యలపై పోరాడుతున్నామని చెప్పారు. సీట్ల కోసం దిగజారాల్సిన అవసరం లేదన్నారు. అయితే రోజుకో పార్టీ మారే వారు తమను విమర్శిస్తున్నారని వివరించారు. కమ్యూనిస్టులను విమర్శించడమంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని అన్నారు. బీజేపీని నిలువరించడంలో కమ్యూనిస్టులు ప్రధాన భూమిక పోషించారని చెప్పారు. మునుగోడులో అదే చేశామని అన్నారు. అయితే అందరినీ కలుపుకుని పోవాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పైనే ఉందన్నారు.

బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టాల్సిన బాధ్యత బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై ఎక్కువ ఉంటుందని అన్నారు. కేరళలో కాంగ్రెస్‌తోనే కమ్యూనిస్టులకు పోటీ ఉంటుందని, అయినా తమిళనాడులో కాంగ్రెస్, డీఎంకే, సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి ఉన్నాయని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు కేసీఆర్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ అందరూ కలవాల్సిన అవసరముందన్నారు. అయితే తాము పిలుపు కోసం వేచిచూడం, సీట్ల కోసం వెంపర్లాడబోమని, బలమున్న నియోజకవర్గాల్లో తమపని తాము చేసుకుంటూ పోతామని స్పష్టం చేశారు. పోడు భూముల సమస్య ఇంకా పరిష్కారం కాలేదన్నారు. నాలుగు లక్షల ఎకరాలకే హక్కు పత్రాలిస్తున్నామని చెప్పారు. సీఎం హామీ ఇచ్చినట్టుగా 11 లక్షల ఎకరాలకు హక్కుపత్రాలివ్వాలని, గిరిజనేతరులకూ పోడు భూములు ఇవ్వాల్సిన అవసరముందని వివరించారు. ఈ అంశంపై ఓ కార్యక్రమ చేపడతామని, పత్రాలు రానివారు, పేర్లు గల్లంతైన వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

నియోజకవర్గం టీటీడీపీ ఇన్‌చార్జిగా వెంకటేష్



నవతెలంగాణ- ఘట్కేసర్

మేడ్చల్ నియోజకవర్గం టీటీడీపీ ఇంచార్జిగా సుంకరి వెంకటేష్ నియామకమయ్యారు. ఘట్కేసర్ మండలం మున్సిపాలిటీలో శుక్రవారం నాయకులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో తనకు ఈ పదవిని అప్పగించిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ టీటీడీపీ మండలం అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్, ఉపాధ్యక్షుటు సామల జగన్మోహనరెడ్డి, ఎండీ యాసిన్, టి.మహేష్, పాటిసరేందర్ రెడ్డి, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు కొండా జంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమాశంకర్, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎన్. కృష్ణారావు, జి. అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి : చైర్‌పర్సన్



నవతెలంగాణ - ఘట్కేసర్

మున్సిపల్‌లోని ప్రతి వార్డులో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లిపావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ 10వ వార్డు పటేల్ నగర్‌లో శుక్రవారం వార్డు కౌన్సిలర్ శశికళ దేవేందర్ ముదిరాజ్‌తో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 10వ వార్డులో 10 లక్షల రూపాయలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఎస్ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కేశవపట్నం ఆంజనేయులు పంతులు, నాయకులు గోపాల్ గౌడ్ , కొమ్మిడి విక్రాంత్ రెడ్డి, రాఘవ రెడ్డి, సురేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అందరు సమన్వయంతో పని చేయాలి



● మాజీ మేయర్ రామ్మోహన్

నవతెలంగాణ-ఉప్పల్

కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకెళ్లాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. రామంతాపూర్ డివిజన్ నెహ్రూనగర్ పూనమ్ భవన్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జోష్న ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, పాల్వాయి మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, తుట్ నరసింహ, చంబు సాయి, ఆలే రమేష్, ప్రశాంత్, శ్రీకాంత్ గౌడ్, సమీర్, మధు ముత్యాల, జాన్, శివ, రాంచంద్ర చారి, వెంకటేష్ చారి, గోపి చారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని సీఎస్ రెడ్డి కాలనీలో కాల్వ యాదయ్య ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహా రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని అతని పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాదయ్య కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం

● కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ- ఉప్పల్

కార్పొరేటర్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. డివిజన్‌లో పోచమ్మ టెంపుల్ నుండి కుమ్మరి కుంటలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను కార్పొరేటర్ బన్నాల గీతా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ రాజ్ కుమార్ తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి రాజీ లేకుండా నిధులు సమకూర్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పొద్దున ఒక పార్టీ, సాయంత్రం ఒక పార్టీ.. ర్యాలీలతో వచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అబద్ధపు వాగ్దానాలు చేసి అరచేతిలో స్వర్గం చూపించే ప్రయత్నం చేస్తున్నారని, 50 ఏండ్లు వారికి అవకాశం కల్పించినా ఏమీ చేయక, ఇప్పుడు మళ్లీ అవకాశం ఇయ్యమని అడుగుతావుంటే చాలా విడ్డూరంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, బాణాల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, మహేందర్, యాదగిరి పోచయ్య, షఫీ, సదానంద్ చారి, గౌస్, జిల్లాల ప్రవీణ్, శ్యామ్, బాలు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే పోడు భూములకు హక్కు పత్రాలు జారీ



నవతెలంగాణ- సంతోష్ నగర్

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని సుదీర్ఘకాలం గిరిజనులు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీలు చేసిన పోరాటాల ఫలితంగానే నేడు ప్రభుత్వం 4 లక్షల ఎకరాలకు పైగా హక్కు పత్రాలను జారీ చేసిందని తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.రామ్ కుమార్, యం.బాలు నాయక్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ పోడు పోరాటంలో గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని ఆసిఫాబాద్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చీఫ్ సెక్రటరీని ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గిరిజనులు, ఇతర పేదలు 13 లక్షల ఎకరాల్లో పోడు భూములను సాగు చేస్తున్నారన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ప్రకారం వారందరికీ హక్కులు కల్పించాలని 9 ఏండ్లుగా గిరిజనులు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీలు విరోచితంగా పోరాటాలు నిర్వహించాయని గుర్తుచేశారు. తెలంగాణ గిరిజన సంఘం ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తూ స్వతంత్రంగా రాజీ లేని పోరాటాలు చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించి వేలాది మందిపై అక్రమ కేసులు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు వందలాదిమంది జైళ్లకు కూడా వెళ్లారన్నారు. ఇప్పటికీ అనేకమంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. విరోచిత పోరాటాల ఫలితమే సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 11:50 లక్షల ఎకరాలపై హక్కులు కల్పిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. కానీ నేడు కేవలం 4 లక్షల ఎకరాలపై, 1 లక్ష 51 వేల మంది గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వడం అన్యాయం అన్నారు. మరో 7.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా నిరాకరించడం వలన శాశ్వత పరిష్కారం ఎలా అవుతుందో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా పంపిణీ చేస్తున్న పోడు హక్కు పత్రాలు అన్ని జిల్లాల్లో సమాంతరంగా పంపిణీ చేయకపోవడం వలన లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఒకవైపు సీఎం, మంత్రులు పోడు భూముల పంపిణీకి జిల్లాలకు వెళ్లిన సందర్భంగా అనేక మంది గిరిజన సంఘం, గిరిజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధం చేయడాన్నితీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు, పేదల దరఖాస్తులను తిరస్కరించిన వాటన్నింటినీ తిరిగి పునర్ పరిశీలించి హక్కులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవ తెలంగాణ సంతోష్ నగర్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నియోజకవర్గ పరిధిలోని మూస రాంబాగ్ మూసినదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మా నియా మార్చురీకి తరలించారు. మృతుడు మెరున్ కలర్ హాండ్స్ షర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వ్యక్తులు, అతని కుటుంబ సభ్యులు మలక్ పేట్ పోలీస్ స్టేషన్ లో లేదా 8712660570 నెంబర్ ను సంప్రదించాల ని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సంవృధి ఎక్స్‌పోస్ ప్రాపర్టీ షో ఎంతో ఉపయోగకరం'



నవతెలంగాణ -ఘట్కేసర్

ఈస్ట్ హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా సంవృధి ఎక్స్‌పోస్ ప్రాపర్టీ షో ఎంతో ఉపయోగకరమని పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకటరెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డిలు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం సంవృధి ఈవెంట్లు, ఎక్స్‌పోస్ ఆధ్వర్యంలో ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ సహకారంతో జులై 8,9 తేదీల్లో పీర్జాదీగూడలోని శ్రీ పలని కన్వెన్షన్ హాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు జరుగు ఈస్ట్ హైదరబాద్ ప్రాపర్టీ షో బ్రోచర్‌ను నిర్వాహకులు కొంతం ఓంకర్ రెడ్డి, రఘునాథ్, కృపాకర్ రెడ్డి, ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈస్ట్ హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా ఎన్నో ప్రాజెక్ట్ వస్తున్నాయని, ప్రాపర్టీ షో ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలమైన ప్రాంతాలు, అనుకూలమైన బడ్జెట్, తదితర అంశాలపై అవగాహనతో పెట్టుబడులు పెట్టడానికి మంచి అవకాశమని, బిల్డర్లకు సహితం ఈ షో ద్వారా ఎన్నో ఉపయోగాలు కలుగనున్నాయని వివరించారు. నగర పరిసర ప్రాంతంలో సంవృధి ఈవెంట్స్, ఎక్స్‌పోస్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ షోలో పలు కంపనీలు ఇస్తున్న ఆఫర్లను అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్లు, నాయకులు కొంతం అంజిరెడ్డి, కొంతం నర్సింహారెడ్డి, బొక్క ప్రభాకర్ రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

● మత సామరస్యానికి కాపాడడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
● అధికారులను ఆదేశించిన రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ బోనాల పండుగ నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని రాచ కొండ సీపీ డీఎస్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో బోనాల పండుగ నిర్వహణతోపాటు క్రైం రివ్యూపై చర్చిం చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాచకొండ పరిధిలో జరగనున్న బోనాల పండుగకు కట్టుదిట్టమైన భద్రతోపాటు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల సహకారంతో ముందుకెళ్లాలన్నారు. సున్నితమైన ప్రాంతాలలో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. బోనాల పండుగ నేపథ్యంలో భక్తులు పెద్దఎత్తున దేవాలయాలకు వచ్చే అవకాశముంటుందని చెప్పారు. క్యూలైన్‌లో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు శాంతియుతంగా బోనాల పండుగ జరుపుకోవాలని, తమ చర్యల ద్వారా ఇతరులకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ఆయా ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. మహిళల పట్ల ఎవరూ అసభ్యకరంగా ప్రవర్తించకుండా, వారు ఎటువంటి వేధింపులకు గురికాకుండా షీ టీమ్స్ బందాలు ఎల్లవేళలా విధుల్లో ఉండాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన క్రైం రివ్యు సమావేశంలో అన్ని జోన్లలో నేరాల శాతం తగ్గించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై ఆరా తీయాలని, వారు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా వాహనాల నెంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ, డీసీపీలు అభిషేక్ మహంతి, జానకి, రాజేష్ చంద్ర, గిరిధర్, అనురాధ, బాలస్వామి, సాయి శ్రీ, శ్రీ బాల, శ్రీనివాస్, మురళీధర్, అడ్మిన్ ఇందిర, అడ్మిన్ నర్మద, అదనపు డీసీపీలు షమీర్, శ్రీనివాస్, లక్ష్మి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతోపాటు ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..



- దమ్ముంటే ప్రజా సేవలో పోటీ పడాలి
- కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని పీర్జాదిగూడ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది అవగాహన లేని వ్యక్తులు తనను రాజకీయంగా ఎదుర్కోవడం చేత కాక..తనపై అభాండాలు వేసి దుష్ప్రచారం చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఓటమి పాలైన వారు తన డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎదో కుంటి సాకులు వెతికి, పన్నులు అంశం తెరమీదకు తీసుకువచ్చి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని చెప్పారు. తాను న్యాయబద్ధంగా తనకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ఇచ్చిన పన్నులను చెల్లించానని భువన్ సర్వే అనంతరం వచ్చే ట్యాక్స్ చెల్లించడానికైనాతాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. దమ్ముంటే ప్రజా సేవలో పోటీ పడాలని హెచ్చరించారు. ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే ప్రజలు ఇంకా అసహ్యించుకుంటారని అన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులను

రాబందుల్లా పీక్కు తింటున్న ప్రయివేటు సంస్థలు



ఎల్బీనగర్ బీఎస్పీ ఇన్‌చార్జి జక్క యాదగిరి

నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల తల్లీదండ్రులను ప్రయివేటు సంస్థలు రాబందుల్లా పీక్కు తింటున్నాయని ఎల్బీనగర్ బీఎస్పీ ఇంచార్జి జక్క యాదగిరి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీనగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రయివేటు విద్యాసంస్థలకు ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి ఆచరణలో పెట్టడం లేదని అన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల గురించి అడిగే నాథుడు లేకపోవడంతో ప్రతీ విద్యా సంవత్సరానికి తమకు ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచుతూ పోతున్నారని తెలిపారు. ప్రతి ఏటా పది శాతం నుండి 30% వరకు ఫీజులు పెంచుతున్నారని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబీకులు ఫీజులు కట్టలేక.. ప్రభుత్వ పాఠశాలలకు పంపించలేక, తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఆఖరికి సీఎం వాళ్ల పిల్లలైన ప్రభుత్వ పాఠశాలలోనే చదివేటట్లు చట్టం తీసుకొస్తే కానీ ఈ ప్రయివేటు విద్యాసంస్థల ఆగడాలు ఆగవని అన్నారు. ఇప్పటికైన ఫీజుల నియంత్రణ కోసమైన చర్యలు తీసుకోవాలని లేదా.. అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివేలా చట్టమైన తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి కట్ల కుమార్, రఘుపతి, కె.అనిల్ యాదవ్, ఏ.స్వామి, మహేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



● సీఐటీయూ మండల కార్యదర్శి సబిత

నవతెలంగాణ-ఘట్కేసర్

పోచారం పురపాలక సంఘం పరిధిలోని అన్నోజిగూడలో ఉంటూ మున్సిపల్ వర్కర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన బి .స్వామి చారి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మృతదేహం పైన సీఐటీయూ జెండాను కప్పి, రెండు నిమిషాలు మౌనం పాటించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరోనా సమ యంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేశారని గుర్తుచేశారు. స్వామి చారి కుటుంబానికి పది లక్షల రూపా యల ఎక్స్ గ్రేషియోను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబంలో ఒకరికి మున్సిపాలిటీలో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచారం పురపాలక చైర్మన్ కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, ఇంజనీర్ నర్సింగరావు, గాంధారి అశోక్, ఎన్ దాసు, జగదీష్, నరసింహ, శాంతమ్మ, రాములమ్మ, భవిత, కిరణ్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. మేడ్చల్ జిల్లా పరిధిలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైనా శ్రీలతా బద్రు నాయక్, మాధవిరాజులను శుక్రవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాడం ఖాయం అని జోస్యం చెప్పారు. ఇప్పటికే పలు సర్వే సంస్థలు తెలిపాయన్నారు. సర్వే సంస్థల అంచనాలను మించి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మేడ్చల్ నియోజకవర్గంలో భారీ విజయం చేకూరేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మేడ్చల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు కుర్రి మహేష్, పోచారం మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు, భద్రు నాయక్ పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని ఇద్దరు విద్యార్థులు మృతి





నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ జాహ్నవి డిగ్రీ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు బస్సు ఢీకొని మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ జాహ్నవి డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు భూమ సాయికుమార్ (22), అనిత(20)లు మిత్రులతో కలిసి సంఘిటెంపుల్‌కు వెళ్లారు. తిరిగి బోడుప్పల్‌కు బైక్ పై వస్తున్న సమయంలో ప్రతాపసింగారం పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన బస్సును, విద్యార్థులు ప్రయాణిస్తున్న బైక్ ను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సబితా ఇంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

● అర్కల కామేష్ రెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై వ్యక్తిగత అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి హెచ్చరించారు. కొత్త మనోహర్ రెడ్డి మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై వ్యక్తిగతంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం జిల్లెలగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల శ్రేయస్సు కోరుతూ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై ఉద్యమకారుల పేరుతో వ్యక్తిగతంగా అనుచిత వాక్యాలు చేయడం సరైనది కాదని హెచ్చరించారు. మనోహర్ రెడ్డి ఏనాడూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయలేదని అన్నారు. కేవలం తన స్వలాభం కోసం ఇతరులను బ్లాక్ మెయిల్ చేస్తూ భూకబ్జాలకు పాల్పడుతూ పార్టీ పేరుతో పబ్బం గడుపుతున్న వ్యక్తి మనోహర్ రెడ్డి అని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించడానికి మీరు సిద్ధంగా ఉన్నారని ప్రశ్నించారు. ఒక మహిళా మంత్రిపై నిరాధారంగా అవినీతి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. దాదాపు ఆరు ఏండ్లుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి అనుభవించి.. నేడు మంత్రి అయిన ఆమెపై ఆరోపణలు చేయడం పాండురంగారెడ్డికి తగదన్నారు. ఇప్పటికైనా మంత్రిపై అనుచిత వాక్యాలు చేసినందుకు మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్లు గజ్జల రాంచందర్, బొక్క రాజేందర్ రెడ్డి, ఇంద్రావత్ రవి నాయక్, జిల్లెల అరుణ, నాయకులు దీప్ లాల్ చౌహన్, యాదగిరి, విజయ్, ఓం ప్రకాష్, జోజి, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి :

మహేశ్వరం నియోజకవర్గంలో వార్డు మెంబర్‌గా గెలవలేని వ్యక్తి..విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్ అన్నారు. ఆర్కేపురంలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల



నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖిల్లా మైసమ్మ దేవాలయ చైర్మన్ గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, కంచర్ల శేఖర్‌లు మాట్లాడారు. కొత్త మనోహర్ రెడ్డి, కప్పటి పాండురంగారెడ్డిలు పార్టీ మారాలనుకుంటే మారవచ్చని, ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. పార్టీలో పదవులు అనుభవించి..పార్టీ మారాలనుకునేవారు ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. మంత్రి భూ కబ్జాలు చేస్తుందని కొత్త మనోహర్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నాడని..వాటిని రుజువు చేయకుంటే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. 2014లో సీఎం కేసీఆర్ మహేశ్వరం టికెట్ ఇచ్చినా గెలవలేక పోయాడని ఎద్దేవా చేశారు. స్థాయిని మరిచి మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కొత్త మనోహర్ రెడ్డి నియోజకవర్గంలో భూ కబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, రామాచారి, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, సాజిద్, కొండ శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, ముచ్చింతల జగన్, శ్రీమన్నారాయణ, శ్రీరాములు, పబ్బు శ్రీనివాస్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్ మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ :

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని విమర్శించే స్థాయి కొత్త మనోహర్ రెడ్డికి లేదని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పెద్దబావి మల్లారెడ్డి పంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త మనోహర్ రెడ్డి..సొంత గ్రామంలో కనీసం ఒక వార్డ్ మెంబర్, సర్పంచ్ గా గెలిచే సత్త లేని వ్యక్తి అని విమర్శించారు. మంత్రి ఇంద్రారెడ్డి కుటుంబం రాజకీయ రాజకీయ కుటుంబం అని..42 ఏండ్లుగా ప్రతి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేవారని



గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో హోం మంత్రిగా పనిచేసిన విషయాన్ని మర్చిపోయారా అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్,పెద్ద బావి ఆనంద్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, బీమిడి జంగా రెడ్డి, ముత్యాల కృష్ణ, లిక్కి కృష్ణ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ విందులో పాల్గొన్న బీఎల్ఆర్

నవతెలంగాణ-కాప్రా

కాప్రా నోబెల్ స్కూల్ చైర్మెన్ తజ్జుదిన్ ఆహ్వానం మేరకు ఆక్స్ఫర్డ్ స్కూల్ లో ఏర్పాటు చేసిన విందులో ముఖ్య అతిథిగా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఎల్ఆర్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ నోబుల్ స్కూల్ విద్యార్థులు రిజల్ట్స్‌లో మంచి ఫలితాలు సాధించింది పాఠశాలకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చేలా విద్యార్థులను ప్రోత్సహించాలని, పాఠశాలను సందర్శించడం సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, శ్రీకాంత్ గౌడ్ ,నరసింహారెడ్డి, చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్, భాస్కర్ గౌడ్, రహీం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి

- కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేస్తున్నానని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని ఓం సాయి నగర్ కాలనీ ఓల్డ్ ఆల్వాల్‌లో అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురాతన కాలంలో వేసిన రోడ్లు గుంతల మయంగా మారినాయని, డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముందుగా డ్రైనేజీ వ్యవస్థ బాగుపరిచి, అంతర్గత రోడ్లు వేయిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, జలమండలి అధికారి రమేష్, కిషోర్, వర్క్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ ,కాలనీ ప్రెసిడెంట్ వాసు, కిషోర్ పాల్గొన్నారు



నేడు గ్రూప్-4 పరీక్ష

- గంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి
- హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో 360 కేంద్రాలు
- హాజరుకానున్న 1,49,824 మంది అభ్యర్థులు
- జిల్లా కలెక్టర్లతో టీఎస్పీఎస్సీ చైర్మెన్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి వ్యాప్తంగా 360 పరీక్షా కేంద్రాల్లో 1.49,824 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. హైదరాబాద్‌లో 173 పరీక్షా కేంద్రాల్లో 59,604 మంది, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 187 పరీక్షా కేంద్రాల్లో 90,220 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని, హాల్ టికెట్లో సూచించిన పరీక్షా కేంద్రాల్లో మాత్రమే పరీక్షకు హాజరు కావాలని సూచించారు. అలాగే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్ చేయనుండగా అభ్యర్థులు పరీక్ష సమయానికంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. సెల్ ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నిషేధిత, విలువైన వస్తువులు తీసుకురావద్దని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. గ్రూప్-4 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా.. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు సజావుగా సాగేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్ నెట్ సెంటర్లు అన్ని మూసి వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పైఅధికారులను సంప్రదించాలని సూచించారు.

మేడ్చల్ కలెక్టరేట్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్ 4 పరీక్షల నిర్వహణ పై హైదరాబాదు నుండి టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సభ్యులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తో పాటు అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి ,జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా జులై 1వ తేదీన జరిగే గ్రూప్ 4 పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ విషయంలో టీఎస్పీఎస్సీ సూచనల ప్రకారం అధికారులు ముందుస్తు కార్యాచరణతో అన్ని రకాల పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందిం చడంతో పాటు జిల్లా స్థాయి అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలను టీఎస్పీ ఎస్సీ నియమ నిబంధనల ప్రకారం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహి స్తామని టీఎస్పీఎస్సీ చైర్మెన్ జనార్దన్ రెడ్డి కి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలి



- మేడ్చల్ నియోజకవర్గంలో పనులు ఏమాత్రం పెండింగ్ ఉండకుండా చూడాలి
- మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందచేస్తున్నారని ఈ విషయంలో మేడ్చల్ నియోజకవర్గంలో పనులు ఏమాత్రం పెండింగ్ ఉండకుండా పూర్తి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీవో రవితో పాటు జిల్లా స్థాయి అధికారులతో నియోజకవర్గంలోని ఆయా అభివృద్ధి పనులు, పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఘట్కేసర్‌లోని ఆర్వోబీని వెంటనే పూర్తి చేయాలని ఈ విషయంలో పనులను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు ఆదేశించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను, డబుల్ బెడ్ రూమ్‌లను త్వరితగతిన అందించే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని వీలైనంత తొందరగా వారికి అందచేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెండో విడత దళిత బంధుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులను తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేసేలా తనవంతు కృషి చేస్తానని ఈ విషయంలో అధికారులు పనులు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతినిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను తయారు చేశారని ఆ జాబితాను సైతం మంత్రికి అందచేస్తామని తెలిపారు. అలాగే ఘట్కేసర్ ఆర్వోబీ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీవో రవి, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాస్ అహ్మద్ ఐఏఎస్

నవతెలంగాణ-నాచారం

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమిషనర్ సర్ఫరాస్ అహ్మద్ ఐఏఎస్ అన్నారు. శుక్రవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో స్వయం పాలన దినోత్సవం, ఇన్వెస్టిచర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండే నాయకత్వ లక్షణాలు, సామాజిక, సేవా కార్యక్రమాలలో ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అవరోధిస్తారని అన్నారు. చదువు ఎంత ముఖ్యమో క్రమ శిక్షణ, సమాజం పట్ల అవగాహన కూడా అంతే ముఖ్యమని, ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలియ చేయవలసిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా భావి భారత నిర్మాతలుగా ఎదుగు తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, క్లాస్ లీడర్లను నియమించారు. అనంత రం తెలంగాణ రాష్ట్ర డబ్ల్యుఆర్ఈఐ సొసైటీ సెక్రటరీ రోనాల్డ్ రోజ్ ఐఏఎస్ చేతుల మీదుగా బ్యాడ్జులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, కౌట్స్ అండ్ గైడ్స్ వందన సమర్పణ స్వీకరించి విద్యార్థినీ విద్యార్థులను అభిన ందించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్స్ చైర్మెన్ మల్కా కొమరయ్య, సీఓ. మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ సునీతారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలని పార్కు అభివృద్ధి



నవతెలంగాణ-కాప్రా

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలని పార్కును కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని దాంట్లో భాగంగానే డివిజన్, అభివృద్ధిలో ముందుంటున్నారు. ఇకముందు కూడా డివిజన్‌లో ఇలాంటి కార్యక్రమాలు అభివృద్ధి పనులు చేసుకుంటూ సాయంకాలం ఆహ్లాదంగా వినోదం కోసం కుటుంబ సభ్యులందరూ కలిసి జిహెచ్ఎంసీ పార్కులో ఎక్కువగా సందర్శిసూ, ఉల్లాసాన్ని పొందుతున్నారు. ఈ యొక్క పార్కుల అభివృద్ధి డివిజన్ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేకి రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సర్వోత్తమ రెడ్డి, బొడిగే అశోక్, స్థానిక నాయకులు శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

యువత ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని తెలంగాణ ఖని జ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ అభివృద్ధి చైర్మెన్ మన్నే క్రిశాంక్ కోరారు. 7వ వార్డులోని సబా కేఫ్‌లో యువత కోసం కేఫ్ పాలిటిక్స్ 8వ వారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజకీయంగా చైతన్యవంతం కావాలన్నారు. బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగం ఏవిధంగా సంపాదించాలో ఇతర విషయాలను యువతకు సలహాలు సూచనలు ద్వారా చెప్పారు. ఈ కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమం యువతలో మార్పు తెచ్చేందుకే తాను ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత భారీ సంఖ్యలో పాల్గొని వారికున్నటువంటి ఉద్యోగ, విద్యతోపాటు పలు సమస్యలు క్రిశాంక్ దృష్టికి తీసుకొచ్చారు.

ప్రగతే దిశగా... అభివృద్ధే ఎజెండాగా ముందుకు

- రూ.14కోట్లతో నగరం రూపురేఖలు మారనున్నాయి
- జవహర్ నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రగతి పనులే దిశగా... అభివృద్ధి ఏజెండాగా ముందుకు సాగుతూ కార్పొరేషన్ అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ మేకల కావ్య అ న్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాయలంలో మేయర్ మేకల కావ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం జవహర్ నగర్ అభివృద్ధి కోసం నగరపాలక సం స్థ సాధారణ నిధులు రూ. 14కోట్లతో తీర్మాణం ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మే యర్ కావ్య మాట్లాడుతూ కార్పొరేషన్ లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతి డివిజన్‌కు 50లక్షలు కేటాయిస్తుండటంతో కనివిని ఎరగని రీతిలో జవహర్ నగర్ పూర్తిగా మారిపోతుందని అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ ప్రభాకర్ యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎలక్ట్రికల్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఫీసర్స్ కాలనీలో బీఆర్ఎస్ నేత ఉపేందర్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలు మేరకు శుక్రవారం బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి సర్కిల్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్‌కేపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో సీసీ రోడ్డు మంజూరైందని, శనివారం ఈ రోడ్డు పనులు ప్రారంభిస్తా మని చెప్పారు. కాలనీలో ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువ స్తే తప్పకుండ పరిష్కారం చేస్తాము అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి, మహేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్, కాలనీ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి కృష్ణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నాగలక్ష్మి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా కాలనీలోనే అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టి ప్రధాన రహదారులు బీటీ రోడ్లు నిర్మించి కాలనీలను సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. ఇప్పటికే కాలనీలన్నీ పూర్తిగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలను కల్పించి మౌలిక వసతులను అందించడంలో గ్రేటర్‌లోనే మొదటి స్థానంలో మల్లాపూర్ నిలుస్తుందని అన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని రంగాలలో మల్లాపూర్‌ని అభివృద్ధి చేసి గ్రేటర్‌లోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈ స్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, పిజి సుదర్శన్, దయాకర్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

అమీర్‌పేట్ హెచ్‌డీ కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బండారి సుజాత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ ద్వారా మంజూరైన ఇన్సూరెన్స్ రెండు లక్షల చెక్కును బండారి సుజాత భర్త బండారి రాజేష్‌కి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతుల మీదుగా కార్పొరేటర్లు జేర్రిపోతుల ప్రభుదాస్, పన్నల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారం శ్రీనివాస్ రెడ్డి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్, రంగు ప్రసాద్ గౌడ్, ఆండాలు బీఆర్ఎస్ కార్యకర్తలు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో పోలీసు శాఖ ఎస్ఐ సెఫి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశములో డివిజన్ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసు శాఖ వారికి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను చెప్పడం జరిగింది. వారు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ప్రశాంత వాతావరణంలో అన్ని పండుగలు జరుపుకో వాలి అని ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా చూసుకోవాలి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, హెూటల్ యాదగిరి, నవీన్ గౌడ్, పూస రమేశ్, ఎల్లయ్య, బాల రాజు, జైపాల్, డీసీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కాప్రా

మహంకాళి బోనాల జాతరకు మంత్రికి ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట్

వచ్చే నెల 9 వ తేదీన సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఈవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మహంకాళి ఆలయ పాలకమండలి సభ్యులు మంత్రి శ్రీనివాస్ యాదవ్ దంపతులకు వెస్ట్ మారేడ్ పల్లిలోని వారి నివాసం బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ పండితులు, మంత్రి దంపతులను వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా, ఈవో అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చే మహిళలు, లక్షలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ పాలకమండలి సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, ఆలయ చైర్మెన్ రమేష్, సభ్యులు కిషోర్, జగదీష్ ప్రసాద్, రాజు,కేయం, కృష్ణ లావణ్య తదితరులు పాల్గొన్నారు.





ఆషాఢ మాసం శుక్రవారం అన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానంలో శాఖంబరిని నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, లలిత పారాయణం సభ్యులు అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-బేగంపేట్

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి పాలక వర్గం నిరంతరం కృషి చేస్తుందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్మెన్ కౌకుట్ల చంద్రరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 20 వార్డులలో అభివృద్ధి పనులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు వేయుటకు మొత్తం రూ 3 కోట్ల 50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగ చైర్మెన్ మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎక్కడ కూడా రాజకీయ స్వార్థం లేకుండా అన్ని విధాలుగా విడతల వారీగా వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు ఇందుకు కౌన్సిలర్స్ అందరూ సహకరించాలన్నారు. నిధుల కేటాయింపులో ఎక్కడ కూడా వివక్ష లేకుండా అన్ని వార్డుల్లో కూడా ముందుగా ప్రాధాన్యత క్రమంలో ఉన్న పనులకు నిధులు కేటాయించటం జరిగిందని చైర్మెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వాణి రెడ్డి , వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి రాష్ట్ర కార్యదర్శిగా రంగుల శంకర్ ఎన్నిక



నవతెలంగాణ-జవహర్ నగర్

తెలంగాణ ప్రాంత పద్మశాలి రాష్ట్ర కార్యదర్శిగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చెందిన రంగుల శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నారాయణగూడ రాజ్ మొహల్లా పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. పద్మశాలి, నేతలు కుల బాంధవులు, రంగుల శంకర్‌ను పూలమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రంగుల శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పద్మశాలిల అభివృద్ధి సంక్షేమం, ఐక్యత కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు పనికి తగ్గ వేతనం, ఉపాధి కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలీ కుల బంధువులందరూ పది రూపాయల సభ్యత్వం తీసుకొని ప్రభుత్వానికి మన సంఖ్యాబలం తెలపాలని పిలుపునిచ్చారు. చేనేతలకు వర్తించే ఐదు లక్షల బీమా పథకాన్ని అందరికీ వర్తించే విధంగా కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వనం విశ్వనాథ్ మహిళా అధ్యక్షురాలు వనం దుష్యంతుల, చేనేత విభాగం అధ్యక్షులు ఎర్రమాద వెంకన్న నేత, రాజకీయ విభాగం అధ్యక్షులు బొల్ల శివశంకర్, యువజన విభాగ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ఏబిపిఎస్ మీడియా ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, రాష్ట్ర మీడియా అధ్యక్షులు బొమ్మ అమరేందర్, గ్రేటర్ యువజన అధ్యక్షులు శ్రావణ్ కుమార్, రాష్ట్ర నాయకులు జెల్లా నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఫీజులతో మెరుగైన దంత వైద్య సేవలే లక్ష్యం

- డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు డాక్టర్ సిద్ధంరెడ్డి బిందుప్రియ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



అన్ని వర్గాల ప్రజలకు సాధారణ ఫీజులతో మెరుగైన దంత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు డాక్టర్ సిద్ధంరెడ్డి బిందుప్రియ అన్నారు. శనివారం డాక్టర్స్ డే పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ (హెచ్ఎంటి మెయిన్ రోడ్)బస్ స్టాప్ సమీపంలో గల "డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల" ఆస్పత్రి కార్యాలయం లో శుక్రవారం ఆమె నవ తెలంగాణతో మాట్లాడారు. సామా న్యులకు సైతం కార్పొరేట్ స్థాయి దంత వైద్యం అత్యాధునిక టెక్నాలజీ గల మిషనరీతో అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. మానవ సేవయే మాధవసేవ అన్న నానుడిని సార్థకత చేస్తూ ఈ దంత వైద్యశాల నెలకొల్పడం జరిగిందన్నారు. తమ డాలర్ స్మైల్స్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో గత కొన్నేండ్లుగా పరిసర ప్రాంతాలలో, పాఠశాలల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి చికిత్సలు చేయడం జరిగిందన్నారు.

నోటి శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత

పళ్ళ నిర్లక్ష్యంతో చాలా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఆమె మాట్లాడుతూ నోటి సమస్య కారణంగా ప్రతీ మనిషి రెండు విధాలుగా ఇబ్బంది పడతారని.. మొదటిది సాధారణ ఇన్ఫెక్షన్ అయితే రెండవది ఆహారం తీసుకోకపోవడమన్నారు. ఈ రెండింటి వల్ల హార్ట్ ఎటాక్ ,డయాబెటిస్, థైరాయిడ్, వంటి పలు ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు (పరిశోధకులు) వెల్లడించారన్నారు.

ప్రశ్న: దంత సమస్యలు తలెత్తితే ఎంత తొందరగా వైద్యులను సంప్రదించాలి

డాక్టర్ : ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులను సంప్రదించడం వల్ల వ్యాధి (సమస్య) నిర్ధారణ ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన సమయానికి సరైన వైద్యం చేసుకోగలమన్నారు.

ప్రశ్న: పిల్లలకు కూడా దంత సమస్యలు వస్తాయా ..పాల పళ్ళకి కూడా వైద్యం అవసరమా?

డాక్టర్ : పిల్లల్లో ఈసీసీ విరిగిన పళ్ళకి వైద్యం తప్పనిసరి. వాటిని నిర్లక్ష్యం చేసి వదిలేస్తే ఇన్ఫెక్షన్ ఎక్కువైపోయి తీవ్రమైన నొప్పి , వాపుతో పిల్లలు ఇబ్బంది పడడమే కాకుండా శాశ్వత పళ్ళకి సరైన పద్ధతిలో అమర్చబడలేవన్నారు.

మౌత్ వాష్ చేయడం వల్ల నోట్లో టూత్ బ్రష్ వెళ్లలేని ప్రాంతాల్లో దంతాలను శుభ్రం చేయడానికి ఉపయోగపడుతుంది.

ఆహారం తిన్న ప్రతిసారి నోట్లో నీళ్ల వేసుకుని రెండు నిమిషాల పాటు పుక్కిలించడం తప్పనిసరి.

మౌత్ వాష్ చేసుకోవడం వల్ల బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ కూడా నివారించవచ్చు అన్నారు.

ఇవి మాత్రమే కాకుండా ఆహార నియమాలు పాటిస్తూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకుంటే దంతాలకు నో టెన్షన్ అన్నారు.

ప్రశ్న: లేకపోయినా పళ్ళ సమస్యలు ఉంటాయా?

డాక్టర్ :మనిషి పళ్ళన్ని ఒకేలా ఉండకపోయినా అన్నింటిలో మూడు పొరలు ఉంటాయి. పై పోరని ఎనామిల్, మధ్యలో పొరని డెంటిన్, మూడో పొరని పల్ప్ అని అంటారు. ఎనామిల్ పొరలో ఇన్ఫెక్షన్ లేదా పుచ్చు ఉన్నప్పటికీ మనిషికి ఎలాంటి సమస్యలు ఉండకపోవచ్చు. కానీ ఆ ప్రభావం మధ్యలోని డెంటిన్ కు చేరిన తర్వాత సెన్సిటివిటీ, ఆహారం ఇరుక్కుపోవడం తెలుస్తుంది. దీని ప్రభావం పల్ప్‌లోకి చేరిన తర్వాతే నొప్పి ప్రభావం తెలుస్తుంది.



ప్రశ్న:పుచ్చు ఒక పన్ను నుండి పక్క పన్నుకి పాకే అవకాశం ఉంటుందా?

డాక్టర్ : పుచ్చు పళ్ళ వ్యాధి ఒక పంటి నుండి ఇంకొక పంటికి సోకడం అనేది అపోహ మాత్రమే. సరైన పద్ధతిలో పళ్ళను శుభ్రం చేయకపోవడం వలన మాత్రమే పుచ్చు పళ్ళు, చిగుళ్ళ సమస్యలు మొదలవుతాయి.

ప్రశ్న: నోటి ఆరోగ్యం పెంపొందించడం ఎలా లేదా నోటి ఆరోగ్యం సూత్రాలు.

డాక్టర్ : ప్రతి మనిషికి అత్యంత ప్రాముఖ్యమైనది. మౌత్ వాష్ చేయడం ప్రతిరోజు ఉదయం రాత్రి వేళల్లో రెండు నిమిషాల పాటు సరైన పద్ధతిలో తప్పక మౌత్ వాష్ చేయాలి. బ్రష్ చేసేటప్పుడు మన పళ్ళనే కాదు నాలుకను కూడా శుభ్రం చేసుకోవాలని తెలిపారు.

పళ్ళ మధ్యలో ఇరుక్కున్న ఆహారాన్ని ఎస్, ఇంటర్ డెంటల్ బ్రష్ లతో తొలగించాలి. పిన్నులు పుల్లలు టూత్ పిక్స్ లాంటివి వాడితే ప్రమాదమని తెలి పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆమె చెప్పారు.

హోమియోతో అలర్జీ దూరం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



అలర్జీ సమస్యకు ఎన్ని రోజులు చికిత్సలు తీసుకున్నా ఎన్ని మందులు వాడినా తాత్కాలిక ఉప శమనమే మందులు ఆపేసిన మరుక్షణం అలర్జీ దాడి మరింత తీవ్ర మవుతుంది. అలర్జీ మూలంగా శారీరక, మానసిక సమస్యలు వస్తున్నాయి. అయితే హోమియో చికిత్స ద్వారా అలర్జీ మూల కారణాన్ని తొలగిం చడమే కాకుండా వ్యాధి నిరోధక వ్యవస్థను పెంపోందించి అలర్జీని సమూలంగా తొలగించవచ్చని అంటున్నారు. డాక్టర్ మధు వారణాశి.

అలర్జీ అంటే కొన్ని సాధారణ పరిస్థితులకు, వాతావరణ పరిస్థితులకు ఆహార పదార్థాలకు శరీరం అతిగా ప్రతిస్పందించడమే. శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థ మిత్రులను కూడా శత్రువులుగా భావించి తీవ్రంగా స్పందిస్తుంది. దీనివల్ల శరీరంలో అనేక మార్పులు జరుగుతాయి. శరీరంలోని వివిధ కణాలలో అలజడి రేగి వివిధ రకాల అలర్జీ లక్షణాలు బయటకు చూపిస్తుంది. అలర్జీ వలన శరీర వ్యవస్థలో ఎక్కడైనా మార్పులు రావచ్చు. ముఖ్యంగా శ్వాస కోశ వ్యవస్థ , చర్మం, జీర్ణ వ్యవస్థపై ప్రభావం అధికంగా ఉంటుంది. అలర్జీ వల్ల అర్టికేరియా, అలర్జిక్ డైనైటిస్, అలర్జిక్ అస్తమా, అలర్జిక్ సైన సైటిక్ వంటి సమస్యలు కనిపిస్తాయి.

కారణాలు..

అలర్జీ రావడానికి రెండు కారణాలు ప్రధానంగా ఉంటాయి. మొదటిది శరీరతత్వం, రెండోది బహిర్గత కారణాలు, శరీరతత్వంగా చూస్తే జన్యుపరంగా ,వంశపార పర్యంగా ఉంటుంది. ఇది తల్లిదండ్రుల నుంచి శరీరతత్వంగా వస్తుంది. బహిర్గత కారణాల విషయాన్ని కోస్తే దుమ్ము , ధూళి, పొగ, పరాగ రేణువులు, చేపలు, గుడ్లు, క్రీములు, కొన్ని రకాల నట్స్, వేరుశనగలు, సబ్బులు, మానసిక ఒత్తిడి వంటివి కారణాలుగా ఉంటాయి. మితిమీరిన అవేశాలు , ఉద్వేగాలు, మానసిక ఒత్తిడి , వ్యాధి నిరోధక వ్యవస్థపై ఎన్నో దుష్ఫలితాలను చూపిస్తాయి.

దద్దుర్లు, (అర్టికేరియా) : సర్వ సాధారణంగా చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ఇది కనిపిస్తుంది. కొన్ని సార్లు ఇది ప్రాణాంతకంగా మారిన సందర్భాలు ఉంటాయి. చర్మం మీద ఉబ్బుగా ఉండి వివిధ పరిమాణాలలో దద్దుర్లు వస్తుంటాయి. ఆ భాగంలో చర్మం ఎర్రగా ఉండి దురదగా ఉంటుంది. శరీరంలో ఒక భాగానికి రావచ్చు. కండ్లు, పెదవులు, చేతులు, చర్మంపైన ఎర్రగా వచ్చి మంట, దురద, వాపును కలిగిస్తుంది. కొన్ని సార్లు చీము వస్తుంది. కడుపులో మలి పురుగులు ఉన్నప్పుడు కూడా ఈ సమస్య కనిపించే అవకాశం ఉంది.

ఎగ్జిమా : దీర్ఘకాలిక వ్యాధి ఇది. చిన్న చిన్న పొక్కులు మాదిరిగా వచ్చి దురద, మంటను కలుగ చేస్తుంది. బాగా గోకిన తరువాత కొన్ని సార్లు రక్తం నీరులాగా వస్తుంది. ఆ సమయంలో భరించలేని దురద, మంట ఉంటుంది. చర్మం గరుకుగా ఉంటుంది. పగిలే గుణం కలిగే ఉంటుంది. చర్మంలో మృదుత్వం లోపిస్తుంది. చర్మం సున్నితంగా ఉండి ముట్టుకుంటే నొప్పిగా ఉంటుంది.

అలర్జిక్ రైనైటిస్ : శరీరానికి సరిపడని పదార్థాలు ముక్కుకు తగిలి హిస్టామిన్ అనే పదార్థం విడుదలై ముక్కులోని పొరలు ఉబ్బిపోతాయి. దీని వల్ల తుమ్ములు, ముక్కు కారడం , కండ్ల దురద, చెవిలో దురద, ముక్కులు బిగుసుకు పొవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముక్కులోని పొరలు వాచిన కొద్ది వాసన పీల్చే శక్తి తగ్గిపోతుంది.

అస్తమా : ముక్కులలో వచ్చే అలర్జీకి సరియైన చికిత్స తీసుకోకపోతే అది ఊపిరితిత్తులలోకి పాకి అస్తమా, బ్రాంకైటిస్‌కు దారి తీస్తుంది. శ్వాస కోశ మార్గం కుచించుకు పోవడం వల్ల తుమ్ములు, జలుబు, ముక్కు కారడం ,దగ్గు, అయాసం, పిల్లి కూతలు వంటివి కనిపిస్తాయి. అస్తమా తీవ్రమయితే శ్వాసలో ఇబ్బందిగా మారి పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుంది.

సైన సైటిస్ : ముక్కుకు ఇరువైపులా నుదుటి పైన ఉన్న సైనస్ గదులలో చీము ఏర్పడుతుంది. అలర్జీ వల్ల ఈ సైనస్ గదులలో నొప్పి తీవ్రమయిన తల బరువు, ముక్కులు మూసుకుపోవడం, కండ్ల మధ్య , బుగ్గల పైన నొప్పి, తరచుగా జలుబు చేయడం గురక రావడం జరుగుతుంది. తరువాత ముక్కులో పాలిప్స్ లాగా వచ్చి శ్వాసకు ఇబ్బంది అవుతుంది. ముక్కు దూలం వంకరగా ఉండటం కూడా ఒక కారణమే.

హోమియో చికిత్స : అలర్జీ వ్యాధులకు నివారణ, చికిత్సా పద్ధతులను ప్రారంభించే మందు అలర్జీ రావడానికి గల కారణాలను పరిశీలించాలి. దీర్ఘకాలిక వ్యాధులు సమూలంగా తొలగిపోవాలంటే సమయం ఎక్కువ పడుతుంది. పూర్తి చికిత్స కాలం మందులు వాడితే అలర్జీ సమస్యను సులభంగా తగ్గించుకొవచ్చు. అలర్జీ సమస్యకు చాలా మంది హిస్టామైన్స్ , డికంజేస్టెంట్స్, స్టెరాయిడ్స్, ఇన్ హేలర్స్వాడుతారు. దీని వల్ల తాత్కాలిక ఉప శమనం లభించినా వ్యాధి పూర్తిగా తగ్గదు. హోమియో మందుల వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడి వ్యాధి నిర్మూలన వేగంగా జరుగుతుంది. పైగా ఈ మందుల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. శస్త్ర చికిత్స తో కొంత వరకు ప్రయోజనం ఉన్నా మూల కారణాన్ని గుర్తించకపోతే అలర్జీ సమస్య జీవితాంతం వేదిస్తూనే ఉంటుంది. అలర్జీని సమూలంగా నిర్మూలించాలంటే అనుభవ జ్ఞులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి.

డాక్టర్ మధు వారణాశి, ఎండి.
ప్రముఖ హోమియో వైద్యులు
ప్లాట్ నంబర్ 188, వివేకానందనగర్ కాలనీ,
కూకట్ పల్లి, హైదరాబాద్
ఫోన్ నంబర్లు : 8897331110,
8886509509

సీఎంఆర్ సెట్ కళాశాల డీన్ ఫాతిమా మేరీకి వీడ్కోలు

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో 15 ఏండ్లుగా విధులు నిర్వహించి, విశిష్ట సేవలందించిన కళాశాల డీన్ ఎఫ్ఎస్ఎ, డా బి. ఫాతిమా మేరీ పదవి విరమణ సందర్భంగా కళాశాల సీఈవో అభినేష్ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏండ్లుగా కళాశాల విద్యార్థులకు, కళాశాల అభ్యున్నతికి విశిష్ట సేవలు అందించిన మీ సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని కొనియాడారు. తమతో పాటు విధులు నిర్వహించిన హెచ్ఓడి, ప్రిన్సిపాల్, డీన్స్ స్టాఫ్ మెంబర్స్ పుష్పగుచ్చం అందించి సన్మానించారు.

అంబేద్కర్ భవనానికి మంత్రి శంకుస్థాపన

నవతెలంగాణ-శామీర్‌పేట



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేద్కర్ భవనానికి శుక్రవారం కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ దర్గ దయాకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయి బాబు, జెట్పీటీసీ అనిత లాలయ్య, శామీర్ పేట్ మండల కో-ఆప్షన్ జహీర్, శామీర్‌పేట్ మండల రైతు బంధు అధ్యక్షులు కంతం కృష్ణారెడ్డి, శామీర్‌పేట్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు విలసాగరం సుదర్శన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలకు వ్యతిరేకంగా కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్‌లో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోల లక్ష్మి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, మేడ్చల్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి, టీపీసీసీ సెక్రెటరీ బండారి నవీన్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సామాన్యుడు కొనలేనంతగా కూరగాయల ధరలు పెరిగిపోయాయన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. నిరుపేద కుటుంబాలు మాత్రమే కాకుండా చిరుద్యోగులు ప్రైవేటు కొలువులు చేసే మధ్య తరగతి ప్రజలకు ధరలు భారంగా మారాయన్నారు. కిలో రూ.30 ఉన్న టమాట రూ.100 దాటిందనీ, పచ్చి మిర్చి కిలో రూ.40 ఉండగా.. ప్రస్తుతం రూ.150 అయ్యిందన్నారు. అల్లం రూ.300, వెల్లుల్లి రూ.200 ఉన్నాయని తెలిపారు. దీంతో ఏంకొనాలో, ఎంతినాలో తెలియని పరిస్థితుల్లో జనం ఉన్నారన్నారు. పెరిగిన కూరగాయల ధరలతో జనం బతుకులు అల్లకల్లోలమవుతుంటే ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, కుత్బుల్లాపూర్ ఏ బ్లాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి దేవి, బాలానగర్ డివిజన్ అధ్యక్షురాలు రేణుక, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షురాలు రజిత, మూసాపేట్ డివిజన్ అధ్యక్షురాలు జోజోమ్మ, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షురాలు కృష్ణవేణి, వరలక్ష్మి, అచ్చమ్మ, ఫాతిమా, అమ్మాజీ, తార, కౌసల్య, సాయి భారతి, సీమలత, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్, మధు మోహన్, జావేద్ అలీశేఖర్ గజానంద్, హేమంత్, ప్రదీప్ సింగ్ సిద్ధు, రుషియాదవ్, భరత్, వినోద్ పాల్గొన్నారు.



అందరికీ అందుబాటులో మన హాస్పిటల్





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని మన హాస్పిటల్ సామాన్యులకు అందుబాటులో ఉండే రుసుంతో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ 15 ఏండ్లుగా కూకట్‌పల్లి పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో అనారోగ్యానికి గురైన వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతుంది. డాక్టర్స్ డే పురస్కరించుకుని డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో డాక్టర్ శశికాంత్‌తో సుమన హాస్పిటల్ ద్వారా ప్రజలకు చికిత్స అందిస్తూ 2017లో మన హాస్పిటల్ ప్రారంభించి డాక్టర్ శశికాంత్, డయాబెటిక్, జనరల్ ఫిజిషియన్‌గా సేవలందిస్తున్నారనీ, అందులో వైరల్ ఫీవర్స్, డెంగ్యూ లాంటి వ్యాధులకు చికిత్స చేస్తుంటారనీ, తను ఊపిరితిత్తులు, ఆస్తమా, అలర్జీ, న్యుమోనియా వంటి వ్యాధులతో పాటు, కోవిడ్ సమయంలో కోవిడ్ పేషంట్లకు చికిత్స అందించారు. ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సలు బ్రాంకో స్కోపి, తెర్కో స్కోపి తో పాటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేసే ఈ బస్ వంటి శస్త్ర చికిత్సలు సైతం మన హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నారు. అందరికీ అందుబాటులో ప్లాంటేషన్ శస్త్ర చికిత్స, ఆర్థోపెడిక్ డాక్టర్ స్వరూప్ చంద్ర, డాక్టర్ పవన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్‌లు అందుబాటులో ఉంటారు. అపెండిక్స్, కిడ్నీ స్టోన్ వంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తూ సామాన్యులకు అందుబాటులో ఉండే వైద్య ఖర్చులతో వైద్య సేవలందిస్తున్నామని డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు.

చెట్లను నరికిన వారిపై కేసు నమోదు



- రూ.20వేలు జరిమానా విధించిన అటవిశాఖ అధికారులు

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు కేవి రెడ్డి నగర్ లో అనుమతులకు విరుద్ధంగా చెట్లను నరికి వేసిన వ్యక్తులపై పెట్ బషీరాబాద్ పోలీసులు వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయగా అటవీ శాఖ అధికారులు జరిమానా విధించారు. మున్సిపల్ పరిధిలో చెట్లను నరికి వేసిన ఘటనను ట్విట్టర్ ద్వారా ఇటీవల పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు అంతెం విల్లాస్ సంక్షేమ సంఘం వారు ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందిచన మంత్రి వారి ఆదేశాల మేరకు అటవీశాఖ అధికారులు రూ.20వేలు జరిమానా విధించిగా పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కె.వి రెడ్డి నగర్ లో నదీమ్ పాషా, అజయ్ దేవ్, బాలాజీ అనే వ్యక్తులు ఈనెల 21,24 తేదీల్లో 32 చెట్లను నరికివేశారు. ఈ విషయమై అక్కడ ఉన్న అంతెం సంక్షేమ సంఘం సభ్యులు వారిని ప్రశ్నించగా చెట్లను నరికివేసేందుకు అనుమతి ఉందని పత్రాలు చూపించారు. నదీమ్ ఐదు చెట్లు, అజయ్ దేవ్ నాలుగు చెట్లు నరికి వేసేందుకు రెసిడెన్షియల్ అడ్రస్‌తో అటవీ శాఖ నుంచి అనుమతులు పొందారు. అయితే మీరు అనుమతి తీసుకున్న 9 చెట్లకు అదనంగా మరో 21 చెట్లు మొత్తం 32 చెట్లను ఇష్టానుసారంగా నరికి వేశారు.ఈ ఘటన గురువారం సోషల్ మీడియాలో వార్తలు రావడంతో పూర్తి విషయం వెలుగులోకి వచ్చింది.

మెరిట్ లిస్ట్ ఆన్‌లైన్, ఎమ్మార్సీ కేంద్రాల్లో ప్రదర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలోని ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, సిస్టం అనలిస్టు, అసిస్టెంట్ ప్రోగామర్స్, ఐఈఆర్పీ ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం 2019 నోటిఫికేషన్ ఇచ్చి డిసెంబర్‌లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఆన్‌లైన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అర్హత పొందిన అభ్యర్థులకు, ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో గల ఖాళీలకు రోస్టర్ కం మెరిట్ ఆధారంగా పూర్తి కాంట్రాక్టు పద్ధతిలో నియామకం జరపడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేసిందనీ, ఇందుకు మెరిట్ లిస్టు మండల రీసోర్స్ కేంద్రాలు, జిల్లా కార్యాలయంతో పాటు వెబ్‌సైట్‌లో ప్రదర్శించినట్టు హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 3వ తేదీన అభ్యర్థుల ప్రొవిజన్ సీనియారిటీ లిస్టు జిల్లా కార్యాలయంతో పాటు ఎమ్మార్సీ సెంటర్లలో ప్రదర్శించనున్నట్టు ఆమె తెలిపారు.

పార్టీ ఏ పదవి ఇచ్చినా ప్రజా సేవలో ముందుంటా

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలకు 35 ఏండ్ల నుంచి సుపరిచితులు సురభి రవీందర్‌రావు. విద్యా వేత్తగా, స్కూల్ కరస్పాండెంట్, లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లో ముందుండి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. నేడు ఆయన జన్మదిరం సందర్భంగా మాట్లాడారు. విద్యావేత్తగా ఎస్ఎస్‌డి గ్రామర్ హై స్కూల్ కరస్పాండెంట్, లయన్స్ ఇంటర్ నేషనల్ సభ్యులుగా, సంఘ సేవకునిగా, సమాజానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. 1981 నుంచి కార్మిక సంఘం అధ్యక్షులుగా ఉన్న టైగర్ ఆలె నరేంద్ర ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ స్థాయి నుంచి ఉపాధ్యక్షుడి స్థాయి వరకు పని చేసానని తెలిపారు. 1993లో ఆల్విన్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో పోటీచేసి కార్మికుల సహాయ సహకారాలతో అత్యధిక మెజార్టీతో గెలుపొందానని తెలిపారు. ఐదేండ్లు ఎలాంటి లాభాపేక్ష లేకుండా కార్మికులకు సేవలు అందిచానని తెలిపారు.1996 నుంచి హెచ్ఎంఎస్ నాయకులు నాయిని నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో పనిచేసి, వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించే దిశగా తన పాత్ర పోషించానని పేర్కొన్నారు. 1988లో ఆల్విన్ కాలనీలో ప్రథమ బీజేపీ అధ్యక్షనిగా పనిచేసి అనేక మందికి రేషన్ కార్డు ఇప్పించినట్టు తెలిపారు. ఆల్విన్ కాలనీ ఫెస్ వన్ లో దీనదయాల్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించడానికి సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలిపారు. బీఎంఎస్ యూనియన్లో ఉపాధ్యక్షులుగా ఉన్నట్టు తెలిపారు. వివేకానంద నగర్ కాలనీ నుంచి ఆల్విన్ కాలనికి మధ్యలో నీటి కాలువ ఉండటం వల్ల కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న సమయంలో, బ్రిడ్జ్ నిర్మాణం కోసం అలె వరేంద్ర కార్మిక సంఘం అధ్యక్షులుగా ఉన్న సమయంలో, తాను ఉపాధ్యక్షుని హూదాలో ఉన్నందున నరేంద్ర సహకారంతో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే ఖర్చును కార్మికులతో చర్చించి మేనేజ్ మెంట్ ని ఒప్పించి కాలనీలో ఇండ్లున్న ఒక్కో కార్మికుల పీఎఫ్ నుంచి ఒక్కోక్కరి ద్వారా రూ.425 వెచ్చించి బ్రిడ్జ్ నిర్మాణం జరిపేందుకు కృషి చేసామని గుర్తు చేశారు. 2001 నుంచి 2017 వరకు పాయినగర్ ఆల్విన్ కాలనీ పరిధిలోని రాఘవేంద్ర నగర్ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మ) లో ఉపాధ్యక్షునిగా ఆరేండ్లు పనిచేసి ప్రస్తుతం సలహాదారుగా సేవలందిస్తున్నానని తెలిపారు. మేడ్చల్ జిల్లా జిల్లాస్థాయి ప్రయివేట్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలపై 30వేల మంది టీచర్స్‌తో బహిరంగ సభ నిర్వహించామని తెలిపారు. సమాజంలో బీదవారికి సేవ చేయాలనే ఆలోచనతో 2007లో లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనలో మెంబర్‌గా చేరి క్లబ్ అధ్యక్షునిగా, జోన్ చైర్మన్‌గా, రీజియన్ చైర్మన్‌గా పని చేసినట్టు తెలిపారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి బీజేపీ గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి కార్పొరేటర్ అభ్యర్థిగా నిలబెట్టినట్టు తెలిపారు. తక్కువ ఓట్లతో ఓడిపోవడం, అయినప్పటికీ పార్టీ తనను గుర్తించి కార్యవర్గ సభ్యులుగా యమించడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ నియోజకవర్గ స్థాయిలో ఎలాంటి పదవి ఇచ్చి పని చేయమని చెప్పినా ప్రజా సేవ కోసం ఎప్పుడూ ముందుంటానని తెలిపారు.

ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లిలోని రాందేవ్ రావు హాస్పిటల్ వైద్యుడికి అపూర్వ గౌరవం దక్కింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ఐఎస్‌సిసిఎం) నూతన అధ్యక్షుడిగా కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆస్పత్రిలో చీఫ్ ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ సామవేదం ఎన్నికయ్యారు. ముంబాయిలో ఉన్న ఐఎస్‌సిసిఎం ప్రధాన కార్యాలయంలో సుమారు 14వేల మంది డాక్టర్‌లు సభ్యులుగా ఉన్నారు. ఈ సోసైటీ ద్వారా వైద్యులు, నర్సులు, శాసకోశ నిపుణులకు క్రిటికల్ కేర్ విభాగంలో శిక్షణా తరగతులను ఇస్తారు ఈ సోసైటీకి అధ్యక్షుడిగా 20 ఏండ్ల తర్వాత దక్షణ భారతదేశానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ సామవేదం ఎన్నికయ్యారు. ఈయన క్రిటికల్ కేర్ విభాగంలో 23 ఏండ్లకు పైబడి అనుభవం కలిగి ఉన్నారు. ఈయన తన వైద్య వృత్తిలో మన దేశంతో పాటు విదేశాల్లో అత్యుత్తమ కేంద్రాల్లో శిక్షణ పొందారు. నగరంలోని రాందేవ్ రావ్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ సామవేదం అత్యుత్తమ పదవి లభించడం పట్ల ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-దుండిగల్



మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశం విద్యార్థుల ఆటపాటల కేరింతల మధ్య జూనియర్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మూడేండ్లుగా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ కలిసి ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంతోషంతో వీడ్కోలు తెలిపారు. సీనియర్ విద్యార్థులు మాట్లాడుతూ తమ అనుభవాలను తెలుపుతూ ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. తమ కళాశాల అనుభవాలను జూనియర్ విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.లోకనాథం మాట్లాడుతూ జీవితంలో అత్యున్నత స్థితికి ఎదగాలంటే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యసాధన దిశగా పట్టుదలతో సాధించాలన్నారు. ప్రతి ఒక్కరితో సమాజ హితంగా మెలగాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొ.టీ.ఎల్ రామదాసు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇంజినీర్లుగా తయారు కావాలన్నారు. విద్యార్థులు వారి తల్లితండ్రులు పెట్టుకున్న లక్ష్య సాధనలో ఉన్నత స్థానం అధిరోహించాలనీ, అభివృద్ధి పథంలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులందరూ కలిసి తమ అనుభవాలను ఒకరికి ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో డ్రయినేజీ కుంగిపోయిందని కాలనీవాసులు చెప్పడంతో ఘటనా స్థలానికి వెళ్లి స్థలాన్ని పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకోవాలనీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పని పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, బ్రిజేష్, రమేష్, సురేష్, వినయ్ కుమార్, తివారి, నవల్ కుమార్ తివారి, మధుసూదన్, సౌరభ్ చౌదరి, అనిల్ పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



తొట్టెల, అంబారీ ఊరేగింపు ఏర్పాట్ల పర్యవేక్షణ

తొట్టెల, అంబారీ ఊరేగింపు ఏర్పాట్ల పర్యవేక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ మహంకాళి ఆలయం నుంచి నటరాజ్ నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం వరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తొట్టెల, అంబారీ ఊరేగింపు ఏర్పాట్ల గురించి పర్యవేక్షించారు. ఇందులో పోలీస్ డిపార్ట్ మెంట్, జీహెచ్ఎంసీకి చెందిన అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ సౌత్ జోన్ డీసీపీ కిరణ్ కర్రె ప్రభాకర్, గోషామహల్ కుల్సుంపుర ఏసీపీ సతీష్ కుమార్, కుల్సుంపుర సీఐ అశోక్ కుమార్, టప్పాచబుత్ర సీఐ శ్రీనివాస్ తో పాటు ఆలయ కమిటీ అధ్యక్షులు ప్యాటా నంద కిశోర్, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, సలహాదారులు బుర్రా వేణు కుమార్, కట్ట నర్సింగ్‌రావు, ఆవుశెట్టి శ్యాం సుందర్, గాండ్ల నిరంజన్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు దోర్తుల శ్రీనివాస్, గుడుమని చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్, పార్కు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు వినాయకనగర్ కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బత్తుల ప్రియాంక మధుకర్ యాదవ్‌తో కలిసి ఓపెన్ జిమ్, పార్కు ఏర్పాటుకు రూ.20లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఆహ్లాదకరకరమైన వాతావరణం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కౌన్సిలర్ బత్తుల ప్రియాంక మధుకర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి గెలిపించిన వార్డు ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహా రెడ్డి, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు బత్తుల మధుకర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, పురం ఆంజనేయులు, పాండు, ప్రభాకర్ రెడ్డి, నాగ భూషణం, పాష, తదితరులు పాల్గొన్నారు.



మాదిగ జర్నలిస్ట్ ఫోరం (ఎంజేఎఫ్) మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షునిగా మేడ్చల్ మండల ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు బద్ధ నవీన్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ నాయకుడు రంజిత్ ముదిరాజ్, బీజేపీ మండల కార్యదర్శి కంచుగంట మహేష్, బీఆర్ఎస్ కొంతన్‌పల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ పటేల్, సుధాకర్ గౌడ్, తుడుం రాజు, తుడుం సల్మాన్ రాజు పాల్గొన్నారు. నవతెలంగాణ-మేడ్చల్

పార్కును సుందరవనంగా తీర్చిదిద్దుతున్నాం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



పార్కును అన్ని హంగులతో సకల సౌకర్యాలతో ఎక్కడా లేని విధంగా సుందర వనంగా తీర్చిదిద్దుతున్నామని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని 9వ ఫేజ్‌లో గల రెండున్నర ఎకరాల పార్కు కంపౌండ్ వాల్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీతో తిరిగి మళ్ళీ ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావును గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళ దైవికం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

చరిత్రపూర్వ యుగాల నుంచి ఆధునిక కాలం వరకు, వైద్యం చేసే కళను దైవికంగా పరిగణిస్తారు. దైవత్వం ప్రభతో కనిపించే వైద్యుడు. పురాతన షమన్ నుంచి ఆధునిక వైద్యుల వరకు, వారు దేవుళ్ల కంటే తక్కువ కాదు అని రీజినల్ మెడికల్ డైరెక్టర్, మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాల్టీ ఐ హాస్పిటల్ డాక్టర్ శిభు వర్కీ అన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా కొన్ని విషయాలను పంచుకున్నారు. శతాబ్దాలుగా వైద్య అభ్యాసం మార్పుల సముద్రానికి గురైంది. మూఢ నమ్మకాలతో కప్పబడిన నకిలీ శాస్త్రం నుంచి నిరంతర అభ్యాసం, విచారణ, ఆవిష్కరణ స్ఫూర్తితో స్వచ్ఛమైన శాస్త్రంగా అభివృద్ధి చెందినట్టు తెలిపారు. వైద్యం చేసే కళ చాలా వరకు మిగిలిపోయిందని తెలిపారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని తన నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మేడ్చల్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని ప్రతిభ, 2020- 21 సంవత్సరంలో 10వ తరగతిలో 10/10 సాధించిన సాయికీర్తి అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ లోను తన ప్రతిభతో తెలంగాణలో 3వ ర్యాంకు సాధించింది. అలాగే 2023-24 సంవత్సరంకు గాను ఆల్ ఇండియా లెవెల్ లో జరిగిన నీట్ పరీక్షలో మంచి ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ లార్డు రత్నం, ఉపాధ్యాయులు సాయికీర్తిని సన్మానించారు. ఈ సందర్భంగా తన ప్రతిభతో ఉన్నత చదువులు చదివి మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదించారు. నవతెలంగాణ-మేడ్చల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శుక్రవారం శంభీపూర్ కార్యాలయంలో నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన అనివేణి రమేష్ నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్



ఆస్తమా అంతం... కాలుష్య నివారణతోనే సాధ్యం

శ్వాస ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ ఆస్తమా వైద్య నిపుణులు డాక్టర్ వీరపనేని విష్ణున్ రావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రస్తుత సమాజంలో ఆస్తమా వ్యాధికి కాలుష్యమే అత్యధికంగా కారణమవుతుందని శ్వాస ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ ఆస్తమా వైద్య నిపుణులు డాక్టర్ వీరపనేని విష్ణున్ రావు అన్నారు.సింహ భాగం ఆస్తమా పిల్లల్లో మొదలవుతుందని, జీన్స్ లో లేని వారికి కూడా ఆస్తమా వ్యాపించడానికి కాలుష్యమే ప్రధాన కారణమవుతుందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం కారణంగా ప్రతి ఏడాది 70 లక్షల మంది మృతి చెందుతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కలు చెబుతుందని గుర్తు చేశారు.ఆస్తమా వ్యాధికి ఇండోర్, అవుట్ డోర్ కాలుష్యాలే కారణమవుతున్నాయన్నారు.కాలుష్యాన్ని కంట్రోల్ చేసే మూల కారణాలను అన్వేషించవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.అందుకోసమే జాతీయ స్థాయి సేవా సంస్థల సహకారంతో రాష్ట్రంలో శ్వాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ క్లబ్ ను ఏర్పాటు చేసి 'డాక్టర్స్ ఫర్ క్లీన్ ఎయిర్' ఉద్యమాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఆస్తమా వ్యాధికి అడ్రస్ గా మారే కాలుష్యానికి ఇంట్లో అనుసరించే విధానాలే కారణమవుతున్నాయని, ఇంట్లో దేవుళ్ళ వద్ద వెలిగించే అగరవత్తులు, సాంబ్రాణి పొగలు, కర్పూరం బిల్లల నుంచి వెలువడే వాయువుల కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అత్యధికంగా వ్యాపిస్తాయన్నారు.అలాగే బాత్రూముల్లో, వంట గదుల్లో సువాసనల కోసం ఏసీ, కూలర్లలో కలిపే కెమికల్స్ తో ఆస్తమా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

స్టాక్ మార్కెట్ల మెరుపులు

- సెన్సెక్స్ 800 పాయింట్ల పరుగు



ముంబయి: కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు పరుగులు పెడుతున్నాయి. మూడు రోజుల వరుస లాభాలతో సెన్సెక్స్, నిఫ్టీలు నూతన గరిష్టాలను చేరాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 803 పాయింట్లు పెరిగి 64,718.56కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 216.95 పాయింట్ల లాభంతో 19,189.05 వద్ద ముగి సింది. మూడు సెషన్లలో సెన్సెక్స్ 1800 పాయింట్ల మేర పెరిగింది. వారాంతం సెషన్‌లో సెన్సెక్స్-30లో ఎన్‌టిపిసి, ఐసిఐసిఐ బ్యాంక్ మినహా మిగితా స్టాక్స్ అన్నీ లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఇండస్ఇండ్ బ్యాంక్, సన్ ఫార్మా, టిసిఎస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. విదేశీ మదుపర్ల కొనుగోళ్ల మద్దతు ప్రధానంగా భారత మార్కెట్లకు కలిసివచ్చింది. గత కొంతకాలంగా దేశీయ మార్కెట్లలో విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 10 బిలియన్ల ఎఫ్ఐఐలు వచ్చాయని అంచనా. అంతర్జాతీయంగా ఇతర ఆసియన్ మార్కెట్లు కూడా రాణించాయి.

కీలక రంగాల మందగమనం

- మేలో 4.3 శాతానికి తగ్గిన వృద్ధి



న్యూఢిల్లీ : మౌలిక వసతుల రంగంలో అత్యంత కీలకమైన ఎనిమిది రంగాల వృద్ధి మందగించింది. ముడి చమురు, సహజ వాయువు, విద్యుత్ రంగాల ఉత్పత్తి తగ్గడంతో ప్రస్తుత ఏడాది మేలో కీలక రంగాల వృద్ధి 4.3 శాతానికి పరిమితమై.. ఆరు మాసాల కనిష్టాయికి పడిపోయింది. 2022 మేలో ఈ రంగాలు రికార్డ్ స్థాయిలో 19.3 శాతం పెరుగుదలను సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి మేతో కాలంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 4.3 శాతానికి పడిపోగా.. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఈ రంగాలు ఏకంగా 14.3 శాతం వృద్ధిని కనబర్చాయి. గడిచిన మేలో సిమెంట్, ఎరువులు, స్టీల్, రిఫైనరీ ఉత్పత్తులు వరుసగా వృద్ధిని నమోదు చేశాయి. 2022 మేతో పోల్చితే గడిచిన మే మాసంలో బొగ్గు ఉత్పత్తిలో 7.2 శాతం, ఎరువులు, స్టీల్, సిమెంట్, పెట్రోలియం ఉత్పత్తులు వరుసగా 9.7 శాతం, 9.2 శాతం, 15.5 శాతం, 2.8 శాతం చొప్పున వృద్ధిని కనబర్చాయి. మరోవైపు ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి వరుసగా 1.9 శాతం, 0.3 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం కూడా 0.3 శాతానికి దిగజారింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ ఎనిమిది రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

సామ్‌సంగ్ నుంచి కొత్త గేమింగ్ మానిటర్

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ నూతన గేమింగ్ అనుభవాల కోసం ఒడిస్సెయ్ ఒఎల్ఇడి జి9 గేమింగ్ మానిటర్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఇందులోని ఫ్రీసింక్, ఎఎండి ఫ్రీసింక్ ప్రీమియం ప్రో, గేమింగ్ హబ్ ఫీచర్లు గేమింగ్ అనుభవాన్ని పెంచనున్నాయని పేర్కొంది. నియో క్వాంటమ్ ప్రాసెసర్ ప్రో అత్యంత ఆధునిక గేమింగ్, సినిమా వంటి అనుభవాన్ని అందిస్తోందని తెలిపింది. దీని ధరను రూ.1,99,999గా నిర్ణయించింది.

గ్లోబల్ సంస్థల సరసన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

ముంబయి: గ్లోబల్ దిగ్గజ బ్యాంక్‌ల సరసన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ చేరనుంది. హెచ్‌డిఎఫ్‌సిని విలీనం చేసుకున్న తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అమెరికా, చైనాకు చెందిన దిగ్గజ బ్యాంకుల సరసన చేరనుందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. జులై 1న వీటి విలీనం పూర్తి కానుంది. అనంతరం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ విలువ 172 బిలియన్ డాలర్లకు పెరగనుంది. దీంతో జెపి మోర్గాన్ ఛేజ్, ఇండస్ట్రీయల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ అమెరికా తర్వాత స్థానంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నిలువనుంది. విలీనం అనంతరం 12 కోట్ల ఖాతాదారులతో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. బ్యాంకు శాఖల సంఖ్య 8,300కు, ఉద్యోగుల సంఖ్య 1.77 లక్షలుగా ఉండనుంది.

చిన్న మొత్తాలపై స్వల్పంగా వడ్డీ రేట్ల పెంపు



హైదరాబాద్: చిన్న మొత్తాలపై వడ్డీ రేట్లను స్వల్పంగా పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగియనున్న త్రైమాసికానికి గాను చిన్న మొత్తాలపై వడ్డీ రేట్లను సవరించింది. ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ల (ఆర్‌డి)పై గరిష్టంగా 0.3 శాతం మేర పెంచింది. కాగా.. పిపిఎఫ్, సుకన్య సమృద్ధి యోచన లాంటి కీలక పథకాలపై వడ్డీ రేట్లను పెంచకపోవడం గమనార్హం. పోస్టు ఆఫీసుల్లో అందించే ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 6.2 శాతం నుంచి 6.5 శాతానికి పెరిగింది. ఏడాది కాలావధి కలిగిన టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 0.1 శాతం పెంచడంతో 6.9 శాతానికి చేరింది. రెండేళ్ల టర్మ్ డిపాజిట్‌పైనా 0.1 శాతం వడ్డీ పెంచారు. దీంతో వడ్డీ రేటు 7 శాతానికి పెరిగింది. మూడేళ్ల, ఐదేళ్ల కాలపరిమితి డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ రేట్లను మార్చలేదు. నేషనల్ సేవింగ్స్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి తదితర ఇతర పథకాల వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

పాకిస్తాన్‌కు 300కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ రుణం

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించేందుకై ఆ దేశంతో 300కోట్ల డాలర్ల మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. స్టాండ్ బై అరెంజ్‌మెంట్ (ఎస్‌బిఎ) ద్వారా మద్దతివ్వగలిగే విధానాలపై సిబ్బంది స్థాయిలో ఒప్పందం కుదిరినట్లు ఐఎంఎఫ్, పాక్ అధికారులు తెలిపారు. దాదాపు 300కోట్ల డాలర్ల మొత్తానికి 9మాసాల ఎస్‌బిఎపై కుదిరిన సిబ్బంది స్థాయి ఒప్పందాన్ని జులై మధ్యలో ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించాల్సి వుందని ఒక ప్రకటనలో ఐఎంఎఫ్ తెలిపింది. ఈ కొత్త స్టాండ్ బై అరెంజ్‌మెంట్ వల్ల అధికారులు తక్షణమే ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించే చర్యలు చేపట్టడానికి వీలవుతుందని ఆ ప్రకటన తెలిపింది. ద్వైపాక్షిక, బహుళ పక్ష భాగస్వాముల నుండి ఆర్థిక సాయం పొందడానికి ఒక చట్రపరిధిని రూపొందించడం, సూక్ష్మ ఆర్థిక సుస్థిరతను పరిరక్షించడం ఇందులో భాగంగా వుంటాయి. కొత్త ఎస్‌బిఎతో, దేశీయ రెవిన్యూ వసూళ్ళను మెరుగుపరచడం ద్వారా సామాజిక, అభివృద్ధి వ్యయానికి మరింతగా స్థానం కల్పించబడుతుందని పేర్కొంది.

ఢిల్లీ ఆర్డినెన్స్‌పై సుప్రీంలో ఆప్ పిటీషన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని ఆమాద్మీ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో శుక్రవారం సవాలు చేసింది. ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగవిరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 239 ఎఎ ప్రకారం ఎన్నికైన ప్రభుత్వానికి ఉన్న అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు చెందేలా ఎలాంటి సవరణ చేయరాదని పిటిషన్‌లో ఆప్ పేర్కొంది. దేశరాజధానిలోని ఐఎఎస్, డిఎఎన్ఐసిఎస్ అధికారుల బదిలీలు, నియామకాల అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు వర్తింపజేస్తూ మే 19న కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ కేంద్రం ఈ ఆర్డినెన్స్ తెచ్చిందని పిటీషన్‌లో ఆప్ ఆరోపించింది. సుప్రీంకోర్టు ఇటీవల తీర్పులో పోలీసులు, ప్రజాభద్రత, భూములు మినహా మిగిలిన అన్ని సర్వీసులను ఎన్నికైన ప్రభుత్వానికి అప్పగించాలంటూ ఆదేశాలిచ్చింది. అయితే ఈ తీర్పు ఇచ్చిన వారానికే కేంద్రం ఈ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. పార్లమెంటులో ఈ ఆర్డినెన్స్ చట్టరూపం దాల్చకుండా చేయాలని ఆప్ ప్రయత్నం చేస్తుంది.

అనకాపల్లి ఫార్మా కంపెనీలో పేలుడు

ఇద్దరు కార్మికుల దుర్మరణం

- ఐదుగురి కార్మికులకు గాయాలు
- వారిలో నలుగురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా యూనిట్1లో శుక్రవారం ఉదయం రియాక్టర్ పేలిన ఘటనలో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన 28 మంది కార్మికులూ పరుగున బయటకు రావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. క్షతగాత్రులు విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తోటి కార్మికుల కథనం ప్రకారం... సాహితీ ఫార్మాలో షిఫ్ట్‌లో 35 మంది పనిచేస్తున్నారు. సాల్వెంట్ లోడింగ్ సందర్భంగా ప్రొడక్షన్ బ్లాక్ వద్ద రియాక్టర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో మంటలు వ్యాపించాయి. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఏడుగురు మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జంగాలపాలేనికి చెందిన పైలా సత్తిబాబు (35), విజయనగరం జిల్లాకు చెందిన ఉప్పాడ తిరుపతిరావు (38)లను విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వారు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వారిలో నలుగురిని కిమ్స్ ఆస్పత్రికి, ఒకరిని అచ్యుతాపురంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తొలుత తీసుకెళ్లారు. ఆ తర్వాత వారి ఐదుగురిని కూడా విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. వారిలో భువనేశ్వర్‌కు చెందిన రామేశ్వర్, అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం రేబాకకు చెందిన సాగిరెడ్డి రాజబాబు, నక్కపల్లికి చెందిన శంబంగి అప్పారావు, పంచదార్లకు చెందిన సింగంశెట్టి నూకినాయుడు పరిస్థితి విషమంగా ఉంది. కొండకొప్పాకకు చెందిన తిరుపతిరావు ఐసియులో చికిత్స పొందుతున్నారు. వారిని కెజిహెచ్‌లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియోను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

భయాందోళనలో స్థానికులు

సాహితీ ఫార్మాలో పేలుడుతో వ్యాపించిన మంటలు, పొగతో సమీప పరిశ్రమల కార్మికులు, లాలం కోడూరు, పూడిమడక గ్రామల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసినా అదుపులోకి రాలేదు. ఒక్కో రియాక్టర్ దశలు దశలుగా పేలుతుండడంతో సమీప ప్రాంతానికి వెళ్లి మంటలు నియంత్రించడం అగ్నిమాపక సిబ్బందికి సాధ్యం కాలేదు. ఈ క్రమంలోనే ఫైర్ నియంత్రణలో భాగంగా ట్యాంకు వాల్వ్ మూసివేయడానికి చేస్తున్న ప్రయత్నంలో అగ్నిమాపక సిబ్బంది నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ, ఆర్‌డిఒ చిన్నికృష్ణ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ప్రమాదంపై విచారణకు కలెక్టర్ ఆదేశం

ఈ ప్రమాదంపై కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి విచారణకు ఆదేశించారు. సమగ్ర విచారణ చేసి నివేదిక ఇచ్చేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో ఎఎస్‌పి, అనకాపల్లి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ, అనకాపల్లి ఆర్‌డిఒతో కమిటీని ఏర్పాటు చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సీపీఐ(ఎం)

సాహితీ ఫార్మాలో పేలుడులో ఇద్దరు కార్మికులు మృతి చెందడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలోని ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని నివారించే చర్యలు చేపట్టకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. పరిశ్రమలు, పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీనియర్ ఐఏఎస్ రాణి కుముదిని పదవీకాలం పొడిగింపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీనియర్ ఐఎఎస్ అధికారిణి, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని పదవీకాలం మరో రెండేండ్లకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం ఆమె పదవీవిరమణ చేయాల్సి ఉండగా...ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో రెండేళ్ల పాటు ఆమె సర్వీసులో కొనసాగనున్నారు.

భారత్‌లో ఎస్‌సిఓ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

బీజింగ్ : వచ్చే వారం భారత్ ఆన్‌లైన్‌లో నిర్వహించే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పాల్గొంటారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియాంగ్ శుక్రవారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు జులై 4న ఎస్‌సిఓ దేశాధినేతల 23వ సమావేశంలో జిన్‌పింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారని, ప్రసంగిస్తారని చునియాంగ్ తెలిపారు. మరో మీడియా సమావేశంలో చైనా విదేశాంగ శాఖ మరో ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ, ఇతర దేశాల నేతలతో కలిసి జిన్‌పింగ్ భవిష్యత్‌లో ఎస్‌సిఓ అభివృద్ధికి కార్యాచరణను రూపొందిస్తారని చెప్పారు. అన్ని పక్షాల సంఘటిత కృషితో ఎస్‌సిఓ మరింత గొప్ప పురోగతిని సాధిస్తుందని, ప్రాంతీయ దేశాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని పెంపొందిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఎస్‌సిఓను ఏర్పాటు చేసినప్పటి నుండి సభ్య దేశాల మధ్య పరస్పర రాజకీయ విశ్వాసం నెలకొనేలా, సత్సంబంధాలు వుండేలా కృషి చేస్తూనే వచ్చిందన్నారు. వివిధరంగాల్లో విస్తృత సహకారం కూడా వుందన్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ వ్యవహారాల్లో కీలకమైన, నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తోందన్నారు. అంతర్జాతీయ అభివృద్ధి చొరవ (జిడిఐ), అంతర్జాతీయ భద్రతా చొరవ (జిఎస్ఐ), అంతర్జాతీయ పౌర చొరవ (జిసిఐ)లపై సభ్య దేశాలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా వున్నామని మావో నింగ్ చెప్పారు.

రష్యాకు ఆప్త మిత్రుడు మోడీ !

పుతిన్ వ్యాఖ్యలు

- మేక్ ఇన్ ఇండియా చొరవకు ప్రశంసలు

మాస్కో : ప్రధాని నరేంద్ర మోడీ రష్యాకు ఆప్త మిత్రుడని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. మోడీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై అద్భుతమైన ప్రభావాన్ని కనబరిచిందని అన్నారు. రష్యా వ్యూహాత్మక చొరవల సంస్థ (ఎఎస్ఐ) నిర్వహించిన కార్యక్రమంలో గురువారం పుతిన్ పై వ్యాఖ్యలు చేశారు. "భారత్‌లో మా మిత్రులు, మా ఆప్త మిత్రుడు, ప్రధాని నరేంద్ర మోడీ కొన్నేళ్ళ క్రితం మేక్ ఇన్ ఇండియా చొరవ చేపట్టారు. భారత ఆర్థిక వ్యవస్థపై ఆ చొరవ అద్భుతమైన ప్రభావాన్ని కనబరిచింది. మనం కాకపోయినా మన స్నేహితులే దాన్ని సృష్టించినా, అది బాగా పనిచేస్తున్నపుడు దాన్ని అనుకరించడంలో ఎలాంటి హానీ వుండదు." అని పుతిన్ వ్యాఖ్యానించినట్లు ఆర్‌టి న్యూస్ పేర్కొంది. పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న ఆంక్షల విధానాల కారణంగా రష్యా కంపెనీలకు భారత్‌లో గల అవకాశాలపై పుతిన్ చర్చించారు. మన కంపెనీలు తమ ఉత్పత్తులను మరింత సమర్ధవంతంగా మార్కెట్ చేసుకోవడానికి సాయపడేలా మాస్కోకు సపోర్ట్ టూల్స్ (మద్దతు సాధనాలను) అందచేయడం ప్రస్తుత అవసరంగా వుందన్నారు.

సెంథిల్‌బాలాజీని మంత్రిగా కొనసాగిస్తాం

తమిళనాడు ప్రభుత్వం స్పష్టీకరణ

చెన్నై : గవర్నర్ ఆర్‌ఎన్ రవి తొలగించిన సెంథిల్ బాలాజీని మంత్రిగా కొనసాగిస్తామని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎలాంటి ఫోర్టుపోలియో లేకుండా సెంథిల్ బాలాజీ మంత్రివర్గంలో ఉంటారని తెలిపింది. సెంథిల్‌బాలాజీని మంత్రి పదవి నుంచి తొలగిస్తూ గవర్నర్ ఆర్ ఎన్ రవి ఇచ్చిన ఉత్తర్వులను 'పట్టించుకోనక్కర్లేదు' అని తమిళనాడు ప్రభుత్వం భావిస్తున్నదని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగమ్ తెన్నరసు శుక్రవారం వెల్లడించారు. తమిళనాడు మంత్రి మండలి నుంచి సెంథిల్ బాలాజీని తక్షణమే తొలగిస్తూ గవర్నర్ ఆర్ ఎన్ రవి నిర్ణయం తీసుకున్నారని గురువారం సాయంత్రం రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గవర్నర్ కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్న ప్రకటించారు. అయినా సెంథిల్ బాలాజీని మంత్రిగా తొలగిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై చెన్నైలోని సెక్రటేరియట్‌లో ఆర్థిక మంత్రి తంగమ్ తెన్నరసు శుక్రవారం విలేకరులకు తెలిపారు.. గవర్నర్ చర్య చట్ట ప్రకారం సమర్థనీయం కాదని అన్నారు. మంత్రి మండలి నుంచి మంత్రులను తొలగించడం లేదా నియమించడం ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేక అధికారమని చెప్పారు. సెంథిల్‌బాలాజీ మంత్రివర్గంలో కొనసాగడం వలన ఈడీ, రాష్ట్ర పోలీసుల విచారణపై ప్రభావం చూపుతుందన్న గవర్నర్ వాదనను తంగమ్ తెన్నరసు కొట్టిపారేశారు. సెంథిల్ బాలాజీ ఇప్పటికే జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. పోర్ట్‌ఫోలియో లేని మంత్రిపై చర్య తీసుకోవడం వెనుక ' రాజకీయ ఉద్దేశాలు' ఉన్నాయని తెన్నరసు అన్నారు. . ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలోని మంత్రులపై 'కనీసం 11 కేసులు' పెండింగ్‌లో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. అయినా వారంతా మోడీ క్యాబినెట్‌లో కొనసాగుతున్నారని ప్రస్తావించారు. అలాగే ముఖ్యమంత్రి తనకు రాసిన లేఖలో 'అసహజమైన భాష'ను ఉపయోగించారని గవర్నర్ చేస్తున్న ఆరోపణలను తెన్నరసు ఖండించారు. స్టాలిన్ చాలా మర్యాదగా ఉండే మనిషని, ఎల్లప్పుడూ గవర్నర్ పదవికి గౌరవం ఇస్తారని చెప్పారు. అలాగే సెంథిల్‌పై న్యాయవిచారణకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని తెన్నరసు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తెన్నరసుతో పాటు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్ రేగుపతి, డిఎంకె ఎంపి (రాజ్యసభ) పి. విల్సన్ కూడా పాల్గొన్నారు.


మౌనమెందుకు?

ప్రధానిని ప్రశ్నించిన ఈశాన్య విద్యార్థుల సంఘం

- హింస వెనక కేంద్రానికి రహస్య అజెండా ఉన్నదని ఆరోపణ
- సీఎం రాజీనామా అంటూ వార్తలు : అలాంటిదేమీ లేదని బీరెన్‌సింగ్ ట్వీట్

ఇంఫాల్ : మణిపూర్‌లో కొనసాగుతున్న హింస విషయంలో ప్రధాని మోడీ మౌనం వహించడాన్ని ఈశాన్య విద్యార్థుల సంస్థ (ఎన్ఈఎస్ఓ) ప్రశ్నించింది. మోడీ తీరును విమర్శించింది. మణిపూర్ హింస వెనకాల కేంద్రానికి ఒక రహస్య అజెండా ఉన్నదని ఆరోపించింది. రాష్ట్రంలో రెండు నెలలుగా అల్లకల్లోల పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ.. ప్రధాని స్పందించకపోవటం పట్ల ఎన్ఈఎస్ఓ చైర్మెన్ శామ్యూల్ జైర్వా ఆశ్చర్యాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఏ విషయం జరిగినా వాటిపై మాట్లాడటానికి క్రియాశీలంగా ఉండే ప్రధాని.. మణిపూర్ విషయంలో మౌనంగా ఉన్నారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనీ, హింసను ఆపడానికి, సమస్యలను పరిష్కరించడానికి క్రియాశీల చర్యలు తీసుకోవాలని జైర్వా.. ప్రధానిని కోరారు. రాష్ట్రంలోని పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. శాంతి కోసం పిలుపునిచ్చారు.

రాజీ'డ్రామా'



జాతి హింసతో తీవ్ర అల్లర్లు చెలరేగిన మణిపూర్‌లో ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టటం లేదు. గతనెల 3 నుంచి మణిపూర్‌లో కొనసాగుతున్న హింసను కట్టడి చేయటంలో సీఎం బీరెన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు విఫలమైంది. ముఖ్యమంత్రిగా ఆయన విఫలమైన తీరుపై సర్వత్రా విమర్శలు కొనసాగుతూ వస్తున్నాయి. బీరెన్‌సింగ్ రాజీనామా చేయాలంటూ నిరసనకారుల నుంచి డిమాండ్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన రాజీనామాపై ఊహాగానాలు వెలువడ్డాయి. అల్లర్లకు బాధ్యత వహిస్తూ బీరెన్‌సింగ్ సీఎం పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వచ్చాయి. రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉకియ్‌ను కలిసి ఆయన రాజీనామా సమర్పించనున్నారని తీవ్ర చర్చ జరిగింది. గవర్నర్‌ను కలవడానికి బీరెన్‌సింగ్ సిద్ధమయ్యారు. గవర్నర్ నివాసానికి 20 మంది ఎమ్మెల్యేలతో కలిసి మధ్యాహ్నం 2 గంటలకు బీరెన్‌సింగ్ బయలుదేరారు. అయితే, సీఎం రాజీనామా చేయొద్దంటూ బీరెన్‌సింగ్ ఇంటి బయట మహిళలు నిరసన చేశారనీ, దీంతో తాము వెనుదిరగాల్సి వచ్చిందని రాష్ట్ర మంత్రి ఒకరు తెలిపారు.

రాజీనామాను పునరాలోచించుకోవాలని బీరెన్ సింగ్‌ను కోరామనీ, రాజీనామా చేయకుండా బీరెన్‌సింగ్‌ను ఒప్పించి ఆ విషయాన్ని బయటకు వచ్చి ప్రజలకు చెప్పామని మంత్రి సపమ్ రంజన్ సింగ్ తెలిపారు. గవర్నర్‌కు సమర్పించాల్సిన రాజీనామా లేఖను నిరసనకారులకు చదివి వినిపించామనీ, దానిని వారు చించేశారని చెప్పారు. ఇటు బీరెన్ సింగ్ కూడా ప్రస్తుత కీలక తరుణంలో తాను రాజీనామా చేయబోనని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. చిరిగిపోయిన సీఎం రాజీనామా లేఖ ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.

సీఎం రాజీనామా అంశం ఒక మైండ్‌గేమ్ అని సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు కొట్టిపారేశారు. మణిపూర్‌లో చోటు చేసుకున్న పరిస్థితుల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే బీజేపీ ఇలా రాజీనామా అంటూ కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. రాజకీయంగా ఆ పార్టీ మైండ్‌గేమ్ ఆడుతున్నదని విమర్శించారు. అల్లర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

గ్రీస్ కార్మికలోకానికి సిఐటియు అభినందనలు

న్యూఢిల్లీ : గ్రీస్ పార్లమెంట్ ఎన్నికల్లో అక్కడి కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ)కి ఓటు వేసినందుకు ఆ దేశ కార్మిక లోకానికి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అభినందనలు తెలిపింది. ఈ నెల 25న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ 7.7 శాతం ఓట్లతో 20 ఎంపి స్థానాలను గెలుచుకుంది. రద్దయిన గత పార్లమెంట్‌లో కెకెఇ కి 15 మంది ఎంపీలు ఉన్నారు. ఎలాంటి పొత్తులు లేకుండా తాజా ఎన్నికల్లో కెకెఇ స్వతంత్రంగా పోటీ చేసింది. గ్రీక్ పార్లమెంట్‌లో మొత్తం స్థానాలు 300 కాగా, భారత పార్లమెంట్‌లో మొత్తం 543 స్థానాలు ఉన్నాయి. ఈ నిష్పత్తి ప్రకారం చూసుకుంటే భారత్ పార్లమెంట్‌లో కమ్యూనిస్టు పార్టీకి 36 స్థానాలు ఉన్నట్లు అని సిఐటియు తెలిపింది.

సిరిసిల్ల టూ న్యూయార్క్

తొలిసారి విదేశాలకు జీపీపీ కంపెనీ ప్రొడక్ట్స్

- పెద్దూరు అపెరల్ పార్క్‌లో ఇంటర్నేషనల్‌బ్రాండ్ కంపెనీ ఉత్పత్తుల తయారీ
- త్వరలోనే టెక్స్‌పోర్ట్ కంపెనీ అల్లికల యూనిట్ ప్రారంభం
- ట్విట్టర్‌లో ప్రజలతో పంచుకున్న మంత్రి కేటీఆర్

రెండు షిఫ్టుల్లో సుమారు 800 మందికి ఉపాధి

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఇంటర్నేషనల్ బ్రాండ్ వస్త్ర ఉత్పత్తులు సిరిసిల్లలో రూపుదిద్దుకుని ముంబయి టూ న్యూయార్క్‌కు ఎక్స్‌పోర్ట్ అవుతున్నాయి. జిల్లా కేంద్ర శివారులోని పెద్దూరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లో ఇండస్ట్రీ నెలకొల్పిన గోకుల్ అపెరియల్ సంస్థ స్థానికంగా 800 మంది మహిళలతో జీపీపీ బ్రాండ్ ఉత్పత్తులను తయారు చేయిస్తోంది. సంస్థ స్థాపించిన కొద్దిరోజుల్లోనే ఉత్పత్తులను న్యూయార్క్‌కు ఎగుమతి చేస్తున్న విషయాన్ని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'మేడ్ ఇన్ ఇండియా' ట్యాగ్‌తో జీపీపీ ఆర్గానిక్ కాటన్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణమని ట్వీట్ చేశారు. మరో అంతర్జాతీయ ఉత్పత్తి సంస్థ టెక్స్‌పోర్టు త్వరలోనే ప్రారంభవుతున్నట్టు తెలిపారు.

అంతర్జాతీయ కంపెనీ అయిన జీపీపీ ఉత్పత్తులు బంగ్లాదేశ్, థాయిలాండ్ వంటి దేశాల నుంచే ఎక్కువగా విదేశాల్లోకి ఎగుమతి అవుతుంటాయి. అలాంటి కంపెనీకి చెందిన ఉత్పత్తులు సిరిసిల్లలోని పెద్దూరు అపెరల్‌పార్క్‌లో తయారై 'మేడ్ ఇన్ ఇండియా' ట్యాగ్‌తో శుక్రవారం ముంబయి నుంచి న్యూయార్క్‌కు ఎగుమతి అయ్యాయి. వస్త్ర పరిశ్రమకు జవసత్వాలు నింపేందుకు రాష్ట్ర సర్కారు ఇప్పటికే సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌కు రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వ ఉత్పత్తులైన బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాక్‌లు, కేసీఆర్ కిట్స్, ఆర్‌వీఎమ్ వస్త్రాల ఆర్డర్లు ఇక్కడి నేతన్నకు ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో వర్కర్ టూ ఓనర్ పథకం కింద పెద్దూర్‌లో అపెరల్, వీవర్ పార్క్‌లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే ఇతర సంస్థలు, పెట్టుబడిదారులు ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న పెద్దూర్‌లో 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.174కోట్లతో అపెరల్ పార్క్‌ను నిర్మించింది. 5వేల వరకు కుట్టుమిషన్ల ఏర్పాటుతో 8వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక్కడ ఇండస్ట్రీని స్థాపించిన 'గోకుల్ అపెరియల్ సంస్థ'కు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) రూ.14.50కోట్లతో షెడ్డును కేటాయిం చింది. ప్రస్తుతం ఆ ఇండస్ట్రీలో 800 మంది మహి ళలు రెండు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ బ్రాండెడ్ కంపెనీతో చేసుకున్న ఒప్పంద ఉత్పత్తులు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. బాక్సుల్లో ప్యాక్ చేసి నేరుగా ఎగుమతి అవుతున్నాయి.మరోవైపు టెక్స్‌పోర్ట్ ఓవర్‌సీస్ కంపెనీ సైతం పెద్దూర్ అపెరల్ పార్క్‌లో ఏర్పాటు అయ్యేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా అల్లికల యూనిట్ రంగంలో ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందు కొచ్చింది. ప్రస్తుతం ఆ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒప్పందం పూర్తయింది. కంపెనీకి అవసర మైన షెడ్డు, ఇతర పనులు కూడా పూర్తి దశకు చేరుకున్నాయి. వచ్చే నెలలో ఆ పనులు పూర్తవనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌కు అభినందనల వెల్లువ

దేశంలోనే మొట్టమొదటిసారి జీపీపీ కంపెనీ ఉత్పత్తులు సిరిసిల్ల నుంచి విదేశాలకు నేరుగా ఎగుమతి కావడాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రజలతో పంచుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నుంచి అంతర్జాతీయ బ్రాండెడ్ ఉత్పత్తులు 'మేడ్ ఇన్ ఇండియా' ట్యాగ్‌తో ఎగుమతి కావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. ఆయన ట్వీట్‌ను చాలా మంది రీ ట్వీట్ చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టిన మరో కంటైనర్
- వంటకోసం తెచ్చుకున్న సిలిండర్ పేలి.. అకస్మాత్తుగా మంటలు
- డ్రైవర్‌తోపాటు, క్లీనర్ సజీవ దహనం
- పుర్రె, మొండెం మాత్రమే మిగిలి.. భయంకరంగా దృశ్యాలు..

నవతెలంగాణ-నార్సింగి

జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఓ కంటైనర్ లారీని వెనుక నుంచి వచ్చిన మరో కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి డ్రైవర్, క్లీనర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోగా.. వంటకోసం తెచ్చుకున్న గ్యాస్ సిలిండర్ పేలి ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో.. వారిద్దరూ సజీవ దహనం అయ్యారు. కేవలం పుర్రె, మొండెం మాత్రమే మిగిలి ఉన్న.. ఈ భయానక ప్రమాదం శుక్రవారం తెల్లవారుజామున మెదక్ జిల్లాలోని నార్సింగి మండలం కాస్లాపూర్ శివారులోని జాతీయ రహదారి 44పై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ భజంత్రీ బసవరాజ్(35), క్లీనర్ పుజేర్ నాగరాజు(27) కంటైనర్ లారీలో గత నెల 29న బెంగుళూరు నుంచి నాగపూర్‌కు బయల్దేరారు. అయితే నార్సింగి మండలం కాస్లాపూర్ గ్రామ శివారులో మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన మరో కంటైనర్ లారీని.. వెనుక నుంచి వచ్చి బసవరాజ్ నడిపిస్తున్న కంటైనర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బసవరాజు, నాగరాజు ఇద్దరూ క్యాబిన్ లో ఇరుక్కుపోయారు. అదే సమయంలో వంటకోసం తెచ్చుకున్న గ్యాస్ సిలిం డర్ పేలడంతో.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో వారిద్దరూ అక్కడికక్కడే సజీవ దహనం అయ్యారు. డ్రైవింగ్ సీట్లో ఉన్న మృతదేహానికి సగభాగం కాలిన పుర్రె, పక్క సీట్లో పడుకుని ఉన్నట్టు ఉన్న మృతదేహానికి కాలిపోయిన మొండెం, పుర్రె మాత్రమే మిగిలి ఉండడంతో.. ఘటనను చూసిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. అంతేకాకుండా ఈ నిలిపి ఉన్న లారీలో లోడ్ చేసి ఉన్నటైర్లకు మంటలు వ్యాపించాయి. విషయం తెలు సుకున్న తూప్రాన్ సీఐ శ్రీధర్, ఇతర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సాయంతో మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాద ఘటనపై నార్సింగి ఎస్ఐ నర్సింలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.